

సపరివార పత్రిక స్వాతి




ప్రమాదం ప్రసరించిన వేళ!
భయం ప్రవహించిన వేళ!
వేళ...ఆ వేళ...రహస్య రాక్షస లీల!
అవును!
ఆ నగరంలో ఫోన్‌లో మాట్లాడాలంటే
గజగజ వణికిపోయారు? ఎవరు?
మంత్రులు! ధనవంతులు!
ప్రముఖులు! ప్రేమికులు!
ప్రభుత్వాధికారులు! అధినేతలు!
అందరూ! అందరూ!!
ఫోన్‌లు డిస్‌కనెక్ట్ చేసుకున్నారు.
అసలు టెలిఫోన్‌లే రద్దు చెయ్యాలన్నారు!
ఏమిటీ వైపరీత్యం?
ఏమిటీ భయానక సన్నివేశం?
అది చెప్పడానికే
ప్రారంభమైంది.

చల్లా సుబ్రహ్మణ్యం
సీరియల్

టెలిఫోన్ ఆపరేటర్

సీరియల్ ప్రారంభ సంచిక మార్కెట్లో
సిద్ధంగా వుంది



అభిమాన పాఠకులకు సినిమా రంజని గాంధి టెక్స్
కల్పిస్తున్న బంగారు అవకాశం!!
మీకు బంగారు గాజులు కావాలా?
తెలుపు నలుపు టీ. వి. కావాలా?
ప్రెషర్ కుక్కర్లు కావాలా?
ఫ్లాస్కులు కావాలా?
వారానికి అయిదు అందమయిన గాంధి టెక్స్ చీరెలు కావాలా?
ప్రముఖ చీరెల ఉత్పత్తి సంస్థ "గాంధి టెక్స్" సహకారంతో ఆంధ్రపత్రిక ప్రచురణ అయిన నవచలన చిత్ర వార పత్రిక సినిమా రంజని నిర్వహించనున్న పథకంలో ఉత్సాహంగా పాల్గొనండి! విలువయిన బహుమతులను మీ సొంతం చేసుకోండి!
మరిన్ని వివరాలకు రాబోయే సంచికలలో చూడండి!!

న్యూఢిల్లీ లేఖ

డా. జయ్ దుబాషి



సున్నితమైన ఆయుధం పత్రికాస్వేచ్ఛ


కేవలం మూర్ఖులు, భజన పరులైన సంపాదకులు మాత్రమే ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో సమ్మెకూ, రాజీవ్‌గాంధీ అండ్ కంపెనీకి సంబంధం లేదని నమ్మగలరు. కొన్ని నెలలుగా వాళ్ళు రామనాధ్ గోయెంకాను పట్టుకుందామని ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు ఆయన పీకపట్టుకోగలిగామని వాళ్ళు అనుకుంటున్నారు. గోయెంకా మొట్ట మొదట వ్యాపారస్తుడు, ఆ తర్వాతే పత్రికాధిపతి కనుక ఆయన పత్రికలను అరికట్టగలిగితే ఆయనను ఇబ్బందుల్లో పడేసినట్టేనని వాళ్ళ వాదన సాగుతుంది. ఏదేమైనా వాళ్ళ తర్కం ఇది. సర్వజ్ఞుల లాగ ప్రవర్తిస్తూ సుదీర్ఘమైనటువంటి పండిత వ్యాసాలు రాసే కొందరు సంపాదకుల తర్కం కూడా ఇదే. కాని ఈ తర్కం మూర్ఖమైనది. ఆ సంపాదకులూ అటువంటి వాళ్ళే.

పత్రికాస్వేచ్ఛ అనేది ఒక అమూర్తమైనటువంటి విషయం కాదు. కేవలం సంపాదకీయాలకు మాత్రమే సరిపోయే టటువంటి విషయంకాదు. పత్రికాస్వేచ్ఛ అంటే అంతిమ విశ్లేషణంలో పత్రికలతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరి స్వేచ్ఛ అని అర్థం. పత్రికా స్వంతదారయిన యజమాని నుంచి, ఆయన కోసం ఆ పత్రికను నిర్వహిస్తూ ఉండే మేనేజర్, ఆపత్రికను రూపొందించే పాత్రికేయులు, ఆ పత్రిక వెలువడడానికి బాధ్యత వహించేటటువంటి సంపాదకుడు- వీళ్ళందరికీ సంబంధించినది పత్రికాస్వేచ్ఛ. ఈ పెద్ద భవనంలోంచి ఒక ప్రత్యేకమయినటువంటి ఇటుకను బైటికి లాగి, కొందరు వాదిస్తున్నట్టు, యజమాని రక్షణ కోసం సంపాదకుడు, లేదా ఇటునుంచి అటు వెళ్ళనవసరసం లేదని వాదించడం హ్రస్వదృష్టినే సూచిస్తుంది. అంతేకాదు, అది చాలా సంకుచితమైన వాదన. ఒక ఇళ్ళ వరుసలో ఒక ఇంటికి నిప్పంటుకుంటే మీ ఇల్లు ఎంత దూరాన ఉన్నప్పటికీ మీరక్కడ పక్కన నిలబడి వేళాకోళాలాడలేరు. మంటల్లో చిక్కుకో బోయే ఇల్లు మీదే కావచ్చును.

గోయెంకా అంటే ప్రతి మనిషికీ ఇష్టం ఉండకపోవచ్చు. ఆయన చాలా కటువయినటువంటి మనిషి కూడా. ఈ సంగతిని అత్యవసర పరిస్థితి బాధ్యులైన వారు బాధతోనూ, అవమానంతోనూ తెలుసుకున్నారు. ఆ పత్రికలు గోయెంకాకు చెందినవయినంత వరకు, ఆయన మీద దాడి పత్రికల మీద దాడే అవుతుంది. ప్రతి పౌరుడికీ వర్తించే సాధారణ చట్టాల నుంచి పత్రికాధిపతులకు మినహాయింపు ఉండాలని ఎవరూ కోరడం లేదు. కాని పాత్రికేయులతో సహా, సంపాదకులు, కార్మికులు తమ యజమానికి సాయం చేయగూడదని తద్వారా ఘర్షణలో ఉన్న పత్రికకు సహకారాన్ని అందించ గూడదనడం ఎందుకంటే పత్రిక మదుపు తమకుసంబంధం లేనిదనడం తర్కాన్ని దాని తప్పుడు నిర్ధారణల దాకా సాగదీయడమే అవుతుంది. పత్రిక పెట్టుబడులు ఆపత్రికలో పని చేసే వాళ్ళకు, దాన్ని వెలువరించడంలో సాయపడే వాళ్ళకు దేశపు స్థితిగతులంత, వాల్‌స్ట్రీట్ సంక్షోభమంత ముఖ్యమైనవవుతాయి.

అధికారికంగా చెపుతున్నంత తప్పుడు వైభవంతో మరొక మాట వినబడుతున్నది. పత్రికలంటే మరో రూపంలో రాజకీయాలు నడపడం కాదని, రాజకీయ వ్యవస్థ, పత్రికారంగం మరీ సన్నిహితం కాగూడదని ఈ వాదన వస్తున్నది. రాజకీయ వ్యవస్థ, దాని మీద అధికారం చలాయించే ఈ దేశపు కాంక్షాపరులయినటువంటి రాజకీయ నాయకులు పత్రికారంగం మీద ఆధిపత్యం వహించడానికి ప్రయత్నించక పోయినట్టయితే ఇది మంచి వాదనే. కాని ప్రతి మూల నుంచి పత్రికారంగం వేధించ బడుతున్నప్పుడు, ఎప్పుడూ ఒత్తిడికి లోనవుతున్నదని స్పష్టమయినప్పుడు పత్రికారంగం ఈ దాడిని, కనీసం ఆత్మ రక్షణ కోసమైనా తిప్పి కొట్టక తప్పదు. ఈ క్రమంలో చక్రబంధంలో ఇరుక్కున్న పత్రిక ప్రతిపక్ష రాజకీయ కార్యకర్తల సాయాన్ని ఆశిస్తే తప్పేమిటో నాకు అర్థం కావడం లేదు. ఒక చనిపోతున్న పత్రికకు సాయం చెయ్యడానికి ప్రతిపక్షం ఎందుకు వెళ్ళకూడదో కూడా నాకు అర్థం కావడం లేదు. ముఖ్యంగా ఆ పత్రికను అధికారంలో ఉన్నవాళ్ళు హత్య చేయడానికి ప్రయత్నిస్తున్నప్పుడు. చనిపోయిన వార్తా పత్రిక వార్తాపత్రికే కాదుగదా.

వార్తాపత్రికలు క్రియాశీల రాజకీయాలలో ఎందుకు పాల్గొన గూడదో కూడా నాకు అర్థం కావడం లేదు. ఒకప్పుడు ఎక్స్‌ప్రెస్ గ్రూపు పత్రికల యజమాని అయినటువంటి లార్డ్ బీవర్ బ్రూక్‌ను పత్రికల గురించిన రాయల్ కమిషన్ ఆయన పత్రికలు ఎందుకు నడుపు తున్నాడని ప్రశ్నించినప్పుడు "చాలా మామూలు విషయం. నేను ప్రచారం కోసం పత్రికలు నడుపుతున్నాను" అని ఆయనన్నాడు. ప్రతి ఒక్కరికీ తమ లక్ష్యాల కోసం




న్యూఢిల్లీ లేఖ

పత్రికలు నడుపుకోవడానికి హక్కుంది. అశోక్ జైన్ తన టైమ్స్ ఆఫ్ ఇండియాను – తన సంపాదకుడు గిరిలాల్ జైన్‌ను ప్రభుత్వం నుంచి కొన్ని లైసెన్సులు సంపాదించుకోవడానికి ఉపయోగిస్తే, అది ఆయన ఇష్టం. ఆయనకు మేలు జరుగుగాక. ఐతే, ఆయనకు ఆ శక్తి అంతిమంగా ఆయన పత్రికల కున్న పరపతి మీద ఆధార పడుతుంది. ఆ పరపతిని పాఠకులు, ఆ పత్రికల సాధికారత నిర్ణయిస్తాయి. ఒక ప్రజాస్వామిక వ్యవస్థలో చిట్ట చివరి నిర్ణాయక అంశం ఇదే – పాఠకులు, సాధికారత. బోఫోర్స్ వ్యవహారం మొదలయినప్పటి నుంచి టైమ్స్ ఆఫ్ ఇండియా సర్క్యులేషన్ క్రమ క్రమంగా పడి పోతున్నదని నేను విన్నాను. బొంబాయి, ఢిల్లీలలో కలిపి 50 వేల కాపీలు తగ్గిపోయాయట. ఆపత్రిక సాధికారత ఎంత పడిపోయిందో పాఠకులు తమ కొనుగోళ్ళతో చూపుతున్నారు. నేను పాఠకులను తప్పు పట్టడం లేదు. ఆ పత్రిక మోసగాళ్ళను, బంది పోట్లను, ఈ దేశాన్ని ఎడా పెడా దోపిడీ చేసిన మనుషులను సమర్థించడంలో అవధులు దాటింది. కాని ఆడంబరంగా ధ్వనించే ఆ సంపాదకీయాలేవీ చెదరిపోయిన పరిస్థితిని సవరించలేవు.

పాఠకులు తెలివితక్కువ వాళ్ళు కారు. వాళ్ళు ఒక డాక్టరు ఒక ఎక్స్–రే ఫోటోను చూసిన దానికన్నా వేగంగా ఒక పత్రికలోపలికి, ఒక సంపాదకుడి లోపలికి చూడగలరు. మీకు చాలా బ్రహ్మాండమైన పాత్రికేయుల బృందం ఉండవచ్చును. ప్రపంచంలో కెల్లా నిపుణులైన లేఔట్ ప్రవీణులు ఉండవచ్చు. కాని మీ పత్రికకు ఒక మచ్చ ఉంటే దాన్ని ఎవరూ చదవరు. బొంబాయిలో ఒక చెత్త కాగితంతో సమానమైనటువంటి పత్రిక ఉంది. అది తనను తాను దేశంలో కెల్లా, లేదా బహుశా ప్రపంచంలో కెల్లా గొప్ప వార్తా పత్రికనని ప్రకటించుకుంటోంది. అది కొన్ని సంవత్సరాల ... దినపత్రికను కూడా వెలువరించింది ... ఎవరూ చదవలేదు. అది దాని తండ్రి ... లేదా తల్లి అంత – అసభ్యంగా ఉండేది కాదు ... ఉదయం లేవగానే ఒక మురికితో నిండిన అసభ్యపు పత్రికను చూడడంకన్నా చేయగల మంచి పనులు చాలా ఉంటాయని పాఠకులు అనుకున్నారు. ఆ పత్రిక చచ్చిపోయింది. ఒక మూడో వ్యక్తికి అమ్మివేయ బడింది. ఆవ్యక్తికి చాలా డబ్బుంది గనుక కొన్ని సంవత్సరాలు నడుపుతాడు గాని అది జీవచ్ఛవమే. పాఠకులే దాన్ని చంపేశారు. ఎందుకంటే అంతిమంగా పాఠకులకే పత్రికేదో, చిత్తు కాగిత మేదో నిర్ణయించే అధికారం ఉంది.

కనుక కొందరు సంపాదకులు చేస్తున్నట్టు యజమాని విధుల గురించి, సంపాదకుడి విధుల గురించి శాసనాలు చేయడం మూర్ఖత్వమే. వాళ్ళు పత్రికా కార్యాలయాన్ని సబ్బులో, వంట నూనెలో తయారు చేసే ఒకరకం కార్ఖానాలా భావిస్తున్న ట్టున్నారు. వార్తాపత్రిక అనేది ఒక ప్రజాసంస్థ. దాని నియమాల్ని ప్రజలే నిర్ణయిస్తారు. మంచి వార్తాపత్రికేదో, చిత్తుకాగిత మేదో, ఏ వార్తా పత్రిక బతకాలో, ఏది చనిపోవాలో నిర్ణయించే ... ప్రజలే. బీవర్ బ్రూక్ తన పత్రికను ప్రచారం ... నడుపుతూ ఉండిఉండవచ్చు. కాని ఆయన అది ... తమే చేస్తున్నట్టయితే, ఆయన "ఎక్స్‌ప్రెస్" లాగా కొన్ని వందల కాపీల సర్క్యులేషన్ ఉన్నటువంటి పత్రిక నడుపుతుండే వాడు. రోజుకు నలభై లక్షల సర్క్యులేషన్ గల డెయిలీ ఎక్స్‌ప్రెస్ నడుపుతుండేవాడు కాదు. ఆ పత్రికకు సాధికారత ఉంది. దానికి సమగ్రత ఉంది. అందుకే దాన్ని ప్రతిరోజు లక్షలాది మంది పాఠకులు కొన్నారు. బీవర్‌బ్రూక్ తన ఇంట్లో నౌకర్లలాగా సంపాదకులను నియమించాడు, తొలగించాడు. వాళ్ళు ఆయన ఏం రాయమంటే అది రాశారు. మన సంపాదకులలో కూడా చాలా మంది చేసే పని అదే. తాము తమ సామ్రాజ్యాలకు అధిపతుల మని భ్రమింప జేసే నేర్పు వాళ్ళ కుండవచ్చుగాక. పత్రికా స్వేచ్ఛ అనేది అటువంటి వ్యక్తుల చేతికి అందించ డానికి వీలు లేని సున్నితమైన ఆయుధం. □




నెస్టమ్ బేబి సిరియల్
ప్రారంభించేందుకు ఆదర్శప్రాయమైనది
పెరుగుదలకు ఆదర్శప్రాయమైనది
నెస్టమ్, పాలు-పూర్తి పోషక విలువలున్న ఆహారం.
మీ బాబు, సుమారు 4 నెలలవాడయేసరికి, కాచిన పాలతోపాటు ఘనఆహారం. పాపాయికి తేలిగ్గా జీర్ణమయ్యే, ప్రత్యేక శ్రద్ధతో తయారయిన నెస్టమ్ బేబి సిరియల్ ని పెట్టడం ప్రారంభించండి. ముందుగా మరిగించి చల్లార్చిన గోరువెచ్చటి పాలతో కలపండి. ఇక, పూర్తి పోషక విలువలున్న ఆహారం సిద్ధమవుతుంది.
పాపాయి ఆరోగ్యంగా, బలంగా పెరిగేందుకు తోడ్పడుతుంది.
నెస్టమ్ తో వివిధ వంటలు-పాపాయి ఆహారంలో బోలెడన్ని రకాలు
మీ పాపాయి ఎదుగుతున్న కొద్దీ క్రొత్త రకాలు రుచి చూపించండి.
ఉడికించిన కూరముక్కలూ, పండ్ల ముక్కలూ, పప్పు-వీటిని నెస్టమ్ తో కలిపి పెట్టండి. బాబు, కుటుంబంలో మీవారు తినే ఆహారాన్ని తినుకోవటం నేర్చుకునేందుకు ఇది తోడ్పడుతుంది.
నెస్టమ్®
రైస్
ఇనుము-విటమిన్లతో కూడినది
పాలలో కలపండి.
ఉచితం
మీ బాబు, తన ఆహారంలో, క్రొత్త రుచులను కోరుతాడు అందుకని-మీ ఉచిత నెస్టమ్ వంటల పుస్తకం కోసం రాయండి.
నెస్టమ్
పోస్ట్ బాక్స్ నెం. 6016,
న్యూ ఢిల్లీ-110008.
Nestlé
Nestlé
Nestum
baby cereal
Rice
mix with milk
Nestlé
Nestum
baby cereal
Rice
mix with milk

సీరియల్

ఈ తరం యువతి



వడ్లమన్నాటి కుటుంబరావు

(గత సంచిక తరువాయి)

వరుడు ఒంగోలులో ఫైనాన్స్ కంపెనీ అధినేత. ఆర్థికంగా బోలెడంత బలముంది. అయితే అతనివంశంలో అన్నలందరి భార్యలూ.... రెండుమూడేళ్ళు కాపురం చేసి... వల్లకాటికి చేరిపోయినవారేనట! ఇతని అన్నయ్య భార్య... మా అక్కయ్య విజయకి క్లాస్‌మేటట. పుట్టింటికి చుట్టంచూపుగా వచ్చిన మా విజయ... ఈ విషయం చెప్పి కట్టుకున్న భార్యల అకాలమరణం ఆ వంశం కానవాయితీ అని..... పొరపాటునగూడా ఈ సంబంధం చెయ్యొద్దనీ.... అలాగనక చేస్తే..... నా గొంతుకోస్తే... తను ఆత్మాహుతి చేసుకుంటాననీ.... దీన్నిబట్టి తనకి చెల్లెలుమీద ఎంత గాఢమైన అభిమానముందో అంచనా వేసుకోమనీ గట్టిగా చెప్పింది. హఠం వేసి. దాంతో ఆ సంబంధం కూడా క్లోజ్!

మరి మా వదిన దేనికీ అడ్డుపడలేదా? అని మీకు సందేహం కలగొచ్చు. ఆమెకూడా తనవంతు పాత్ర నిర్వహించింది.

ఏలూరు నుంచి ఒక సంబంధం వచ్చింది. వరుడు ఓ పది ట్యుటోరియల్ కాలేజీలను నిర్వహిస్తున్నాడు. లక్ష్మీపుత్రుడు. నీడపట్టున వుండేవాడేమో.... మనిషి చాలా అందంగా టిప్ టాప్‌గాకూడా వున్నాడు. అతని తల్లి, చెల్లెళ్ళు.... వాళ్ళమ్మగారి ద్వారా మా వదినకు బాగా తెలుసుట. ఈ సంబంధం చేస్తే మృదుల మన చూపులకుకూడా దక్కదు. అత్తగారు రాక్షసబ్రాండ్! ఆడపడుచులు..... నంగనాచులు..... చుప్పనాతులు. పత్రికలలో తరచుగా పడే కిరసనాయిలు డబ్బాలు.... అగ్గిపుల్ల గియ్యటాలు వార్తని నిజంచేస్తారు..... అంటూ బావురుమంది.

మనమంతాలేమా..... వాళ్ళలా చేస్తే, పాతిపెట్టమా? అని క్రాస్ చేశాడన్నయ్య.

మన పిల్ల మనకి దక్కకపోయిన తరవాత మీరు ఎవరిని ఏం చేస్తేమాత్రం లాభమేమిటండీ? అంటూ -ముక్కు చీది, ఉక్కుపట్టుపట్టింది. ఇంకేముంది......? అమ్మకూడా ఏడుపు లంకించుకుంది వత్తాసుగా. దాంతో ఆ సంబంధం పత్తాలేకుండాపోయింది.

మచిలీపట్నం నుంచి ఓ సంబంధం వచ్చింది. వరుడు ట్రాన్స్ ఎక్స్‌పోర్ట్సు కంపెనీ ప్రొప్రయిటర్. వ్యాపారం లక్షలమీద నడుస్తోంది. కానీ అతని పెద్దవాళ్ళు హంతకులట! ఈ విషయం మా నాయనమ్మకు బాగా తెలుసట. ఎప్పుడన్నా దీనిమీద కోపం వస్తే కసుక్కున దింపుతాడు పొట్టలో కత్తి! వద్దే వద్దు.... అంది నాయనమ్మ. దీనికి భయపడిపోయారంతా. అలా ఆ సంబంధం నట్టేట్లో కలిసిపోయింది.

రాజమండ్రి నుంచి వచ్చిన సంబంధంలో .... వరుడికి కోనసీమలో .... లక్షలు ఖరీదుచేసే నాలుగు కొబ్బరితోటలున్నయ్. వాటిమీద బోలెడంత రాబడి వస్తోంది. అతని తల్లి...... ఆమె చెల్లి.... అంతా ఒక మొగుడితో కాపురం చేసేవాళ్ళు కాదుట. మొగవాళ్ళు తాగుబోతులట. ఈ విషయం అమ్మమ్మకి బాగా తెలుసుట! "చూస్తూ చూస్తూ అలాంటి కొంపకి ఎలా పంపించుతాం పిల్లని..." అంది ఈసడింపుగా. అమ్మ... వదిన ససేమిరా కుదరదన్నారు. ఆ సంబంధం కూడా గోవిందా!

ఆ తరువాత ఇంకా కొన్ని సంబంధాలొచ్చాయి. ఇంట్లో వున్న కుటుంబ సభ్యులలో ఏకాభిప్రాయం ఎన్నటికీ కుదరలేదు.

ఒకళ్ళు నలుపనేవారు.

మరొకళ్ళు పొట్టి అనేవాళ్ళు.

అందం వుంటే, ఆస్తి లేదనో... ఆస్తి వుంటే అందం లేదనో... పిల్లవాడు ముంగిలా వున్నాడనో..... గుడ్లగూబ మొహం వేసుకున్నాడనో....... పాలిపోయి వున్నాడనో.... భయంకరంగా వున్నాడనో....... మన్నుతిన్న పాములా వున్నాడనో వాదోపవాదాలు చేసుకొనేవారు.

ఒక్కొసారి అలగాజనంలా పోట్లాడుకునేవాళ్ళు.

మరోసారి భోజనాలు మానేసి తమ నిరసన ప్రదర్శించుకునేవాళ్ళు.

అక్కయ్యలూ..... నా పెళ్ళిచూపుల.... పలు అధ్యాయాల ప్రహసనం యింతటితో సమాప్తం! ఇప్పుడుచెప్పు నిర్మలా.... మీరుకూడా చెప్పండే కమలా, సుశీలలూ......

"నాకు పెళ్ళి నిశ్చయం కాకపోవటానికి లోటు నాదే...!"

"నేను మూసకమ్మను!"

"ఆడతనం లేనిదాన్ని!"

"ఫ్రిజిడిటీ వున్న అమ్మాయిని!"

"మృదులా స్టాపిట్" బాధగా అన్నది నిర్మల. "అప్పుడప్పుడూ నీ పెళ్ళిచూపులకు మేంకూడా వచ్చినప్పటికీ...... ఇన్ని వివరాల్ను మాకు తెలియవు. ఇప్పుడు తప్ప యిదివరకెప్పుడూ నువ్వుకూడా ఇలా చెప్పలేదు. అందుకే... నీచేత వివరాలు చెప్పించటానికే... నేనంత కటువుగా మాట్లాడాను. నన్ను క్షమించు" ప్రాధేయపూర్వకంగా అంది.

"అవునే మృదులా. నీగురించి నిర్మల ఎంత వర్రీపడిపోతోందో మాకు తెలుసు. ముఖ్యంగా ఆ రాతికి చుట్టిన కాగితం చూసిన దగ్గరనుంచీ...... నీకేదో

జరిగిన కథ – 7 : మృదులకు ఆడతనం లేదని జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఎదుర్కొనేందుకు మృదుల మిత్రులు ఆలోచనలు చేస్తుంటారు. ఆ ఆలోచనల్లో భాగంగా మృదులకు జరిగిన పెళ్ళి చూపుల వివరాలు కనుక్కుంటుంటారు. ఏయే సంబంధాలు ఎట్లా తప్పిపోయాయో మృదుల చెపుతుంటుంది.

చెయ్యాలని ఒకటే తపనపడిపోతోందే. మమ్మల్ని అసలు నిలవనీయటం లేదు." అన్నారు సుశీల... కమలలు.

"టేకిటీజీ నిర్మలా..... అయినప్పుడే అవుతుంది నా పెళ్ళి. ముందు నేను మీ పెళ్ళిళ్ళకి అట్టెండయి మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలుపుతాను."

"ఎలా ఈజీగా తీసుకోమంటావే.... మీ వాళ్ళంతా కలిసి నీకు పెళ్ళికాకుండా చేస్తుంటే......" ఆవేశంగా అంది నిర్మల.

"నిమ్మీ!" గట్టిగా అరిచింది మృదుల.

ఆమె అరుపుకు అటునడిచివెళ్ళే ఇద్దరమ్మాయిలు... ఒక్కక్షణం ఆగి అలా చూసి వెళ్ళిపోయారు.

ఉలిక్కిపడింది నిర్మల. "ఏమిటే?" అంది ప్రశ్నార్థకంగా.

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్...... వాళ్ళెవరనుకున్నావ్? జన్మ యిచ్చిన తండ్రి.. ... తల్లి. రక్తం పంచుకుపుట్టిన సోదరులు...... సోదరి..... సాక్షాత్తూ అన్నయ్య ధర్మపత్ని వదిన...... మా అమ్మకు...... నాన్నకు జన్మ యిచ్చిన మాతృశ్రీలు....."

"ఎవరైతే ఏమే...... వాళ్ళేగా దీనికంతటికీ కారకులు?"

"దేనికి?"

"నీ పెళ్ళికాకుండా వుండటానికి"

"అంటే..... కావాలని వాళ్ళు నా పెళ్ళి చెడిపోవాలని కోరుకుంటున్నారంటావా? వాళ్ళకి నామీద ప్రేమ లేదంటావా"

"అలా అని నేనంటంలేదు."

మరి నువ్వు చెప్పదలుచుకున్న దేమిటీ"

"ఒక తల్లి కడుపున పుట్టిన బిడ్డలందరూ ఒకేలా వుంటున్నారా... మాటల్లోగానీ... చేతల్లోగానీ...?"

"లేదు."

"అలాగే... ఒక వరుడు మీ యింట్లో వున్న భిన్నాభిప్రాయాలుగల కుటుంబ సభ్యులందరికీ నచ్చటం అసంభవం. నీకు యింకా... యింకా మంచి సంబంధం తేవాలనీ... నీ బ్రతుకును నందనోద్యానవనం చెయ్యాలనీ, గొంతెమ్మ కోరికలకు పోయి... వాళ్ళకు తెలియకుండా నీకపకారం చేస్తున్నారు. అందంగా ఆత్మ వంచన చేసుకుంటున్నారు. నీ వయస్సు పెరిగిపోతోందని, నీ మనసు నిరాశ... నిస్పృహలకు లోనవుతోందని గమనించే స్థితిలో వాళ్ళు లేరు. తమ కూతురికి... ఆకాశంలోంచి... చుక్కల్లోంచి ఓ అపురూప సౌందర్యవంతుడు, అసమాన ధనవంతుడు... సాటి లేని మేటి వరుడు దిగి వస్తాడనుకుంటే ఇప్పటికే నీ



ఈతరం యువతి

పయస్సు... వివాహం చేసుకునే లేత వయస్సు నుంచి రెండు మూడు సంవత్సరాలు... అవతలకి పాకిపోయింది... పెళ్ళి చూపులు... మీ కుటుంబ సభ్యుల తర్జన భర్జనల పుణ్యమా అని ఇంకా నువ్వు ఇంత అందంగా వుండటం కేవలం నీ అదృష్టం. నీలా నాలుగయిదు సంవత్సరాలు గడిచిపోతే... నీ అంతట నువ్వు పెళ్ళి చేసుకుంటానని వెంట పడినా... పెళ్ళికొడుకులు తుళ్ళిపడి పారిపోతారు. నీకీ జన్మలో పెళ్ళంటూ కాదూ. ఇప్పటికే... నోరు మాట్లాడుతూ వుంటే, నొసలు వెక్కిరించే అమ్మలక్కలు... చాటుమాటున నీ గురించి ఎన్నో ప్రచారాలను వెలుగులోకి తెచ్చి వుంటారు. ఇప్పటికయినా నువ్వు మేలుకోకపోతే నీకు మరో మార్గమే లేదు ఆత్మహత్య తప్ప..."

"అయితే ఇప్పుడు నన్నేం చెయ్యమంటావ్ ?" ఆవేదనగా అడిగింది మృదుల.

చెప్పింది నిర్మల.

"నిమ్మీ.... ఎలాంటి సలహా చెపుతున్నావ్!" కీచుగా అరిచింది మృదుల.

"ఏం బాలేదా?" నవ్వుతూ అడిగింది నిర్మల.

"ఛీ!! నీకు నవ్వెలా వస్తోందే నిమ్మీ. స్నేహితురాలివి గదాని నా పెళ్ళి సంబంధాల వివరాలన్నీ నీకు చెపితే..... చివరగా ఇదా నువ్విచ్చే తప్పుడుసలహా? తల్లిదండ్రుల్ని, మిగతా ఫ్యామిలీ మెంబర్లనీ ఎదిరించ మంటున్నావా? తిరగబడమంటున్నావా? బరితెగించిన ఏ కొద్దిమంది ఆడపిల్లలో తప్ప..... మన దేశంలో పొందికయిన అమ్మాయిలు యిలాంటి వెధవపనులు చెయ్యగలరా? చివరికి నువ్వుకూడా బ్రో. హౌ. బం లాగా మాట్లాడేట్టున్నావే?" అంది మృదుల విషాదంగా.

"అదేం పేరే వింతగావుంది?" అంది నిర్మల.

"ఎవరా బ్రో.హౌ. బం?" అంది సుశీల ఉత్సుకతగా.

"ఏ మాకథ?" అంది కమల ఆరాటంగా.

"చెపుతున్నా వినండి. ఆమె సూర్యారావుపేటలో నే ఒక ట్యుటోరియల్ కాలేజీ పక్క సందులో.... చివరిగొందిలో వుంటుంది. అందరూ ఆమెని.... బండమ్మాయ్ అంటుంటారు."

"రోలర్ బండలా వుంటుందా?"

"కాదు..... సన్నగా రివటలా వుంటుంది."

"మరి బండమ్మాయ్ ఏమిటి?"

"వాళ్ళ తల్లిదండ్రులకి ఈమంటే చాలా గారాబంట! అందుకని ఏం పేరు పెట్టాలా అన్న విషయం మీద వాళ్ళు పగళ్ళూ రాత్రుళ్ళూ తేడాలేకుండా వాదించుకుని..... ఏ విషయం తేలక ఈమెని చాక్లెట్లు..... బిస్కట్లు...... చిరుతిళ్ళూ వగైరాలతో తెగమేపేశారు!! మామూలు భోజనం కాకుండా పేరు సంగతి దేవుడెరుగుగానీ ఈమెమాత్రం బాగా వూరిపోయిందట. గౌనులు, పరికిణీలు.... లంగాలు.... ఇవ్వాళ కుట్టిస్తే చాలు రెండు రోజులకల్లా బిగుతయిపోయేవట. ఏమిటి...? మనమ్మాయి యిలా బండమ్మాయిలా తయారవుతోందేమిటి? అనుకున్నారట – తల్లిదండ్రులు. అంతే! తక్కున ఈ అమ్మాయికి పేరు కుదిరిందట! "బండమ్మాయ్" అనే పేరు పెట్టారట..... మనమ్మాయి తినే తిండికికూడా దిష్టితగలకుండా వుంటుందిలేఅనికూడా అనుకున్నారట.



"మరి బ్రో. హౌ. బం అన్నావు అదేమిటి?" సందేహం వెలిబుచ్చింది కమల.

"ఆ సస్పెన్సు – చివరలో పొడుపుకథలా మీచేత విడిపించేస్తాలే.... అద్దం రాకు బండమ్మాయికి మా బాంకులో ఎక్కౌంటువుంది. ఏం బిజినెస్ చేస్తుందో ఏమోగానీ... రోజూ డబ్బు వెయ్యటమేగానీ తీసేపనివుండదు. ఈపని స్వయంగా తనే చేస్తుంది. ఇతరుల నెవ్వర్నీ పంపించదు. అందువల్ల రోజూ సుప్రభాత దర్శనంలా.... మాకు బండమ్మాయ్ నిండు విగ్రహం ఉదయం వేళల్లో కనిపిస్తుంటుంది సెలవురోజుల్లో మినహా. బండమ్మాయ్ చాలా కలుపుగోలుమనిషి. మా బాంక్‌కి వస్తే చాలు..... అందర్నీ నోరారా పలకరిస్తుంది. ప్రియమారా మాట్లాడుతుంది. మనంకూడా కలుపుగోలుగా మాట్లాడితే..... పక్కనకూర్చునో... నిల్చునో హస్కువేస్తుంది. బాంకుపని సాగకుండా ఉస్కులోపెడుతుంది. మనం విసుక్కున్నా..... తను విసుక్కోకుండా నవ్వుతూ వెళ్ళిపోతుంది. నేను మాత్రం ఎక్కువగా దగ్గరికి రానిచ్చేదాన్నికాదు. ఆమె ఓవర్‌యాక్టివ్‌నేస్ నాకు నచ్చలేదు.

అయినా నన్ను ఒకసారి పట్టేసింది.

హోటల్ సిద్ధార్థలో కూర్చుని కాఫీ తాగుతున్నాను ఒకసారి తలబద్దలు కొట్టేస్తుంటే.

"హల్లో! మృదులాదేవీ" అన్న కంఠం వినిపించి...... పక్కకుతిరిగి చూశాను. బండమ్మాయ్! చచ్చాంరాబాబూ! ఏ. సి. హోటలు కట్టేసేవరకూ బోరు కొట్టేస్తుందన్నమాట!! అనుకున్నాను. ఏదో వంకతో తప్పించుకోకపోతే..... నాపనిఖాళీ..... అనుకున్నాను. వెయిటర్ రాగానే కాఫీకి ఆర్డరిచ్చి..... కబుర్లు మొదలు పెట్టింది. ఆమె అదృష్టం ఏమంటే దగ్గరలో నాలుగయిదు టేబిల్సు ఖాళీగావున్నయ్. లేకపోతే..... ఈమె వీరసుత్తికి..... వాళ్ళు ఈమె నెత్తి పగలగొట్టి...... టేబుల్‌కిందపెట్టి పారిపోయివుండేవాళ్ళు.

ఏమిటో మాట్లాడేస్తోంది బండమ్మాయ్. రాజధానిలో నీళ్ళులేక జనం స్నానం చేయక కుళ్ళుకంపు కొడుతున్నారనీ.... విజయవాడలో సిటీబస్సుల రేట్లు పెంచటం పిటీ అనీ....స్కూటర్లమీద కూర్చున్న ఆడా.... మగా యిద్దరికీ హెల్మెట్లు వుండాలని రూలేమిటే (బండమ్మాయి ఊహ..... ఫ్యూచరుకి సంబంధించినదయివుండాలి). అవేమన్నా ఆమ్లెట్లు.... విజయవాడ రైల్వే స్టేషన్‌లో..... ఆన్ ది స్పాట్..... వేడివేడిగా వేయించుకుని లొట్టలేస్తూ తింటానికి.... ఇలా ప్రతి సబ్జెక్టుమీద తన జన్మహక్కు అన్నట్టుగా మాట్లాడేస్తోంది. నేను చేతుల్తో తలపట్టుకోలేక మనసులోనే తిట్టుకుంటూ కూర్చున్నాను.

సడన్‌గా గొంతు తగ్గించి టాపిక్ మార్చింది బండమ్మాయి. మన కుళ్ళిపోయిన పెళ్ళి వ్యవస్థని తీసుకెళ్ళి...... పాతరవేసి జాతరచెయ్యాలి అంది.

నాకేం అర్థంకాలేదు. కానీ ఆసక్తిగా చూశాను పెళ్ళికి సంబంధించిన విషయమనేసరికి.

ఎవడో రావటం..... పెళ్ళిచూపులు చూడటం...... నచ్చితే పెళ్ళి...... నచ్చకపోతే హళ్ళికిహళ్ళి! దీన్లో ఓ జాతీయవిప్లవం తీసుకురావాలి అంది.

ఏమిటన్నాను.

నీ విషయమే తీసుకో...... యిప్పటికి నీ కెన్ని పెళ్ళిసంబంధాలు చూశారు. మీపెద్దల..... గద్దల...... పుణ్యమా అని ఒక్కటయినా కుదిరిందా? ఇలా

ఎన్నేళ్ళుంటావు? ఆ ఏడుకాఏడు పైబడేసరికి..... శరీరంలో లావణ్యం..... ముఖంలో అందం చందం తగ్గిపోయి, కళావిహీనంగా తయారవుతావు. అందుకని..... పెద్దవాళ్ళకి బుద్ధి లేకపోతే మనకన్నా వుండాలి? అంది.

కళ్ళెత్తి చూశాను...... ఏమిటన్నట్లుగా.

పెళ్ళివరకూ..... వయసుకు కళ్ళెం వెయ్యరాదు. దాని దారి దానిదే.... మనదారి మనదే....!

మీరు చెప్పేదేమిటో నాకర్థం కావటం లేదు. అన్నాను.

మా యింటికి వెడదాం. రా! అక్కడ ఎన్ని జంటలు..... తమ వలపులు పండించుకుంటున్నారో..... తమ కోర్కెలు నిండుగా తీర్చుకుంటున్నారో చూద్దువుగాని.

అదొక భూతల స్వర్గం.

అక్కడ దొరికేది అమర సుఖం.

అంతా గప్‌చిప్... గుట్టు చప్పుడుగా జరిపించే బాధ్యత నాది. నువ్వొక్క పైసా తీసుకురానక్కరలేదు. వెళ్ళేప్పుడు... వేలు పట్టుకెళ్ళచ్చు.

ఆమె చెప్పదలుచుకున్నదేమిటో నాకర్థమయింది. ఆమె రోజూ... బ్యాంకులో డబ్బు వెయ్యటం మాత్రమే ఎలా చేస్తోందో నాకు తెలిసొచ్చింది.

నరనరాన ఆమె అంటే జుగుప్స కలిగింది.

బండమ్మాయ్‌గారూ! ఇది హోటలయిపోయింది లేకపోతే... పచ్చడి బండ పెట్టి... మీ తల చితక్కొట్టేదాన్ని... ప్లీజ్ గెటవుట్! అన్నాను.

ఏమనుకుందో ఏమో... బేరర్ తెచ్చిన ప్లేట్లో అయిదు రూపాయల కాగితం పెట్టి... వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది. ఇప్పుడు చెప్పండే బ్రో.హౌ.బం. అంటే ఏమిటి కమలా?" అంది మృదుల.

పెదవుల మీద వేలుంచుకుని ఆలోచించి... పెదవి విరిచేసింది కమల... తెలియలేదన్నట్టుగా.

"నువ్వు సుశీలా!" అంది.

"నాకూ స్ట్రైక్ కావటం లేదే!" అంది సుశీల బేలగా.

"వసేయ్ మృదులా... నన్నడగవేమే ఇడియట్!"

"గొప్పలు చెప్పుకుంటున్నావు... చెప్పు చూద్దాం."

"వ్యభిచార గృహాధికారిణి బండమ్మాయ్."

"తప్పు" అంది మృదుల వెక్కిరిస్తూ.

"నోర్మూయ్యవే..... తెలుగులో చెప్పాను ముందు. ఇప్పుడు ఇంగ్లీషులో చెపుతా విను. బ్రోతల్‌హౌస్ బండమ్మాయ్."

"దట్సిట్" అంటూ అరిచారు సుశీల, కమల.

"నిమ్మీ ఈజ్ కరక్ట్" ప్రశంసించింది మృదుల.

కానీ నిర్మల ముఖం వాడిపోయివుంది.

అదిచూచి కంగారుపడిపోయింది మృదుల.

"వాట్ నిమ్మీ! వాట్ హాపెండ్?" ఆదుర్దాగా అడిగింది మృదుల.

"చివరికి నన్ను ఆ బండమ్మాయితో పోల్చావన్నమాట!" విషాదంగా అంది నిర్మల.

ఆమె హర్టయినట్టు గ్రహించింది మృదుల.

"సారీ! నిమ్మీ! ఆ కోపంలో... ఒళ్ళు తెలియక అనేశానుగానీ..... నిన్నా బ్రోతల్‌ముండతో పోలుస్తానా...... నెవర్! నన్నూ..... నా ఆవేశాన్ని క్షమించు.... యూ ఆర్ మై బోసమ్ ఫ్రండ్" అంటూ చేతులు పట్టుకుంది మృదుల.

"నిమ్మీ..... మృదుల..... ఏక్.... ఏక్" అంటూ సంతోషంగా చప్పట్లు కొట్టారు కమల – సుశీలలు.

ఫక్కున నవ్వింది నిర్మల.

మృదుల భుజంమీద మృదువుగా తట్టింది.

"ఎప్పుడన్నా..... ఏమన్నా అనుకున్నా.... వెంటనే రాజీ పడిపోతారే.... అదేట కన్నెపిల్లల కోడ్ అంటే" నవ్వుతూ అంది నిర్మల.

ఈతరం యువతి

మృదులకిప్పుడు మనసెంతో తేలికగా ఉంది.

సంధ్య వెలుగు స్థానే చీకటి తెరలు కిందికి దిగి పరుచుకొన్నాయి.

కార్పొరేషన్‌వారి లైట్లు గప్పున వెలిగాయి. ఆ నియాన్ లైట్ల వెలుగులో అందంగా మెరుస్తోంది గాంధీకొండ.

అక్కడి నుంచి చూస్తుంటే విజయవాడ సర్వాలంకార శోభితమైన దీపసుందరిలా ఉంది.

"మృదులా... ఈనాటి మన సమావేశం ఫలప్రదమయిందని నేననుకుంటున్నాను. నీకు పెళ్ళి సంబంధం కుదరకపోవటానికి మూల కారణం స్థూలంగా తెలిసిపోయింది. ఇంకా నీకు ఎన్ని సంబంధాలు వచ్చినా మీ ఇంట్లో ఏకాభిప్రాయం కుదరదనే సంగతి ఖచ్చితంగా తెలిసిపోయింది. కనుక తిరగబడు అనటంలో నా ఉద్దేశ్యం తల్లిదండ్రులను ఎదిరించమనిగాని... తప్పుడు పనులు చెయ్యమనిగానీ గాదు. నీ పెళ్ళి విషయంలో కొంత చొరవ నువ్వు తీసుకోవలసిన సమయమాసన్నమయ్యింది. అయితే పులిమీద పుట్రలా.. నువ్వు ఆడతనం లేని దానివని అపవాదు వేసేదెవరో తేలాల్సి ఉంది. అంటే... ఎవరో నీకు వివాహం త్వరలో జరగకూడదని కోరుకుంటున్నారన్నమాట! ఆ మిస్టరీ ఏమిటో ఛేధించాలి. ఎనీవే... ఆ హిస్టరీ అంతా నేను చూసుకుంటాను. నాకు తోడుగా సుశీల... కమలలు ఉన్నారు. నువ్వు నిశ్చింతగా ఉండి... నాకు సహకరించు. నీ పెళ్లి జరిగి తీరుతుంది. ఈ పెద్దవాళ్ళకు కనువిప్పు కలిగి తీరుతుంది!" అంది నిర్మల ఏదో నిశ్చయానికి వచ్చినట్టుగా.

నీకు ... కమలకీ పెళ్ళి సంబంధాలు నిశ్చయమయినయ్ గదా... నా విషయంలో మీరెంత వరకూ చెయ్యగలరే... మీ ఆరాటంగానీ? రేపు పెళ్ళిళ్ళయిన తరవాత... మా స్నేహితురాలి పెళ్ళి చేసిగానీ... మీతో కాపురానికి రాము అంటే... మీ మొగుళ్ళు ఊరుకుంటారుటే? గోళ్ళు ఊడగొట్టి పంపిస్తారు" మృదుల ముఖంలో ఆవేదన చోటు చేసుకుంది.

"అదా నీ ధర్మసందేహం చిట్టి తల్లీ! పంచాంగ కర్తల పుణ్యమా అని ఇంకా నాలుగు నెలల వరకూ పొరపాటున కూడా పెళ్ళి ముహూర్తాలు లేనే లేవట. కాబో యే మొగుడ్ని అంత వరకూ కోల్డ్ స్టోరేజీలో కూర్చోపెట్టి.


గోల్డ్ స్పాట్ తాగవయ్యా మహానుభావా అనాల్సిందేనట. అందువల్ల ఈ నాలుగు నెలలూ... మా కాన్‌సెన్‌ట్రేషనంతా– మృదులా దేవీ కల్యాణం మీదనే! దేవుడు మేలు చేస్తే... మన నలుగురి పెళ్ళిళ్ళూ.... ఒకే వారం జరగకూడదని ఏముంది?" అంటూ హుషారుపరచింది నిర్మల.

మృదుల ముఖంలో ప్రసన్నత చోటు చేసుకుంది.

"ఏమే కమలా?" అంది నిర్మల.

"ఓ. కె" అంది కమల.

"ఏమే సుశీలా?"



"డన్" అంది సుశీల.

"హాట్ డ్రింక్స్ హాట్ డ్రింక్స్" కేకలు వినిపించింది.

"ఏమే సుశీలా? హాట్ డ్రింక్స్ అంటున్నాడు బ్రాందీ విస్కీలా" నవ్వుతూ అంది నిర్మల.

కేకేసింది మృదుల. ఫ్లాస్కులో టీ! నలుగురికీ ఇమ్మంది డబ్బులిస్తూ. కప్పుల్లో పోసి ఇచ్చాడు వాడు.

"హాట్ డ్రింక్స్ అంటున్నావెందుకనోయ్?" అంది సుశీల.

"నిజంగా హాట్ డ్రింక్సేమో అనుకుని పిలిచి... పిలిచిన తరువాత తీసుకోక పోతే బాగుండదని తాగుతారండి చాలామంది. ఇది వ్యాపార రహస్యమండి" అన్నాడు. అంతా నవ్వారు.

కొన్ని క్షణాల్లో మూడు లూనాలు... ఒక స్కూటరు బై... చెప్పుకుని ఇళ్ళకు తిరుగుముఖం పట్టాయి.

* * * * * *

ఓ పక్షం రోజుల కాలం సలక్షణంగా గడిచిపోయింది. ఈలోపుగా మధుసూదనం గారింటికి రెండుసార్లు వచ్చి... మృదులనీ మిగిలిన కుటుంబ సభ్యులనీ పలకరించి వెళ్లాడు రవికాంత్.

మృదుల ఇదివరకటిలాగానే బాగానే మాట్లాడింది ఆప్యాయతగా.

తనని చూడగానే ఆమె కళ్ళల్లో కనిపించే మెరుపుని గుర్తించగలిగాడతను.

మర్యాదలు మన్ననలు అన్నీ అయిన తరవాత... అన్నాడు మృదులతో.

"ఇంకోసారి యాక్సిడెంట్ చేద్దురూ" నవ్వాడు.

"రవికాంత్. పొరపాటున కూడా అలా అనొద్దు. ఏం ఎందుకని?" కంగారుగా అంది మృదుల.

"మరి మీరు మాట తప్పారుగా?"

"నేను మాట తప్పానా? వ్వాట్?"

"మీ యింటికి ఆహ్వానించరా అని నిష్ఠూరాలేశారు ముందు. తీరా ఆహ్వానించిన తరవాత ఇంతవరకూ మా ఇంటికే రాలేదు మీరు. అమ్మ... నాన్న... బామ్మ... చెల్లెళ్ళు మీ రాకకోసం ఎలా ఎదురుచూస్తున్నారో తెలుసా?"

"అయితే... మీరు ఎదురుచూడటంలేదన్నమాట!"

"నిజం చెప్పమంటారా?" తడబడ్డాడు.

"అబద్ధం చెప్పొద్దు" కనుకొలకులోంచి చూసింది.

"వాళ్ళకన్నా కళ్ళల్లో వత్తులువేసుకుని చూసే ఇడియట్ ఒకడున్నాడా యింట్లో..... వాడి పేరు రవికాంత్" సిగ్గుపడుతూ అన్నాడు.

సన్నగా మందహాసం చేసింది మృదుల.

"నేను మీ యింటికి రానేరాను" అంది గంభీరంగా.

"ఎందుకని?" రవికాంత్ ముఖం పాలిపోయింది.

"రవికాంత్‌ని ఇడియట్ అనే హక్కు రవికాంత్‌కి కూడా లేదు. అలాగయితేనే వస్తాను."

"ఓ. కే." నవ్వేశాడు రవికాంత్.

"డబుల్ ఓ. కే. తనూ సరదాగానవ్వింది.

"మృదులా....." అన్న కేక వినిపించింది లోపల్నుంచి గట్టిగా.

"ఎక్స్క్యూజ్‌మి.... మమ్మీ పిలుస్తున్నట్టుంది. వన్‌సెకండ్‌లో వస్తాను."

"నో ప్రాబ్లమ్."

రుక్మిణమ్మ.... మృదుల మాట్లాడుకుంటూ రవికాంత్ వున్న గదిపక్క గదిలో కొచ్చినట్టున్నారు.

"అమ్మాయ్! అతనితో ఏమిటంతసేపు మాటలు? మన అంతస్థేమిటి అతను అంతస్థేమిటి మనమోటారు వాహనాల కయ్యే పెట్రోలు ఖరీదు చెయ్యదు. అతను, అతని కుటుంబ సభ్యుల జీవితం."

"వాట్ మమ్మీ! స్నేహితుడిగా కబుర్లు చెప్పుకోకూడదా? సొసైటీ లేడివి నువ్వుకూడాయిలా మాట్లాడుతున్నావేమిటి?"

"స్నేహమయినా..... కబుర్లయినా.... ఈక్వల్ స్టేటస్ వాళ్ళతోనే నమ్మా

చెయ్యాలి. అయినా అతనితో నీకు స్నేహమేమిటి? యాక్సిడెంట్ చేశావు- కాబట్టి..... పోలీసువాళ్ళతోను.... మిగతా ఎవరితోనూ గొడవలులేకుండా వుండటానికి ఇక్కడవుంచి ఖరీదైన ట్రీట్‌మెంట్ యిచ్చి పంపించాం. అంతటితో ఆ చాప్టర్ క్లోజ్.... బేబీ!"

"అదేమిటి మమ్మీ! ఆ రోజున నువ్వు వాళ్ళమ్మగారిని..... డాడీ వాళ్ళ నాన్నగారిని..... ఎప్పుడు రావాలనుంటే అప్పుడు వచ్చి చూసివెళ్ళండి అన్నారుగా?"

"అదంతా ధనవంతుల నోళ్ళలో వుండే హిపోక్రసీ బేబీ! వాళ్ళని మళ్ళీ జన్మలో చూడాలని వుండదు మాకు. ఏదో మర్యాదకోసం అలా అనాలికాబట్టి అన్నాం."

"ఏమో మమ్మీ! నాకేం అర్థం కావటంలేదు నీ మాటలు."

"ఇంకా నీకు చాలా వయసుందిలే అర్థంచేసుకోడానికి."

"సరే! అతనింటికి వెళ్ళొచ్చా నేను..... ఎప్పుడయినా? వాళ్ళమ్మగారు వాళ్ళు పదేపదే అడుగుతున్నారట!"

"ఎప్పుడయినా కాజువల్‌గా వెళ్ళు. అలవాటు చేసుకోకు. అనుబంధాలు పెంచుకోకు. ధనవంతులకీ మధ్యతరగతి కుటుంబాలకీ మధ్య – కనుపించని అంతస్థుల అగాధం వుంటుందన్న విషయం మర్చిపోకు. పోతే.... నేను చెప్పేది పాటించి తీరాలి నువ్వు."

"ఏమిటది మమ్మీ!"

"నూటికో కోటికో తప్ప..... అతనిక్కడకుమాత్రం తరచుగా రాకూడదు."

"ఎందుకని మమ్మీ?"

"ఇప్పటికే నా ఫ్రెండ్‌షిప్ సర్కిల్లో..... బంధువర్గంలో నీ పెళ్ళి ఒక చర్చనీయాంశం అయిపోయింది. నీ కూతురికి పెళ్ళి చెయ్యకుండా ఉద్యోగమే చేయించుకుంటావా.... అని కొందరు..... కోటి రూపాయలు కట్నం పుచ్చుకునే పెళ్ళికొడుక్కి తప్ప నీ కూతుర్ని యింకెవ్వరికీ యివ్వవా? అని కొందరు.... పెళ్ళికొడుకులు మీ అమ్మాయికి నచ్చటంలేదా..... లేక మీ అమ్మాయి పెళ్ళికొడుకులకి నచ్చటంలేదా? అని కొందరు.... యింకో పంచవర్షప్రణాళికలో నన్నా మీ డాటర్ వెడ్డింగ్‌కార్డు ఇస్తావా – ఇవ్వవా అని యింకొందరు ఇట్లా నన్ను కాకుల్లా పొడుచుకు తింటున్నారుబేబీ. అందుకని త్వరలో నీకు రాజాలాంటి పెళ్ళిసంబంధం చూసి, నీ వివాహం చేసి.... మహారాణీ వైభోగంతో అత్తవారింటికి పంపిస్తాం. అందుకని....."

"అందుకని.... ఏమిటి మమ్మీ"

"ఇంకో పరపురుషు డెవడూ..... ఈ యింట్లో తిరుగాడుతున్నట్టు కనిపించ రాదు."

"ఎందుకని?"

"మన ఆస్థి, అంతస్థూ చూసి పరోక్షంగా మనకి శత్రువులు చాలామంది వుంటారు. వాళ్ళు మనమీద అనవసరంగా అపనిందలేస్తారు. అందుకని అతను వచ్చినప్పుడు అంతసేపు భోళాగా మాట్లాడకుండా కట్టె... కొట్టె.... తెచ్చేలా చెప్పి పంపించెయ్. నేను చెప్పినవన్నీ గుర్తున్నాయికదా. ఆఁ! ఇక నేను వస్తాను బేబీ! ఇవ్వాళ లేడీస్‌క్లబ్‌లో ఓ ఫంక్షనుంది. దానికి అటెండవ్వాలి నేను."

అంతటితో అక్కడ మాటలాగిపోయినయ్. రుక్మిణమ్మ వెళ్ళిపోయినట్టు స్లిప్పర్ల చప్పుడు వినిపించింది.

ఆ మాటలు విన్న రవికాంత్ ఛిన్నుడయిపోయాడు. ఇదన్నమాట ఈ యింట్లో తనకు లభించే విలువ?! వాళ్ళందరూ చూపించింది నిజమైన అప్యాయత అనుకొని..... అనవసరంగా భ్రమపడ్డాడన్నమాట తను. అయితే మృదుల మాట ఏమిటి? ఆమె ఆదరణకూడా నటనేనా? ఇక ఈ యింటికి ఎవరికోసం రావాలి తను? అయినా..... తన పిచ్చికాకపోతే.... ట్రీట్‌మెంట్ అయిపోగానే మారుమాట్లాడకుండా వెళ్ళిపోక..... తన కామెతో స్నేహం వృద్ధిపొందాలనే కోరిక దేనికి? అత్యాశకాకపోతే......

"ఏమిటి? ఏదో ఆలోచిస్తున్నట్టున్నారు రవికాంత్! బోరుకొట్టేస్తోందా?"

విజ్ఞానం – వినోదం

బాబ్ బ్రౌన్

సమస్య

ప్లాస్టిక్ కాగితం ముసుగు



అవసరం

ఒక ప్లాస్టిక్ కాగితం

ఇలా చెయ్యాలి

ఒక గిన్నెపై ప్లాస్టిక్ కాగితాన్ని పరచి చుట్టూ కొసలను క్రిందకి జరపండి. అది అలాగే వ్రేలాడుతుంది.

ఎందుకని?

కాగితంలోని విద్యుచ్ఛక్తి కాగితాన్ని వ్రేలాడేలా చేస్తుంది. ఈ విద్యుత్ ఎక్కడి నుండి ఉత్పత్తి అయ్యింది? కాగితంలోని ప్రతి కదలిక కొంత విద్యుత్‌ని ఉత్పత్తి చేస్తుంది.

కాగితం కానీ గిన్నె కానీ తడిగా ఉంటే ఆ తేమలోని నీరు కాగితాన్ని గిన్నెకు అంటి పెట్టుకొని ఉండేటట్టు చేస్తుంది.

నవ్వుతూ వచ్చింది మృదుల – మళ్ళీ.

ఈమాటలు మీరు మనస్ఫూర్తిగా అంటున్నారా? లేక మీ మమ్మీగారి ట్రైనింగా? అందామనుకున్నాడు కోపంగా. కానీ..... ఎందుకనో తమాయించు కున్నాడు.

అతని మనోభావాల్ని పసికట్టినట్టుగా ఆమే అంది "రవికాంత్?"

చెప్పండి అన్నట్టు చూశాడు.

"మీరు శ్రమతీసుకుని మా యింటికి రెండుసార్లు వచ్చినందుకు చాలా థాంక్స్. ఇక నుంచి నేనే మీ యింటికి వస్తుంటాను. ఓకే" అంది.

వాళ్ళమ్మగారి డైరక్షన్ ప్రకారం నువ్విక మా యింటికి రావద్దు..... యిక దయచెయ్.... నీదే ఆలస్యం అని మెత్తని చెప్పుతో కొట్టి చెపుతోందన్నమాట!

ఇక అక్కడ ఒక్క నిముషం కూర్చోలేకపోయాడు రవికాంత్. ముళ్ళమీద కూర్చున్నట్టనిపించిందతనికి.

పైకి మాత్రం సభ్యతగా "థాంక్యూ! మృదులా నే వస్తాను మరి" అంటూ లేచాడు.

చేతులు జోడించింది మృదుల.

సిటీబస్‌లో కూర్చున్నాడన్నమాటే గాని.....మనసు మనసులో లేదు రవికాంత్‌కి.

అఖరికి మృదులకి కూడా తనమీద ఎలాంటి అభిమానం లేదన్నమాట.

ఛీ రా! ఈ ధనవంతులు... ఎంతగా నటిస్తారు?

వాళ్ళ మాటల్నిబట్టి.... వాళ్ళ అప్యాయతల్ని అంచనావేసుకోవటం అంటే నిలువునా నీటిలో మునిగిపోవటం అన్నమాటే!

ఇక జన్మలో మృదుల ముఖం చూడకూడదు. ఎంత నయవంచకురాలు.... ఎన్నికబుర్లు చెప్పింది. ఎన్ని ఆశలు కలిగించింది? నన్ను చూడాలని మీ కనిపించదా? అంది. అదంతా అబద్ధమేనన్నమాట!

రవికాంత్ మనసు సెగలుకక్కుతోంది. (ఇంకా ఉంది)

రజతోత్సవం

గోవిందరాజు రామకృష్ణారావు

చేతిలో పత్రిక పట్టుకుని విప్పిన పేజీల వంక చూస్తూ వుండి పోయిన మాస్టారు పెద్ద రైతు రంగయ్య రావడం గమనించలేదు.—శారదా విద్యాలయం రజతోత్సవాలు సూర్యవరంలో జరుపుతున్నారు. విద్యామంత్రి ముఖ్య అతిథిగా వస్తున్నారు. ఎందరో ప్రముఖులు సభలో పాల్గొంటున్నారు. ఎక్కడున్నా సరే స్కూలు అంటే మాస్టారికి ప్రాణం. శారదా విద్యాలయం పేరు చూడగానే గుండె పుప్పొంగింది. ఆ ఉత్సవానికి అందరూ ఆహ్వానితులే అని ప్రకటించారు. డబ్భై సంవత్సరాల వయస్సులో బస్సు ప్రయాణం చేయడం మంచిదేనా అనే సంగతి ఆలోచనకు కూడారాలేదు. వెళ్ళాలని మనసు గట్టిగా కోరుతోంది.

'ఏంటండి మాస్టారూ! అంతలా చూస్తున్నారు?' రంగయ్య కంఠం విని తెప్పరిల్లి పత్రిక మడిచి తలపైకెత్తి చూశారు.

'రా.... రావయ్యా రంగయ్యా! నీ గురించే అనుకుంటున్నా. సూర్యవరంలో స్కూలు రజతోత్సవాలట. వెళ్దామా అనుకుంటున్నా' మనసు లోని మాట బయటపెట్టారు.

రంగయ్యకి ఆశ్చర్యం వేసింది.

'మాస్టారూ! మీరనేదేమిటి? ఇక్కణ్నుంచి రెండు గంటలు బస్సులో ప్రయాణం చేస్తారా' అడిగాడు వద్దనే సూచనగా.

'అలా అనుకుంటే ఎలా? ఈచుట్టుపట్ల అంత పేరున్న స్కూలు మరొకటి లేదు, తెలుసా!! రేపే ఆ వేడుక. మళ్ళీ మళ్ళీ రాదయ్యా. కళ్ళారా చూడాలని.....' గొంతు సంతోషంతో నిండి మాట రుద్ధమయింది.

బడి అంటే మాస్టారికున్న అభిమానం రంగయ్యకి తెలుసు. మెత్తబడ్డాడు కొంచెం.

'అదికాదు మాస్టారూ! ఈ పల్లె కొచ్చి పదేళ్ళు దాటింది. మా పిల్లలకి నాలుగు అక్షరం ముక్కలొస్తున్నాయంటే ఆపుణ్యం మీదే. ఒంటరిగా ఇక్కడికొచ్చారు. ఈ పల్లెలోని కుటుంబాలన్నీ మీవే అయ్యాయి. అందరికీ పెద్ద దిక్కు మీరే.'

'అవన్నీ ఎందుకు గానీ— ఇంతకీ ఏవంటావ్?'

"అనేదేవుందండీ! ఒక్కరే ఎలా వెళ్తారా అని. పోనీ వెంట ఎవర్నన్నా పంపమంటారా?"

'భలేవాడివయ్యా! నాకేం భయం. వెంటనే వచ్చేస్తాగా'

'సరేనండి మరి. జాగ్రత్తగా వెళ్ళి రండి. అక్కడ ఎక్కడుంటారు? పోనీ వెనకటి కరణంగారింట్లో వుండండి ఒకపూట'.

'అక్కడి కెళ్ళి పరిస్థితుల్ని బట్టి చూడొచ్చు'.

'మంచిది నే నెళ్ళొస్తా మాస్టారూ'.

మాస్టారి కళ్ళలో సంతోషం చిందులాడింది. సాయంత్రం ప్రయివేటు కొచ్చిన పిల్లలకి ప్రయాణం గురించి చెప్పాడు. పొద్దుటిపూట వచ్చే పిల్లల్ని మర్నాడు రావద్దని కబురు చేశారు.

ఎందుకైనా మంచిదని అవసరం లేకున్నా చేతి సంచిలో ఒకపంచె, చొక్కా సర్దుకున్నారు. ఉత్తరీయం మరొకటి అనవసరమనిపించింది. తుండుగుడ్డ మాత్రం పెట్టుకున్నారు.

ఉదయం ఏడు గంటలకి బయలు దేరిన బస్సు తొమ్మిది గంటలకల్లా సూర్యవరం చేరింది. కార్యక్రమం పది గంటలకి. ప్రయాణం బడలిక తగ్గడం కోసం కొంచెం కాఫీ తాగాలనిపించింది. బస్సుస్టాండు ఎదురుగానే ఉడిపి కాఫీ హోటలుంది. ఊరు పెరిగి క్రమక్రమంగా బస్తీ హంగులు ఏర్పరచుకుంటోంది.

కాఫీ తాగి రిక్షా కోసం ఎదురు చూడ సాగారు. అటువస్తున్న రిక్షా ఆపి 'అబ్బీ ఇక్కడ స్కూల్లో సభ జరుగుతుందట. అక్కడి కొస్తావా?' అడిగారు.

'కూచోండి అయ్యగారూ! ఒక రూపాయి ఇప్పించండి' తలగుడ్డ తీసి సీటు తుడుస్తూ జవాబిచ్చాడు.

ఎండలో నడిచి వెళ్ళడం కష్టమని బేరం చేయకుండా 'అలాగే' అని నెమ్మదిగా ఎక్కి కూర్చుంటూ 'పోనీ అబ్బి' అన్నారు.

మంత్రిగారికి, ప్రముఖులకు స్వాగత ద్వారాలు అట్టహాసంగా అలంకరించారు. రంగు కాయితాల తోరణాలతో రోడ్డు కళకళలాడుతోంది. స్కూలు వైపు జనం గుంపులు గుంపులుగా వెళ్తున్నారు.

స్కూలు ఇంక అంతదూరం వుందనగానే కోలాహలం కనిపించింది. మామిడాకు తోరణాలు, షామియానా, పూలతో అలంకరణ శోభాయమానంగా, కనుల పండువగా వుంది. రిక్షా దిగి డబ్బులిచ్చి స్కూలు గేటు వైపు బయలుదేరారు మాస్టారు. మంత్రిగారు ప్రముఖులు వచ్చినట్లు లేదు. గేటు దగ్గర 'శారదా విద్యాలయం రజతోత్సవాలు' అన్నే బ్యానర్‌ని మనోహరంగా తీర్చిదిద్దారు. వలంటీర్లు బ్యాడ్జీలు పెట్టుకుని హడావుడిగా తిరుగుతున్నారు. గేటు దగ్గర ఆహ్వానితులు పత్రాలు చూపించి లోపల షామియానాలోకి వెళ్తున్నారు. పోలీసు బందోబస్తు దిట్టంగావుంది.

పదిగంటలు కావచ్చింది.. పోలీసుల విజిళ్ళు హోరెత్తాయి. మంత్రిగారు, ప్రముఖులు వస్తున్నట్టున్నారు. అందరినీ పక్కలకు నెట్టేస్తున్నారు. కార్లు బారుగేటు దగ్గరి కొచ్చింది. జనం వాటి దగ్గరికి ఎగబడుతున్నారు. పోలీసులు వాళ్ళని నిర్దాక్షిణ్యంగా దూరంగా తోసేశారు. మాస్టారు ఈ సందట్లో నలిగి ఎలాగో కిందపడకుండా నిలదొక్కుకున్నారు.

మంత్రిగారు, ప్రముఖులు లోపలికి వెళ్ళారు. వాళ్ళ వెంట కొందరు బిలబిలమంటూ లోపలికి తోసుకెళ్ళారు. ఎలాగో మాస్టారు గేటు దగ్గరికి రాగలిగారు. అక్కడున్న వలంటీర్లు ఇన్విటేషన్ చూపించమని గద్దించారు. 'లేదు బాబు! నేను కొత్తపేట నుంచి వచ్చా' అని బతిమాలుతున్నట్టు చెప్పారు.

'ఎక్కణ్నుంచి వస్తే ఎవడిక్కావాలయ్యా. పక్కకి తప్పుకో' అని భుజం పట్టుకుని తోసేడు పక్కకి కార్డులున్న వాళ్ళని లోపలికి పంపుతూ— ముందుకు పడకుండా ఆపుకుని మళ్ళీ గేటు దగ్గరికొచ్చి 'చూడు నాయనా! ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా వచ్చా. పైగా అందరూ ఆహ్వానితులే అన్నారుకదా అని మరీ వచ్చా. వెళ్ళనీబాబు. నేనూ బడి పంతుల్నే....' అంటూ వినయంగా అర్థించారు మాస్టారు. కుర్ర వలంటీరుకి కోపం వచ్చింది. 'ఏవిటయ్యా ఒకటే న్యూసెన్సు' ఛీదరించుకున్నాడు.

గేటుకి కొంత దూరంగా మరో పెద్ద మనిషి బ్యాడ్జితో వుండడం గమనించి మాస్టారు ఆయన్ని వేడుకుంటున్నట్టు 'నన్ను లోపలికి వదలమని చెప్పండి బాబూ! దూరం నుంచి వచ్చిన వాణ్ని' అన్నారు చేతులతో సైగ చేస్తూ.

పెద్దగడ్డంతో వయోవృద్ధుడుగా కనిపించిన మాస్టారి మీద ఆ పెద్దమనిషికి సదభిప్రాయం, జాలి కలిగి 'ఆయన్ని లోపలికి రానివ్వు' అని గేటుదగ్గరున్న కుర్ర వలంటీరుకి చెప్పాడు.

బ్రతుకు జీవుడా అనుకుని షామియానాలోకి ప్రవేశించారు మాస్టారు. సభాకార్యక్రమం ప్రారంభమయింది. ముందు కుర్చీలు నిండిపోయాయి. వెనక వరుసలో ఖాళీగా వున్న ఒక కుర్చీలో కూర్చున్నారు మాష్టారు.

ప్రార్థన అయ్యాక మంత్రిగారికి, ప్రముఖులకు పూలదండలు వేశారు. అధ్యక్ష ప్రసంగం తర్వాత



మంత్రిగారు జ్యోతి వెలిగించారు. దాని ప్రక్కనే వున్న ఫోటోకి పుష్పహారం వేసి నమస్కరించారు. వెనక వరుసల్లో జనం పైకి లేచి ఫోటో చూసేందుకు ప్రయత్నిస్తున్నారు. వాళ్ళ వెనక వున్న జనం 'కూర్చోండి కూర్చోండి' అని అరుస్తున్నారు.

కుతూహలం కొద్దీ మాస్టారు కూడా మెల్లగా లేచారు ఆ ఫోటో కనిపిస్తుందేమోనని. వెనక వున్నవాళ్ళు 'ముసలాడివి ఇంతదూరం నుంచి ఏం కనిపిస్తుందయ్యా. కూర్చో.... కూర్చో' అని మందలింపుగా చెప్పారు.

'ఎవరిదిబాబూ! ఆఫోటో?' పక్కనున్న ఆయన్ని అడిగారు మాస్టారు కుతూహలం పట్టలేక.

విద్యాలయం పాలక వర్గం కార్యదర్శి నివేదిక సమర్పించ బోతున్నాడు. పక్కనున్న ఆయనకీ ప్రశ్నతో విసుగు పుట్టి 'నీదీ నాదీ కాదు.... ఎవరిదో మనకెందుకు' అని జవాబిచ్చాడు.

చిన్నబుచ్చుకుని మాస్టారు వూరుకున్నారు. కార్యదర్శి ప్రసంగిస్తూ 'ఈనాటి మహాసభకూ ముఖ్యకారకులూ అసలు ఈవూరికి మొట్ట మొదట విద్యాదానం చేసిన మహనీయుడు ఆయనే. ఆ చిత్ర పటానికి గౌరవనీయులైన మంత్రిగారు ఇప్పుడే పుష్పహారం వేశారు. పాతికేళ్ళ క్రితం ఇదే చోట ఆయన సొంత యింటిని విద్యాలయం కోసం ఇచ్చారు. అంతకు ముందు తన యింటిలో బడి నడిపి పిల్లలకు విద్య నేర్పారు. ఆయన కోరిక ప్రకారం ఈ స్కూలుకి 'శారదా విద్యాలయం' అని అప్పుడే పేరు పెట్టారు. ప్రారంభమైన కొంత కాలం దీనికి ఆయనే హెడ్మాస్టరుగా వున్నారు. వేరే యింటిలో అద్దెకుంటూ దీనిని విద్యాలయం కోసం యిచ్చి వేసిన త్యాగధనుడు'.


మాస్టారు చెవులు రిక్కించి ప్రతిమాటా శ్రద్ధగా వింటున్నారు.


కార్యదర్శి ప్రసంగం కొనసాగిస్తూ 'మహాశయులారా! ప్రయిమరీ స్కూలు తరగతులు పెరిగి మిడిల్ స్కూలు కావడంతో ఉన్నత విద్యార్హతలున్న ఉపాధ్యాయులు కావలసి వచ్చారు. కొత్త హెడ్‌మాస్టారు . వచ్చారు. ఉద్యోగ విరమణ తరువాత మహనీయుడు అప్పయ్య పంతులు గారు ఈవూరు విడిచి వెళ్ళిపోయారు. ఆయన ఎక్కడున్నారో తెలియదు. ఎంతో ప్రయత్నించాం. లాభం లేకపోయింది'.

మాస్టారు ఎందుకో వుద్రేక పడుతున్నారు. లేద్దామా వద్దా అన్నట్టు సీట్లో కదులు తున్నారు.

కార్యదర్శి మళ్ళీ అందుకుని 'నా నివేదిక చదివే ముందు ఒక్క సత్యం మనవి చేయక తప్పదు. ఈనాడు ఈ విద్యాలయం యిలా వుండేందుకు ఎంతో శ్రమించాం. కొందరు ఘరానా పెద్ద మనుషులు పంతులు గారు వెళ్ళి పోయాక ఈ

RICH,TRU






Rs. 2.85 for 10 L.T. extra

STATUTORY WARNING:
CIGARETTE SMOKING IS INJURIOUS TO HEALTH

E & BLUE



It's rich: the blend of
choice Virginia tobaccos.

It's true: the taste,
the smoke, the satisfaction.

It's blue: unmistakably so.

It's Berkeley Filter:
rich, true and blue.

FILTER

Rich tobacco, true taste.

రజతోత్సవం

యింటినీ స్థలాన్నీ స్వాహా చేయాలని విశ్వ ప్రయత్నం చేశారు. వారి ఆటలు సాగలేదు. స్కూలు పేరు మార్చి తమ పెద్దలు పేరు పెట్టాలని ఎన్నో ఎత్తులు వేశారు. కాని పంతులుగారి సంకల్ప బలం వల్ల అవన్నీ వమ్ము కాక తప్పలేదు ఆ మహాను భావుడు అప్పయ్య పంతులుగారికి మనం ఎంతో రుణపడి వున్నాం. నాతో అందరూ ఒక్కసారి కంఠం కలపండి – అప్పయ్య పంతులు గారికి జై–' దిక్కులు పిక్కటిల్లేటట్లు అన్ని కంఠాలు మారుపలికాయి.

మంత్రిగారూ, ప్రముఖులూ యావన్మందీ తమ ప్రసంగాలలో అప్పయ్య పంతులుగారి వదాన్యతను కొనియాడారు. ఆ పేరు వుచ్చరించినప్పుడల్లా మాస్టారు ప్రతిస్పందించేవారు. కొన్ని సార్లు లేవబోయి ఆగిపోయారు. పక్క నున్న వాళ్ళకీ ప్రవర్తన వింతగా తోచింది.

రజతోత్సవ సభ జయప్రదంగా జరిగింది. వందన సమర్పణ అవుతుండగానే జనం లేచి వెళ్ళి పోవడం మొదలు పెట్టారు. మాస్టారు మాత్రం సీట్లోంచి కదల్లేదు. మంత్రిగారూ, ప్రముఖులూ వెళ్ళి పోయారు. కార్యకర్తలు మాత్రం మిగిలారు.

మాస్టారు లేచి షామియానాలో ముందుభాగం లోకి వెళ్ళారు. లోపలికొచ్చేందుకు సిఫారసు చేసిన పెద్దమనిషి అక్కడండడం గమనించి మాస్టారు ఆయన దగ్గరి కెళ్ళి 'బాబూ! ఈ మహోత్సవం కళ్ళారా చూసే అదృష్టం కలిగించావ్. కలకాలం వర్ధిల్లు' అని దీవించారు.

పెద్దమనిషి ఈ మాటలకు చలించి 'అదేం పెద్ద సహాయం. పెద్ద వారు మీరు రావడం విశేషం కదా! కుర్రకారుకి తెలియదు. ఇన్విటేషన్ అడిగితే కొంత జనాన్ని ఆపు చేయవచ్చునని అలా చేశారు. ఏమీ అనుకోకండి'.

'ఫర్వాలేదునాయనా. మీరు అనుమతిస్తే ఒక్కసారి ఆ ఫోటో చూసి వస్తా బాబూ! విద్యాలయం కూడా ఒక్కసారి చూసి వస్తా' ప్రాధేయ పూర్వకంగా కోరాడు.

'తప్పకుండా చూడండి. నేనే దగ్గరుండి చూపే వాణ్ని. పనులున్నాయి' అని ఇంకో వలంటీర్‌ని పిలిచి 'ఈయనకు ఒకసారి స్కూలు చూపించు' అని పురమాయించి వేరే పనికోసం వెళ్ళాడు.

మాస్టారు ఆ ఫోటో దగ్గరి కెళ్ళి నిఘూగా చూశారు. గుండెలోని ఆనందం ముఖంలో ప్రతిబింబించింది.

'బాబూ! ఈ అప్పయ్య పంతులు ఎవరునాయనా!' ఉత్సుకతతో అడిగారు మాస్టారు.

స్కూలు చూపెడుతూ ఆ వలంటీరు చెప్ప సాగాడు 'ఆయన చాల . గొప్పవాడు. తాను పేదవాడైనా బడికోసం ఇంటినీ స్థలాన్ని దానం చేసిన మహాను భావుడు. ఎక్కడుండీ, అసలు వున్నదీ లేనిదీ తెలియదు. ఈ వూళ్ళో ఆయన పేరు చెబితే చాలు చేతులెత్తి నమస్కరిస్తారు. అంత గౌరవం. పెద్దలు చెబుతారు. ఒకే కూతురట. ఆకస్మికంగా మరణించిందట జ్వరం వచ్చి. ఆ దిగులుతో మంచం పట్టి భార్య కూడా చనిపోయిందట. అయినా పాఠాలు చెప్పడం మానలేదట పంతులు గారు. వేరే హెడ్మాస్టరు వచ్చాక వెళ్ళిపోయారట. పదేళ్ళు దాటిందట. ఎక్కడుంటున్నారో తెలియదు.

'అలాగా బాబూ! చాల సంతోషం. అప్పయ్య గారు ధన్యజీవి. మనిషికి అంతకంటె ఏం కావాలి. మీకు శ్రమిస్తున్నాను బాబూ! పెద్దవాణ్ని ఏమీ అనుకోకు నాయనా నా మనవడిలాంటి వాడివి'.

'నేశ్రమపడిందెక్కడండి. ఈ మాత్రం దానికేనా. ఇంతకీ మీ పేరు చెప్పారు కాదు. అప్పయ్య గారు మీకు తెలుసా?'

'కొత్తపేట వైపు వెళ్ళే బస్సులుంటాయా యిప్పుడు' మాట దాటవేస్తూ అడిగారు.

'ఉన్నాయండి. టైమయింది. మరి మీ భోజనం? తర్వాత వెళ్ళొచ్చు నెమ్మదిగా. ఈ పూట వుండండి'.

'పెద్ద వాణ్ణి. రెండు అరటి పళ్ళు తింటే సరిపోతుంది. నే వెళ్తా. వెంటనే వెళ్ళి పోవాలి' 'బస్సుస్టాండు వరకు దింపుతా' పెద్దవారు.

'అక్కర్లేదు బాబూ. రిక్షాలో వెళ్తా'.

'నేనూ వస్తా. మా వైస్ ప్రెసిడెంటుగారు మరీ చెప్పారు'.

ఇద్దరూ బస్సుస్టాండు చేరారు. బస్సు సిద్ధంగా వుంది. మాస్టారిని ఎక్కించాడు వలంటీరు. నాలుగు అరటి పళ్ళు కొని చేతులో పెట్టి నమస్కరించాడు.

'ఇందాక మీ పేరు అడిగినా చెప్పలేదు. జాగ్రత్తగా వెళ్ళిరండి'.

బస్సు కదలబోతోంది.

'చెబుతా నాయనా. నాపేరు అప్పయ్య పంతుల

వలంటీరు దిగ్భ్రాంతి చెందాడు. బస్సు కదిలి పోయింది. □

ఓట్లు

సిగలో సిరిమల్లెపూలు
నిగనిగ లాడే వళ్ళు...
చిలక కొరకని దోరపండు
చినిగిన వలువల వెనుక
చిలకరించే యవ్వనం....
సమయం చూచి
బలాత్కరించి
చిద్విలాసంగా అనుభవిస్తారు
తృష్ణ తీరని మహిషాసురులు....
మరి
వీరంతా అలగా జనం
అంటరాని బలగం...
విసరి పారేసిన తరగతి
చెప్పకుంటే పోతుంది నీ పరపతి...
కామందులు
కామాంధులు
వీరిక్రింద నలుగు తున్నారందరు
తెరువేలేదు
తెగలు వేరు
తరతరాలుగా వస్తున్నదీ తీరు.
వూరడింపు లేదు
వూరు లేదు...
వూరుకోరా తమ్ముడూ
నీవు నావాడ వంటాడు
ఓట్లు పడే వరకు...–

–'విరించి'

సరి కొత్త సైన్స్ క్విజ్ గడువు తేదీ పొడిగింపు

ఆంధ్ర సచిత్ర వారపత్రిక- రవి కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సరికొత్త సైన్స్ క్విజ్ ప్రశ్నలకు సమాధానాలు పంపడానికి వ్యవధి తక్కువగా ఉందనీ, గడువు తేదీని పొడిగించవలసిందనీ ఎక్కువ మంది పాఠకులు కోరిన దృష్ట్యా ఈ సైన్స్ క్విజ్‌లో ఎక్కువ మంది పాల్గొనడానికి వీలుగా గడువు తేదీని 19-12-'87కి పొడిగిస్తున్నాము. పాఠకులు గమనించకోరుతున్నాము. –సం

చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వారి వైద్య సలహాలు

ఎ. లక్ష్మి, తాడిపత్రి

ప్ర: నడుము నొప్పులు, మలబద్ధకం.

జ: చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వారి మహాయోగ రాజగుగ్గులు ఉదయం 1మాత్ర నీటితో త్రివృత్ లేహ్యం రాత్రి పడుకుండబోవునప్పుడు. దొరకుచోటు: శ్రీ శ్రీనివాసా హోమియో స్టోర్సు, అనంతపురం.

సత్యనారాయణ, ఎ అన్నవరం

ప్ర: 20సం. షుగరు తరువాత బి.పి. ఉండి దగ్గు ఆయాసం.

జ: చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వారి వసంత కుసుమాకరం నెం 4 మాత్రలు 6 నెలలు వాడవలయును.

ఎస్. పాండురంగారావు, పత్తికొండ

ప్ర: తల వెంట్రుకలు రాలుట. నివారణ?

జ: చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వారి చందనాది తైలం తలకు రాయవలయును.

జి. వెంకటనాయుడు, జియ్యమ్మవలస

ప్ర: పొడి దగ్గు, కఫం, ఆయాసం, గుండె దడ, గుండె నీరసం, తలనొప్పి, జలుబు. నివారణ?

జ: చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వారి ఏకోత్తవృద్ధి మహాలక్ష్మి విలాస రసం, చ్యవన ప్రాశ్యా కాల్షియం.

డి. చంద్రకళ, కుమార్‌పెల్లి

ప్ర: వయస్సు 24 సం. తల వెంట్రుకలు తెల్లబడుట. నివారణ?

జ: చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వారి బృంగామలక తైలం వాడుతూ తలకు మందార పువ్వులు రాయవలయును.

ఎ. వి. సర్వోత్తమరావు, గరివిడి

ప్ర: 6సం. దగ్గు, ఆయాసం, జీర్ణశక్తి తగ్గుట, మలబద్ధకం.

జ: చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వారి నవలోహ చింతామణి వాసారిష్టం, రాత్రి త్రివృత్ లేహ్యం వాడవలయును. దొరుకుచోటు: పట్నాల గోవింద రాజు అండ్ సన్స్, నెహ్రూరోడ్డు, శ్రీకాకుళం.

ఆర్. బసన్న, తారానగర్ (కర్నాటక)

ప్ర: 62 సం. కుడి కన్ను మసకగా కనబడుట.

జ: చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వారి రజత భస్మం, త్రిఫలచూర్ణం.

ఎన్. మల్లిఖార్జునరావు, చెన్నాపురం

ప్ర: వయస్సు 24సం. మీసాలు మధ్యలో రాకపోవుట.

జ: చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వారి పూర్ణచంద్రోదయ మాత్రలు, అశ్వ గంధాది లేహ్యం వాడవలయును.


బి. నాగిరెడ్డి, చెన్నాపురం

ప్ర: వయస్సు 22సం. నత్తి నివారణ.

జ: రాత్రి పరుండబోవునప్పుడు పొంగించిన పటికి బుగ్గన పెట్టుకొని 20రోజుల తరువాత వివరములు తెలుపగలరు. □

కొత్త శీర్షిక

షేర్ మార్కెట్లో పెట్టుబడులు – వ్యక్తుల ఉన్నతికి సోపానాలు



యన్. రామ్‌జీ
న్యూఢిల్లీ

ఈ వారం మనం స్టాక్ మార్కెట్లు వాటి పుట్టు పూర్వోత్రాలు తెలుసుకుందాం. ఒకప్పుడు, అంటే 1875సం. పూర్వం స్టాక్ మార్కెట్లు లేకపోవటం మూలంగ, అప్పట్లో వున్న కొన్ని బ్యాంకుల షేర్లను, బొగ్గు గనుల షేర్లను, కొందరు దళారులు అమ్ముతూ కొంటూ వుండే వారు. వారి అమ్మకాలు, కొనుగోళ్ళు రోడ్డు ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించటం మూలంగా వీరిని పోలీసులు తరిమి కొట్టే వారు. అటువంటి స్థితి నుంచి, ఈ రోజు స్టాక్ బ్రోకర్ కావాలంటే బొంబాయి, ఢిల్లీ వంటి ప్రదేశాలలో సుమారు 10-15 లక్షల ప్రీమియంతో టికెట్ కొనవలసి వస్తుంది. అంతే కాక వారి సంపాదన గౌరవ మర్యాదలు ఎందరో ఆకర్షిస్తున్నాయి. ఈ రోజులలో వారి వ్యాపారం ఎంత జోరుగా సాగుతుందో తెలియాలంటే ఒక సంఘటన మీకు వివరిస్తాను. మా స్నేహితుడు ఒకతను ఒక పెద్ద కంప్యూటర్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు బొంబాయిలో. అతను తన రొటీన్‌లో ఆ రోజు స్టాక్ బ్రోకర్ ఆఫీసులు చూడాలి. సరేనని ఒక బ్రోకర్ ఆఫీసులో ప్రవేశించాడు. (సాధారణంగా స్టాక్ బ్రోకర్ లందరుకు స్టాక్ ఎక్స్ఛేంజ్ బిల్డింగ్‌లో నే చిన్న చిన్న ఛాంబర్స్ వుంటాయి. అవి ఎంత పెద్దగా వుంటాయి అంటె మన ఇళ్లల్లో వుండే ఎటాచ్‌డ్ బాత్‌రూమ్ ఎంత వుంటుందో దగ్గర దగ్గరగా అంత వుంటాయి! అందులో నే బ్రోకర్ ఫోన్‌లు, కావలసిన పుస్తకాలు, బ్రోకర్ భారి కాయం ప్లస్ బ్రోకర్‌కి వుండే సబ్ బ్రోకర్‌లు కూర్చొగా మహా అంటె ఒకరు ఇద్దరు కూర్చోవటానికి సరిపోయే స్థలం వుంటుంది. అటువంటి ప్రదేశంలో కనీసం 10-15 మంది క్లయింట్స్ కూర్చుంటారు. (అంటే కొంత మంది కూర్చొని, కూర్చున్న వాళ్ళ మీద కొందరు నించొని, తలకాయలు మాత్రం రూమ్‌లలో వుండి శరీరం మాత్రం ఎక్కడెక్కడో వుంటూ, రక రకాల డాన్స్ భంగిమలతో వుంటారు) ఇక్కడితో ఆగలేదు. అతని వద్ద వుండే మూడు నాలుగు ఫోన్‌లు నిరంతరం, చేసే గణ గణ ధ్వని చాలా గందర గోళంగా మన చేపల బజార్ కన్నా వికృతంగా వుంటుంది. దీన్ని చూసి ఆనందించాలే కాని వర్ణించటం కష్టం).

ఇలా చాలా బిజీగా వుండే చోటుకు వెళ్ళి బ్రోకర్‌కి తన కంపెనీ గొప్పతనం గూర్చి వారు తయారు చేసే కంప్యూటర్ యొక్క గొప్పతనం గూర్చి తన సహజమైన అమ్మకపు చాకచక్యంతో బ్రోకర్‌ని ఇంప్రెస్ చెయ్యాలని చూస్తున్నాడు. కాని బ్రోకర్ ఇవి ఏమీ పట్టించుకోకుండా ఎంత సేపు ఫోన్‌లో 'లియా- బేచా' (కొన్నాను, అమ్మేను) అనే రెండు పదాలు మాత్రం జపం చేస్తున్నాడు. అప్పటికీ అతను తన సహనానికి గంట సేపు పరీక్ష జరిగింది. సరే ఎలా బ్రోకర్‌ని ఆకర్షించాలా అని చూస్తూ వున్నట్టు వుండి గట్టిగా ఆకాశం పడిపోతున్నది అని అరిచాడు.

వెంటనే బ్రోకర్ బేచో, బేచో (అమ్ము, అమ్ము) అని చాలా ఆదుర్దాగా అరిచాడు. ఈ విధంగా అతను బ్రోకర్ యొక్క దృష్టిని ఆకర్షించాడుట.


ఈ విషయం మనకు అసహజంగా కన్పించవచ్చు, మన ఇళ్ళల్లో కూర్చుని చదువుతూ వుంటే. కాని ఇది చాలా వాస్తవం ఈ మార్కెట్లో.

ఇంతటి విస్తృతమైన వ్యాపారం కొద్ది సం.లలో వచ్చింది కాదు. దీనికి చాలా చరిత్ర వుంది. ఈ రోజు ఏ దేశంలోనైనా దాని ఆర్థిక పరిస్థితిని తెలియ చేయటానికి ఈ స్టాక్ ఎక్స్ఛేంజీలు కొలబద్దలుగా వుంటున్నాయి. అటువంటి ఈ స్టాక్ ఎక్స్ఛేంజ్ మన దేశంలో ఎన్నో ఒడిదుడుకులు, మరెన్నో వింత అనుభవాలు, తట్టుకొని ఒక మహా సంస్థగా పారిశ్రామికరణంలో మార్గ దర్శకంగా నిలబడింది. ఈ రోజు ప్రభుత్వపరంగా 14 స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు వివిధ పట్టణాలలో వున్నాయి. వీటిలో బొంబాయి 60 శాతము వ్యాపారం చేస్తూ ఉండగా మిగిలిన 40 శాతము 13 స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు కలసి వ్యాపారం సాగిస్తున్నాయి.

1850- 1865 వరకు జరిగిన కొన్ని ముఖ్య సంఘటనల మూలంగా ఈ రోజు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు ఆవిర్భవించాయి.

1. 1850లో చేయబడిన భారత కంపెనీల చట్టం (దీని వలన వాటాలు గల వానికి లాభాలతో మాత్రమే సంబంధం కల్గి నష్టాలకు పూచీ లేకపోవటం)

కె.కె.బిర్లా



2. 1858లో భారత దేశం బ్రిటిష్ వారి ఆధిపత్యంలోకి రావటం మూలంగా కుప్పలకొద్దీ బ్రిటీష్ సంస్థలు మన దేశంలో ప్రవేశించటం.

3. 1860లో వచ్చిన 'కాటన్ బూమ్' (ఇది ఎలా జరిగిందంటే అమెరికాలో అంతర్యుద్ధం ప్రజ్వరిల్లిన కారణంగా ఆ దేశం పత్తి కొరకు ఇంగ్లాండ్ దేశం మీద పూర్తిగా ఆధారపడవలసి వచ్చింది. ఇంగ్లాండ్ తనకు కావలసిన ముడి సరుకు తన వలస దేశం నుంచి కొనుగోలు చేసింది. అందు మూలంగా పత్తికి గిరాకీ పెరిగి వున్న పరిశ్రమలు అధికోత్పత్తి చేయటానికి మరి కొన్ని కంపెనీలు వెలవటానికి దోహదకారి ఐనది) ఈ పరిస్థితులు కాటన్ కంపెనీల షేర్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పరిచి, స్టాక్ మార్కెట్లకు వూపిరి పోసాయి.

1865లో అమెరికాలో అంతర్యుద్ధం ముగియటం మూలంగా పత్తి ధర పడిపోయి ఎన్నో పరిశ్రమలు మూత పడవలసి వచ్చింది. దీని వలన పరిశ్రమ మొత్తం సంక్షోభంలో పడి చిన్న చిన్న పరిశ్రమలు కొట్టుకుపోగా, "టాటా" వంటి వారు కూడా తీవ్రమైన సంక్షోభాన్ని, ఎన్నెన్నో ఒడిదుడుకులను ఎదుర్కోవలసి వచ్చింది.

ఇందు మూలంగా కాటన్ కంపెనీల షేర్లు ఆకాశాన్ని అంటుతున్నా ధరల నుంచి ఒక్కసారిగా అధఃపాతాళంలోకి పడి పోవటం మూలంగా ఎందరో దళారులు తమ మాటను నిలబెట్టుకోలేక దివాలా తీయటం జరిగింది. ఇటువంటి పరిస్థితులలోను తట్టుకొని నిలబడిన కొందరు దళారులు 1887లో బొంబాయిలో ఫిబ్రవరి 5న నేటివ్ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్ అసోసియేషన్‌గా సంఘటితం అయి ఈ సంస్థను ఏర్పరిచారు. ఈ సంస్థ ఎన్నెన్నో మార్పులకు గురి అవుతూ ఈనాటికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బి.ఎస్.ఇ)గా నిలబడి మిగతా సంస్థలకు మార్గదర్శకంగా మారి మరల "బాంబే అంటే బిజినెస్" అని నిరూపిస్తూ భారత దేశంలో ప్రీమియర్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌గా నిలిచింది.

1894లో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ అడుగు జాడలలోనే అహ్మదాబాద్ స్టాక్ అండ్ షేర్ బ్రోకర్స్ అసోసియేషన్‌గా యేర్పడింది.

1908లో కలకత్తాలో కూడా కలకత్తా స్టాక్ ఎక్స్ఛేంజ్ అసోసియేషన్ 150 మంది సభ్యులతో ఏర్పడింది.

సరైన సూచనలకు రు. 100/- బహుమానం

ఈ శీర్షిక ఇంకా వివరంగా మీకు తెలియాలి అంటే ఎలా? మీలో కొందరు ఇన్వెస్టర్‌లు వుండే వుంటారు కాబట్టి మీకు ఏఏ టాపిక్స్ మీద వివరంగా కావాలంటే వాటి మీద వ్రాయటానికి నాకు అవకాశం వుంటుంది. అంతేగాక సరైన సూచనలు ఇచ్చిన వారికి 100 రూపాయల బహుమానాన్ని సదరన్ కన్సెల్టెన్సీ సర్వీసెస్, శీతమ్మధార బ్రాంచి, విశాఖపట్నం వారు ప్రకటిస్తారు. మీ అడ్రస్ తెలుపగోరుతున్నాను.

—యస్. రామ్‌జీ

కొద్ది కొద్ది టీ కంపెనీల షేర్లు కొంటూ అమ్ముతూ వున్న దళారీలతో మద్రాసులో 1937 సెప్టెంబర్ 4న మదరాసు స్టాక్ ఎక్స్ఛేంజ్‌గా ఏర్పడింది.

1947 జూన్ 25న ఢిల్లీ, స్టాక్ ఎక్స్ఛేంజ్ అసోసియేషన్ ఏర్పడిందని నాకు సిక్కాగారు తెలిపారు. ఇక్కడ విచారించవలసిన విషయం ఏమిటంటే ఢిల్లీ స్టాక్ ఎక్స్ఛేంజ్ పుట్టు పూర్వోత్తరాలు గూర్చి వివరించే ఏ పుస్తకం లేకపోవటం. ఇవి అన్నీ తెలుసుకొని వ్యాపారం చెయ్యాలి అనే శాస్త్రీయ దృక్పథం ఇక్కడ బ్రోకర్‌లకు లేకపోవడం చాలా శోచనీయం. (నేను వివరించిన సం. సరైనది అవవచ్చు, కాకపోవచ్చు. దీన్ని నేను అసోసియేషన్ మెమొరాండంలో చూసి వ్రాసినది మాత్రమే. ఈ రోజు 118 మంది బ్రోకర్‌లు వున్న అతి చిన్న సభ్యత్వం కల పెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్. ఎందుకంటే బొంబాయి తరువాత ఢిల్లీది రెండవ స్థానం).

స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల పుట్టు పూర్వోత్తరాలు తెలుసుకున్నాం. మరి స్టాక్ ఎక్స్ఛేంజ్ అంటే ఏమిటో తెలుసుకుందాము. వారానికి 5 రోజుల చొప్పున ఉదయం 12గం.నుంచి 2.30గంటలవరకు ప్రజలకు కావలసిన షేర్లను అమ్ముతూ, కొంటూ పబ్లిక్ ఆక్షన్ జరిగే ప్రదేశమే స్టాక్ ఎక్స్ఛేంజ్. దీనిలో ప్రభుత్వం గుర్తించిన అంటే ఆ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో సభ్యత్వం కల బ్రోకర్‌లు మాత్రమే ఈ ఆక్షన్‌లో ప్రవేశానికి అర్హులు. ఈ ఆక్షన్ జరిగే ప్రదేశాన్ని 'ట్రేడింగ్ హాల్' అంటారు. దీనిలో బ్రోకర్‌తో పాటు తన అనుమతించబడిన సహాయకులు ఒక ఫోన్ కీపర్ ప్రవేశానికి అర్హులు. ఢిల్లీలో అయితే ప్రజలకు గ్యాలరీ వుంటుంది. దానిలో నిలబడి వారు జరిగే లావాదేవీలను గమనించవచ్చు. కాని బొంబాయి, మద్రాసు, కలకత్తాలలో ఈ అవకాశం లేదు. కాని బ్రోకర్ కాబిన్‌లో వున్న హాట్‌లైన్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. ఈ రెండున్నర గంటలలో జరిగే వివిధ రకాలైన లావాదేవీలను బోర్డు మీద ఎప్పటికప్పుడు రాస్తూ వుంటారు. బోర్డు మీద వ్రాయటానికి ముందు అఫిషియల్ రిజిస్టర్‌లో నమోదు చేయవలసి వుంటుంది. ఇప్పుడు జరుగుతున్న ఆధునీకరణలో భాగంగా ప్రజలకు టి.వి.లు ఏర్పాటు చేసి దానిలో ఎప్పటికప్పుడు ధరలను, ప్రపంచంలో జరుగుతున్న ముఖ్యమైన విషయాలను టి.టి.వి. న్యూస్‌లు తెలియపరచటం మూలంగా వాటిని కూడా ప్రజలకు టి.వి.లో చూపిస్తున్నారు. 2.30 ఐన వెంటనే ఒక గంట మ్రోగుతుంది. వెంటనే వ్యాపారం ఆపేసి ఆ రోజు జరిగిన లావాదేవీలను ప్రభుత్వం ఇచ్చిన సౌదా బుక్‌లలో రాస్తారు. (సౌదా అంటే వ్యాపారం అని అర్థం). ఇది పూర్తి అయిన పిమ్మట ఏ బ్రోకర్ తనకు అమ్మేడో లేక తన వద్ద కొన్నాడో అతని వద్దకి వెళ్ళి అతని సౌదా పుస్తకంలో ఇతను సంతకం చేస్తే, ఇతని పుస్తకంలో అతను సంతకం చేస్తాడు.

వ్యాపారం జరిగిన పిమ్మట ఆరోజు జరిగిన లావాదేవీలను అధికారికంగా ప్రకటిస్తూ కాగితం ద్వారా వెలువరిస్తారు.

వచ్చే వారం స్టాక్ ఎక్స్ఛేంజీలలో వున్న జంతువులను అదే బుల్ (ఎద్దు) బేర్ (ఎలుగుబంటి)లను కలుద్దాం. □



సీరియల్ మంజీర నాదం

రావినూతల సువర్ణాకన్నన్

(గత సంచిక తరువాయి)

చందన, రసన్‌ల విషాద ప్రణయగాథ చదివిన అరవింద్ మనసంతా భారంగా అయిపోయింది. కళ్ళలో నీళ్ళు నిల్చాయి. ఆ కథంతా కాంతి, భట్టులక్కూడా చెప్పాడు విపులంగా. వాళ్ళకీ కన్నీరాగలేదు. అలా మౌనంగా వుండి పోయారు చాలాసేపు.

"చిత్రమైన కథ" భారంగా అన్నాడు అరవింద్ నిశ్శబ్దాన్ని భరించలేనట్టు.

"నిజంగా అమరగాథే!" అంది కాంతి.

"ఆనాడూ, ఈనాడూ, ఏనాడూ వున్నారు ప్రేమని గుర్తించలేని రాజా పాంధూలాంటి మనుషులు!" అన్నాడు భట్టు. కొంతసేపటి దాకా ముగ్గురూ తేరుకోలేక పోయారు.

వుత్సాహమంతా తీసేసినట్టు మాయమయింది.

"రా శవపేటిక దొరికిన చోటే.... రాజాపాంధూ వుద్యాన వనం వుండి వుండేదికదూ?" ఆనాటి ఆ తోటని, తోటలోని కుటీరాన్నీ వూహించుకుంటూ అంది కాంతి.

"అనేగా అతను రాశాడు!"

"రాకుమారితో పాటు ఆరాధించిన మువ్వల మంజీరాలు కూడా అందంగా వున్నా, ఏదో దీనగాథ చెప్తున్నట్టు లేవూ?"

"అవునమ్మాయిగారూ.... ఈ కథ తెలియక ముందే వాటిని చూసి ఏదో భగ్నప్రేమికుడే అతను అనుకున్నాను" అన్నాడు భట్టు.

కాస్సేపు మువ్వల మంజీరాలని గురించి, వాటిని ధరించిన అందాల చందనని గురించి, అమర ప్రేమికుడు రసన్‌ని గురించీ మాట్లాడు కున్నారు ముగ్గురూ.

రసన్ తల్లిదండ్రులు ఎంత కృంగి పోయారో, రాజాపాంధూ ఎంత పశ్చాత్తాపడ్డాడో, ప్రజలు రాజుని ఎంత దూషించారో వూహించు కున్నారు.

మంచె మీదికి చక్కని నీడ పడుతోంది. చల్లని గాలి హాయిగా శరీరాలకి తాకుతోంది.

అదే మరొకప్పుడైతే ముగ్గురూ చాలా హేపీగాఫీలయ్యేవారు. కానీ రసన్ ప్రణయగాథ తెలుసుకున్నాక మనసు అదోలా అయిపోయాయి. పరిసరాల్లోని అంద చందాలుగానీ, చల్లని పిల్లగాలిలోని మధురిమ గానీ కనిపించడం లేదు.

మరికాస్సేపలాగే మంచెమీద కూర్చున్నారు మౌనంగా.

దూరంగా ఏదో పక్షి వికృతంగా అరిచింది. తృళ్ళిపడ్డా రెందుకో ఆ అరుపుకి.

"అరవింద్!" అతనిక్కాస్త దగ్గరగా జరుగుతూ అంది కాంతి. అతను ఆమెకేసి చూశాడు.

"ఈ పత్రాలు ఏం చేద్దాం?" అంది మెల్లగా.

"అతని కోరిక ప్రకారం పదిమంది చేతా చదివిద్దాం! మ్యూజియమ్‌లో పెట్టి పక్కనే ఇతర భాషల్లో ట్రాన్స్‌లేషన్ చేయించి పెడదాం!... అప్పుడతని ఆత్మంటూ ఇంకా ఉంటే శాంతిస్తుంది!" అన్నాడు అరవింద్.

"ఇంక కాఫీ తాగుదాం!" అన్నాడు భట్టు.

"అలాగే." అన్నారు మిగతా ఇద్దరు.

ముగ్గురూ మంచె దిగారు.

భట్టు కాఫీ పెట్టాడు.

ముగ్గురూ కాఫీలు తాగేసి కప్పులు కడిగి పెట్టేశారు. ఎందుకో వాళ్ళ మనసులు అతిభారంగా ఉన్నాయి. ఎక్కళ్ళేని నిస్త్రాణ ఆవహించేసింది. పదే పదే రసన్, చెందనల రూపాలు గుర్తొస్తున్నాయి.

"నిజమైన ప్రేమికులు!" అనుకున్నారు ఎవరికివారే.

"ఇప్పుడేం చేద్దాం?" అంది కాంతి.

"ప్రస్తుతానికి ఆశవాన్ని పూడ్చేద్దాం..... అలా వుంటే చెడి పోతుందేమో!" అన్నాడు భట్టు.

ఆలోచనలో పడ్డాడు అరవింద్.

జరిగిన కథ –18 : చందన, రసన్‌ల పెళ్ళి జరిపించి దాయమ్మ ఆత్మాహుతి చేసుకుంటుంది. రసన్ చందనలు అడవిలో ఆనంద లోకాలలో తేలిపోతూండగా రాజా పాంధూ పంపించిన సైనికుల చేతికి చిక్కుతారు. విచారణ జరిపి రసన్‌కు ఉరిశిక్ష విధిస్తారు. చందన ఉరి వేసుకుని చనిపోతుంది. రసన్ తమ కథను రహస్యంగా రాస్తాడు. ఆ కథను తన శవంతో పాటు ఖననం చెయ్యమని కోరుతాడు. తన శవానికి దీర్ఘకాలం కాపాడే పసరు పూయమని కోరుతాడు.

"అదే షం పిదేమో" అనుకున్నాడు.

"సరే! పదండి!" అన్నాడు.

ముగ్గురూ నడక సాగించారు మౌనంగా.

"కాంతీ!.... నీ శ్రమవృధా!" సీరియస్‌గా అన్నాడు అరవింద్.

"ఏమిటి?" అర్థం కానట్టు చూసింది కాంతి.

"పాపం! నువ్వనుకున్న నగలు దొరకనే లేదు!" వాతావరణాన్ని తేలిక చెయ్యాలనే ఉద్దేశంతో తమాషాగా అన్నాడు అరవింద్.

"ఇప్పుడు మాత్రం మించిపోయిందేముంది సర్? జాగ్రత్తగా గమనిస్తే మరో పెట్టె దొరక్కపోదు!...." అన్నాడు భట్టు నవ్వుతూ.

"అందులో నూ శవం వుంటే?" భయంగా అన్నాడు అరవింద్.

"ఇంకో చోట తవ్వుదాం!"

"అయితే ఇక్కడ దిక్కులేని చావు చావడానికి సిద్ధంగా ఉండండి!" అంది కాంతి గంభీరంగా.

"అదేమిటి?" ఆశ్చర్యంగా చూశారిద్దరూ.

"మరేం లేదు.... మనం తెచ్చుకున్న తిండి అయిపోయింది."

"నిజమే!.... కాని ... నీ నగలు...." దిగులుగా అన్నాడు అరవింద్.

"నాకేం నగలు అక్కర్లేదు అరవింద్!"


"ఆ శవమే పది కోట్లంటావా?"

"నిజమే.అరవింద్! నువ్వు తమాషాకన్నా, ఆ శవం, 'ప్రేమకి మరణం లేదు" అన్న ప్రణయ గ్రంథం అమూల్యం" మనస్ఫూర్తిగా అంది కాంతి.

చిత్రంగా చూశాడు అరవింద్. అతని అనుమానం గ్రహించిన కాంతి చిన్నగా నవ్వింది.

ఆ నవ్వులో ఆనందం, ఆవేదన కూడా వున్నాయి.

"వాటి విలువ తెలియక ఈ శవాన్నించి, శవ పేటికనించి పారి పోదామన్నాను. ఆ శవాన్ని తాకద్దన్నాను.... ఆ కానీ ఆ ప్రేమగాథ విన్నాక... ప్ప్!... ఆ ప్రేమికుల మీద.... అంతులేని అభిమానం కలుగుతోంది. వాళ్ళని ఎంతకాలం నించో



రచయిత్రి జవాబులు



పెమ్మారి బాలాజీ, కొర్లగుంట

ప్ర : సమాజానికి మార్గ దర్శకులు, ఆదర్శ ప్రాయులుగా వుండాల్సిన రచయితలే కొందరు ఇతర భాషలనించి యధా తధంగా కాపీ కొట్టి పాఠకులను వంచన చేస్తున్నారు. మీరేమంటారు?

జ : నిజమే! కానీ అలాంటి రచనల్ని మీరు ఎందుకు వెలివెయ్యరు?

టి. శశిధరకుమార్, తిరువూరు

ప్ర : రచనలు చెయ్యడంలో మీరు నెంబర్ వన్ కదా?రచనా వ్యాసంగంలో ఒక స్టేజీ కొచ్చాక, రాసిన ప్రతి అక్షరం పబ్లిష్ అవుతుందని నా అభిప్రాయం. ఆ స్టేజీకి మీరు వచ్చారా?

జ : నేను నంబర్‌వన్ అని ఎవరు చెప్పారు మీకు?మీరు చెప్పిన ఆస్టేజీకి నేనురాలేదు. అయినా ఓ మూల నెంబర్ వన్ అంటూ, అలాంటి వారు ఏంరాసినా పబ్లిష్ అవుతుందంటూ, మీరాస్థాయికి ఎదిగారా అంటారేవిటండీ?

నాగండ్ల వెంకటేశ్వర్రావు, అమ్మాపాలెం, షేక్ షహబుద్దీన్, మాచర్ల

ప్ర : 1. నేటి నాగరికా ప్రపంచంలో మనం ముందుకు పయనిస్తున్నామనుకుంటే "సతీ సహగమనం" లాంటి దురాచారాలు తలెత్తుతున్నాయి. ఈ మూఢ నమ్మకాలకి అంతం లేదంటారా? 2. సతీ సహగమనం చేసిన రూప్ కన్వర్ భర్తకి న్యాయం చేసిందా, లేక పాపం చేసిందా?

జ : 1. మనుషుల్లో స్వార్థం అంటు వ్యాధిలా పెరిగి పోతోంది. స్వార్థం, మూఢా చారాలూ, శరీర, ప్రాణాలు!స్వార్థం లేనినాడు మూఢా చారాలూ లేవు. రూప్ కన్వర్ చిత్రాలని అమ్మి సొమ్ము చేసుకుంటుంటే మీకనిపించలేదూ! 2. అసలు రూప్‌కన్వర్ సహగమనం చెయ్యలేదు. బలవంతంగా చంపబడింది.

జి. సునీత, గొల్లప్రోలు

ప్ర : సువర్ణాకన్నన్ గారూ! కొన్ని రచనలు చదువుతుంటే ఏదో అసంతృప్తిగా వుంటుంది. మీ "మంజీరనాదం" మాత్రం చాలా బావుంది. రచనలు సాహిత్యాభిమానం పెరిగేలా వుండాలంటాను. మీరేమంటారు?

జ : నా రచన మీకు నచ్చినందుకు కృతజ్ఞతలు. మీ అభిప్రాయమే నా అభిప్రాయమూను!

> **(ఉత్తమ ప్రశ్న)**
>
> ఎల్. ఉష, గంగపట్నం
>
> ప్ర : ఒక స్త్రీ భర్త హింసలను భరించలేక పుట్టింటికి చేరితే, పుట్టింటి వారు ఆదరించ నప్పుడు ఆ స్త్రీకి చావే శరణ్యమా? లేక జీవితాంతం భర్త పెట్టే హింసలను భరించాల్సిందేనా?
>
> జ : ఎవరన్నారా మాట? చావు ఏ సమస్యకీ పరిష్కారంకాదు. ఆత్మస్థైర్యం వుండాలి. అప్పుడు తల్లిదండ్రులు, భర్తేకాదు లోకమంతా ఒంటి కాలిమీద లేచినా ఏం భయంలేదు. అందుకు తగినంత చదువు, ధైర్య సాహసాలూ వుండాలి.

ఎమ్. అనపరం, పెయ్యేరు

ప్ర : అక్కయ్యా! మన సమాజంలో జరుగుతున్న వరకట్న హత్యలని రూపుమాపాలంటే?

జ : యువతలో నిజమైన చైతన్యం రావాలి.

జి. రోహిణి, గుంటూరు

ప్ర : మిసెస్ కన్నన్‌గారూ! మీ రచనలు కావాలని బుక్‌స్టాల్స్‌కి వెళ్తే రెఫరెన్స్ బుక్సలా లోపల్నించి తెచ్చిస్తున్నారు. అదేమంటే వాటికి డిమాండ్ ఎక్కువ, అవి బైట పెడితే మిగతావారి బుక్స్ ఎవరూ కొనరు అన్నారు. నిజంగా మీపేరుకు తగ్గట్టు మీరు బంగారమే.

జ : అయ్యా బాబోయ్! అంత దూరీ ఆకాశానికి ఎత్తెయ్యకండి. తల తిరుగుతుంది. మీ కాంప్లిమెంట్‌కి మెనీ థాంక్స్!

అరుణ, క్రిష్ణాపూర్(కర్నాటక)

ప్ర : సువర్ణగారూ! మాకు మీ మీద ఎంతో అభిమానం ఏర్పడింది అభిమానం మీ రచనల వల్లా, లేక మామీద చూపే అభిమానం వల్లా?

జ : మీ అభిమానానికి థాంక్స్. నా రచనల ద్వారానేగా మీ అభిమానాన్ని సంపాదించుకున్నది!

బి. సుదర్శన్, భీమవరం

ప్ర : సువర్ణాకన్నన్ గారూ! ప్రజల బలహీనతల్ని ఆసరాగా తీసుకుని వ్యాపార దృష్టితో రచనలు చేసే వారిపై మీ అభిప్రాయం?

జ : ఒక్క రచయి(త్రు)తలేనా వ్యాపార దృష్టితో వున్నది? ఈ యాంత్రిక యుగంలో అన్నీ వ్యాపార ధోరణి లోనే వున్నాయి. కాకపోతే జనాన్ని వక్రమార్గానికి నడిపించనంత వరకు పరవాలేదు.

సి. మున్నీ, కొన్నగురకల్

ప్ర : అబ్బ! మీ మంజీరనాదం ఎంత బావుందో! ప్రతివారం సీరియల్ చదివి మీ ఫోటో ని ముద్దు పెట్టుకుంటాను తెలుసా!

1. ప్రతి రచయి(త్రు)తలు ప్రేమ లేకుండా నవలలు రాయరెందుకు? 2. ప్రేమంటే ఏమిటి? 3. మీ కలంనించి ఓ సైంటిఫిక్ రచనను ఆశించవచ్చా?

జ : థాంక్స్! కానీ మీకు నచ్చింది నానవలా? లేకపోతే నా ఫోటో నా?

1. ప్రేమ లేందే లోకమేలేదు! 2. ప్రేమ అనంతం 3. పెద్దలెంతో మంది సైంటిఫిక్ రచనలు చేస్తున్నారు. నన్నిలాగే వుండనివ్వరూ! □

మంజీరనాదం

ఎరుగని అనుభూతి కలుగుతోంది!" కాంతి ఉద్వేగంగా అంది.

"నిజమే" అన్నాడుభట్టు.

"కష్టపడి ఇక్కడి కొచ్చినందుకు మనకి మంచి నిధే దొరికింది" అన్నాడు అరవింద్.

మళ్ళీ అందరి మనసులూ భారంగా అయిపోయాయి. అందరికళ్ళ ముందు రసన్ అందమైన రూపం మెదులుతోంది.

మెల్లగా నడక సాగించారు.

"అరవింద్!" మెల్లగా పిల్చింది కాంతి నడుస్తూనే.

"ఏవిటి కాంతీ!" అన్నాడతను.

"ఈ గ్రంథాన్ని....."

"చెప్పానుగా ప్రభుత్వానికి అప్ప చెప్దామని?"

"అదికాదు అరవింద్?"

"మరి? ...." వెనక్కి తిరిగి ఆమెకేసి చూశాడు అరవింద్.

"అది... మనం వుంచేసుకుందాం!"

"ఏవిటి?" తృళ్ళిపడ్డాడతను.

"అవును అరవింద్ ఆగ్రంథాన్ని మనం వుంచేసుకుందాం!"

"అలాగే!" నవ్వాడు అరవింద్.

"తమాషాక్కాదు అరవింద్! నేను నిజంగానే చెప్తున్నాను... ఈ ప్రణయ కావ్యాన్ని మనం వుంచేసుకుందాం"

ఆమె తమాషా కనడం లేదని గ్రహించిన అరవింద్ నిర్ఘాంత పోయాడు. భట్టు కూడా తెల్లబోయాడు.

మళ్ళీ అదే మాట అంది కాంతి.

"కాంతీ! ఏవంటున్నావ్ నువ్వు?" అన్నాడు అరవింద్ తేరుకుని.

"ఈ గ్రంథం నాక్కావాలరవింద్!"

"సారీ! కాంతీ! ఇది నువ్వనవలసిన మాట కాదు" గంభీరంగా అన్నాడతను.

"అవునమ్మాయిగోరూ!.... ఇది మనదగ్గరుండకూడదు అది చాలా నేరం. ఆకథ విని చలించి పోయి అలా అన్నారేగానీ అది నేరమని మీకు మాత్రం తెలియదూ?" అన్నాడు భట్టు.

"లేదు భట్టూ నాకా గ్రంథం కావాలి!"

భట్టు, అరవింద్ మొహాలు చూసుకున్నారు.


"అలాకాదు కాంతీ! దాన్ని తీసికెళ్ళి మీ నాన్న గారికిద్దాం. ఆయన ప్రభుత్వానికిస్తారు. ప్రభుత్వం వారు దాన్ని పలు భాషల్లోకి అనువదించి ఒరిజనల్స్ మ్యూజియంలోనూ, కాపీలు లైబ్రరీల్లోనూ పెడతారు. అప్పుడు ఈ గాథ చాలా మంది చదువుతారు. అంతే కాదు మనకి మంచి పేరు ప్రఖ్యాతులొస్తాయి. వస్తే అవార్డ్ కూడా రావచ్చు!" తమాషాగా అన్నట్టు అన్నాడు అరవింద్.

కాంతి మాట్లాడలేదు.

"పోనీ ఓపన్జెయ్యండమ్మా" అన్నాడు భట్టు.

"ఏవిఁటి?" అన్నట్టు చూసిందామె.

"గ్రంథాన్ని ప్రభుత్వానికిచ్చేద్దాం!.... చందన కాలి మువ్వల మంజీరాలు మాత్రం మీరు వుంచేసుకోండి. ఎవరికీ అనుమానమూ రాదు. అపురూపంగానూ



వుంటాయి" అన్నాడు భట్టు వుత్సాహంగా.

"నాకు ఆ పట్టాలక్కర్లేదు" అంది కాంతి.

ఆమెక్కోపం వచ్చిందని గ్రహించారు మిగతా ఇద్దరూ. పసిపిల్లలా అలిగినట్టు బుంగమూతి పెట్టిన ఆమెని చూసి చిన్నగా నవ్వాడు అరవింద్.

ఆ నవ్వుని చూసి ఆమె మరీ చిటచిటలాడింది.

"కాంతీ!.... ఓ మాట చెప్తాను వింటావా?" మెల్లగా అన్నాడు అరవింద్.

"ఏవిఁటి?" అన్నట్టు చూసిందామె.

"ఆ నవల తీసుకుని నువ్వేం చేసుకుంటావ్?"

"నా కబోర్డ్‌లో దాచుకుంటాను!"

"అది నీకు చదవడం రాదుగా?"

"రాకపోతే మాత్రం ఏం.... కథ పూర్తిగా తెలిసిందిగా!"

"పోనీ ఇంకెవరికైనా ఇస్తావా?"

"ఊహుం! నాదగ్గరలాంటి పుస్తకం వుందనే ఎవరికీ తెలియనివ్వను"! గభాల్న అంది కాంతి.

"అలా అయితే రసన్ కోరికెలా తీరుతుంది"?

"అంటే?" కళ్ళు చిట్లించిందామె.

"అదికాదు కాంతీ!.... అతను ఎంతో రిస్క్ తీసుకుని ఎంతో ఆశతో ఆగ్రంథాన్ని రాశాడు. నలుగురూ ఆ రచన చదవాలనీ, తమ ప్రేమగాథ తెలుసుకోవాలనీ కోరుకున్నాడు. అది మనదగ్గరే వుంచుకున్నామనుకో ప్రభుత్వం దృష్టిలో నేరస్థుల మవుతాం అన్న మాటటుంచి, అమర ప్రేమికుడైన రసన్ కోరిక కోరికలాగే మిగిలి పోదూ?" అనునయంగా అన్నాడు అరవింద్.

"నిజమే!" అనిపించింది కాంతికి.

భారంగా నిట్టూరుస్తూ–

"మరైతే.... ఆశవం?" అంది.

"అదే ఆలోచిస్తున్నాను.... ఇది పురాతన శవం కాబట్టి దీనికెంతో విలువుంటుంది. అందుకే ఎవరికంటా పడకుండా దాన్ని భద్రపరిచి మన వెళ్ళి ప్రభుత్వానికి చెబ్దాం"! ఆపై ఆశవాన్ని తరలించే ఏర్పాట్లు వాళ్ళే చేస్తారు" అన్నాడు అరవింద్.

మౌనంగా తల ఊపింది కాంతి.

"అరవింద్! .... అలా ఇంకా చిక్కటి అడవిలోకెళ్తే!" అలా అడవంతా కలయ తిరుగుతూంటే అంది.

"మన బొమికలు కూడా మిగలవ్!" నవ్వాడతను.

ఎందుకో కాసేపలా తిరగాలనిపించింది వారికి.

ఇంతలో ఓపెద్ద పాము చెట్టు మీంచి జారి కాంతి బుజం మీద పడింది.

కెవ్వున అరిచింది కాంతి.

భట్టు దాన్ని చేతితో పట్టుకుని దూరంగా విసిరేశాడు.

పాము లేకపోయినా ఇంకా ఒణికి పోతూనే ఉంది కాంతి. దాని స్పర్శ... వెంటాడి భయపెడుతూనే ఉందామెని.

"సాధారణంగా ఈ పాములు కరవ్వమ్మాయి గారూ... కరిచినా వాటికి విషం ఉండదు!" కాంతి ముఖంలోని భీతి చూసి అన్నాడు భట్టు.

"అవును కాంతీ! ... ఇంతవరకు మనం ఎన్నిపాములు చూళ్ళేదు? ... అవేమైనా మన జోలికొచ్చాయా?...." అన్నాడు అరవింద్‌కూడా.

అయితే.... ఇప్పుడు కాంతి మీద పడ్డపాము నిరపాయకరమైంది కాదనీ, భయంకరమైన గోధుమవన్నె తాచనీ అతనికి తెలుసు. అందుకే–

"ఏమైనా కాంతిని ఈ ప్రదేశాలకి తీసుకొచ్చి వుండకూడదు!" అనుకున్నాడు మనసులో –

భట్టుక్కూడా అలాగే అనిపించింది.

కాంతి పాముని గురించి అతను చెప్పిన మాటలు నమ్మిందో లేదోగానీ... మౌనంగా ఉండి పోయింది.

అలా మౌనంగానే శవపేటిక వున్న చోటికి చేరుకున్నారు ముగ్గురూ.

అయితే అటువైపు చూసిన ఆ ముగ్గురి నోట చిత్రమైన శబ్దం వెలువడింది.

శవపేటిక వుండవలసిన చోట పెద్ద గొయ్యి ఉందే తప్ప శవ పేటిక మాత్రం లేదు.

* * * * * * * * *

"శవం ఏమైంది?" అంది కాంతి ఒణికిపోతూ. ఆ సంగతి వాళ్ళకీ తెలియదని ఆ సమయంలో ఆమెకి తోచలేదు.

నిర్ఘాంత పోయిన అరవింద్.... కాంతి మాటలతో ఈ లోకంలో కొచ్చాడు.

"సర్! .... ఎవరో వచ్చారు!" అన్నాడు భట్టు భయంగా.

"అవును!" అన్నట్టు తలఊపాడు అరవింద్.

"అరవింద్!" చటుక్కున అతని చేతిని పట్టుకుంది కాంతి. ఆమెకళ్ళలో అంతులేని భయం తొంగి చూస్తోంది.

ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు అరవింద్, ఆమె శరీరం సన్నగా కంపిస్తోంది.

నిజానికి అతనికీ కంగారుగానే వుంది. అయితే తన కంగార్నేం కనిపించకుండా, చుట్టూ చూస్తూ.

"మన చర్యనంతా ఎవరో గమనించి ఉండాలి!" అన్నాడు.

"అరవింద్!".... మరింత భయంగా అంది కాంతి.

"ఏం భయంలేదు కాంతీ!"

"కాదరవింద్! ... మనం వెంటనే వెళ్ళిపోదాం! జరిగిన అనుభవాలు చాలు! ప్లీజ్!" అంది గద్గదస్వరంతో.

అతనేం మాట్లాడలేదు.

"అరవింద్! ముందు పద! స్థావరానికెళ్ళి పోదాం! నాకేదో భయంగా ఉంది!" అంది కాంతి అతని చెయ్యి పట్టి లాగుతూ.

దానికీ అతను సమాధానం చెప్పలేదు.

చిరాగ్గా ఇంకేదో అనబోయిందికాంతి.

ఇంతలో దూరాన ఏదో గుర్రాలు పరుగులు తీసే శబ్దం వినిపించడంతో ముగ్గురూ తుళ్ళిపడి అటు చూశారు.

కాంతి ఫెయింటయేలా ఉంది.

ఆమెకి బంది పోట్లు, దొంగలు, అడవి జాతి వాళ్ళు, వాళ్ళ నరబలులు గుర్తొచ్చాయి.


"అరవింద్ ...." అంది భయంగా.

"ష్!" అన్నట్టు సౌంజ్ఞ చేశాడు అరవింద్. తప్పని సరిగా మౌనం వహించింది కాంతి.

"అసలు గుర్రాలు అంత పరుగులు తీసేంతటి విశాలమైన స్థలం ఎక్కడుందీ అడవిలో" అప్పటి వరకు మౌనంగా ఉన్న భట్టు అన్నాడు.

"ఉండే వుండాలి మరి!.... అయినా మనం అడవి మధ్యకి వెళ్ళలేదుగా... మనకి తెలియకుండా.... ఇక్కడెక్కడో అలాంటి విశాల ప్రదేశం వుండి వుండాలి. బహుశా వాళ్ళు ఈ అడవిలో తిరిగే అడవి మనుష్యులే కావచ్చు! ఇన్నాళ్ళూ ఈ శవపేటిక సంగతి వాళ్ళకు తెలిసుండదు. తీరా ఇప్పుడిక్కడ ఈ పెట్టె చూసి తమ





శత్రువులెవరో వచ్చారని గ్రహించి వుండాలి! అందుకే .... కామ్‌గా శవాన్ని మాయం చేశారు.

"ఏం చేసుకుంటారా శవాన్ని?" అంది కాంతి.

"చూడాలి!.... ఒకవేళ.... వాళ్ళు భానూర్ వంశస్థులైనా కావచ్చు... ఈ శవం వాళ్ళకేమైనా అనుమానాలుండచ్చు.... వాళ్ళకి సంబంధించిందేమో అని!".... ఏదో ఆలోచిస్తూ అన్నాడు అరవింద్.

"మరైతే మనల్ని అంత తేలిగ్గా వదిలి పెడతారా?" అన్నాడు భట్టు.

"వదలక పోవచ్చు!"

"అరవింద్!" కంగారుగా చూసింది కాంతి.

"ఇంక క్షణక్షణానికీ భయపడితే లాభం లేదు కాంతీ. గుండెధైర్యం తెచ్చుకో!.... ఇన్నాళ్ళూ మనం చూపించింది ధైర్యంకాదు. ఇంక చూపించాల్సిందే నిజమైన ధైర్యం! ...." గంభీరంగా అన్నాడు అరవింద్.

బేలగా చూసింది కాంతి.

"పద కాంతీ! ... ముందు మన స్థావరాని కెళ్ళిపోదాం.... మెల్లగా మళ్ళీ ఇక్కడికొచ్చి ఆశవాన్ని గురించి పరిశోధిద్దాం!" అంటూ రెండడుగులు వేశాడు అరవింద్.

"వద్దు అరవింద్! మనం ఇంటికెళ్ళిపోదాం! నాకింకా నాలుగు రోజులపాటు బ్రతకాలనుంది!" సీరియస్‌గా అంది కాంతి.

"కాంతీ! ... ఏమిటి పసిపిల్లలా మాట్లాడతావ్?... ఇంత పెద్ద నిధి దొరికితే ... ఊరికే వదిలేసి వెళ్ళిపోదా మంటావా?" అనునయంగా అన్నాడు అరవింద్.

"నిజమే అనుకో! కానీ.... అది దొరికినట్టే దొరికి మళ్ళీ చేజారి పోయిందిగా?"

"అందుకే ఎలాగైనా దాన్ని తిరిగి పొందాలి! తెలివిగా సాధించాలి!...

"ఎలా?"

"వాళ్ళకి కండబలం వుండచ్చుకానీ. మనంత తెలివి తేటలుండక పోవచ్చు! మనదగ్గర ఆయుధాలు కూడా వున్నాయి. జాగ్రత్తగా ప్రయత్నిస్తే ఫలించచ్చు! కానీ నాకు మీ ఇద్దరి పూర్తి కోపరేషన్ కావాలి!" అన్నాడు అరవింద్.

"అంటే?"

"అంటే .... అడుగడుక్కీ ఆటంక పరచకుండా, అనవసరంగా భయపడకుండా, ధైర్యంగా ముందడుగు వెయ్యాలి ఓ! కే?" చిన్నగా నవ్వుతూ అన్నాడు అరవింద్.

ఓసారతని కేసి చూసి "అలాగే" అన్నట్టు తలూపింది కాంతి.

"ఇంతకీ.... ఇది ... అడవి మనుష్యుల పనే అంటారా?" అనుమానంగా అడిగాడు భట్టు.

"కావచ్చు. కాక పోవచ్చు!... ఇది కేవలం నా అనుమానమే అవచ్చు!" ఏదో ఆలోచిస్తూ అన్నాడు అరవింద్.

ముగ్గురూ మౌనంగా నడక సాగించారు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండి స్థావరం కేసి నడుస్తున్నారు. దారిలో అడివి మనుష్యులు జాడగానీ, మరే ఇతర వ్యక్తుల గుర్తులు గానీ ఏవైనా కనిపిస్తాయేమో అన్నట్టు నేల చూపులు చూస్తూ నడవసాగారు.

నిశ్శబ్దం భయాన్ని పెంచుతోంది. అయినా ఎవరినోటినించీ మాట రావడం లేదు. ఒక వేళ వచ్చినా ఒకరొకరు విమర్శించు కోవడం లాంటివి ఎదురవచ్చునేమో, ఎవరూ మాట్లాడ్డం లేదు.

అరవింద్‌కి అన్ని విధాలా సహకరించాలని అనుకున్నా, ఏందుకో కాంతి మనసులో చోటు చేసుకున్న భయం ఎలాగైనా అతన్ని "ఇంటికి తీసుకుపో" అంటోంది.

"ఇప్పుడేం చెయ్యాలి! .... అరవింద్‌కి నచ్చ చెప్పి ఎలా తీసికెళ్ళాలి?" అన్న ఆలోచనలో పడిపోయిన కాంతి తన స్థావరానికి వచ్చేసినట్టు గమనించనే లేదు.

ఆమె అనేవిటి మిగతా ముగ్గురూ కూడా పరధ్యానంగానే స్థావరానికి చేరుకున్నారు.

"అమ్మయ్య" అన్నట్టు ఓ స్సారి తలెత్తి చూశారు.

అంతే! గుండె ఆగినట్టయింది అందరికీ. అక్కడ కనిపించిన దృశ్యం చూసి ప్రతిమల్లా బిగుసుకు పోయారు.

కారణం వారు కట్టుకున్న మంచె పూర్తిగా ధ్వంసం చెయ్యబడి వుంది. దాని మీదున్న వస్తువులన్నీ చెల్లా చదురుగా తలో మూలా పడున్నాయి.

"ఏనుగుల మంద వచ్చినట్టుంది" గాబరాగా అన్నాడు భట్టు తేరుకుని.

"అంత పైన వున్న మంచె ఎలా అందుతుంది వాటికి?" అంది కాంతి నీరసంగా.

అరవింద్ కళ్ళు చిత్రంగా ముడుచుకున్నాయి. ఏదో అనుమానంతో గబా... చెట్టు మొదలు దగ్గరికెళ్ళి, శిథిలమైన మంచెనీ, పరిసరాల్నీ పరి...

అయితే ...స్నీ వు... ..., వాళ్ళు అతి ముఖ్యమైందిగా భావించే ప్రణయగ్రంథం మాత్రం లేదు!

(ఇంకా ఉంది)

మంచిని పెంచి చూడు

టి. విమలారామం

సుశీలకి ఆవేళ చాల ఆనందంగా వుంది.

బయట ఎండ అందంగా వుంది. అన్నాల దగ్గర పిల్లల పేచీలు ముచ్చటేసాయి. ఇంటి ముందు బీటదీసిన పిట్ట గోడ రోజూ మాదిరి చిరాకనిపించ లేదు. ముందు గదిలో మారుమూల సాలెగూడు కూడ ఇప్పుడు చివుక్కుమనిపించలేదు!

మనస్సులో సంతోషంగా వున్నప్పుడు లోకంలో అన్నీ అందంగా కనిపిస్తాయి. మామూలుగా చిరాకనిపించేవేవీ ఆ క్షణంలో చికాకనిపించవు!

సుశీల కావేళ అంత ఆనందంగా ఉండటానికి కారణం వుంది! ఎప్పుడో పన్నెండేళ్ళక్రితం పెళ్ళికి కొనటమే! మళ్ళీ మరో పట్టు చీర కొనలేదు భర్త! అతను కొనలేదని తాననలేదు. మనసులో కూడ అనుకోలేదు. కొనలేకపోయానని తానే పలుమార్లు అనుకున్నాడు. ఏవో అత్యవసరమయిన ఖర్చులు, మరేవో హఠాత్తుగా ముంచుకొచ్చిన ఇబ్బందులు, అతనికి వీలు చిక్కనివ్వలేదు.

సుధాకర్ చాల కచ్చితమయిన మనిషి. కాలేజీలో చదువుకొనే రోజులప్పట్నించీ అంతే! రేపు చేయవల్సిన పనికి ఈవేళనుంచీ ప్లాను వేస్తాడు. వచ్చే నెలలో కొనవల్సిన వస్తువు గురించి ఇప్పట్నించే పథకం వేసుకుంటాడు. ఆ ప్రణాళిక సానుకూలపడితేనే అమలు జరుపుతాడు. తన కందుబాటులో లేకపోతే వాయిదా వేస్తాడు. లేకపోతే పూర్తిగా ఆ సంగతే వదిలేస్తాడు. అంతేకాని, ఎక్కడోక్కడ అప్పయినా చేసి ఆ కోరిక తీర్చుకోవాలనుకునే తత్వం మాత్రం కాదతనిది!

అలా అతను వాయిదాలు వేస్తూ వచ్చిన ప్రణాళికలలో భార్యకి పట్టుచీర కొనటం అన్నది ఒకటి! ఇన్నాళ్ళ కాపథకాన్ని అమలు జరిపే అవకాశం అతనికి వచ్చింది!

సెలక్షనుగ్రేడు అరియర్సు, బోనసు, ఇంక్రిమెంటు అరియర్సు - ఇంచుమించు అన్నీ కలిసి ఒకేసారి వచ్చాయి. ఒక్కసారిగా మూడు వేలుపైచిల్లర వచ్చాయి.

"ఏం చేద్దాం ఈ డబ్బు?" భార్య ఏమంటుందో అని అడిగాడు సుధాకర్.

సుశీల చిత్రంగా చూసింది. "నన్నడుగుతా రేమిటి? మీకు తెలియదా యేం?"

"అదికాదు. ఏం చేస్తే బావుంటుందని నీ కనిపిస్తుందో చెప్పు!"

ఒకక్షణం ఆలోచించింది ఆమె. "మళ్ళీ మళ్ళీ ఇంత డబ్బు చేతికి రాదుగా! బంగారం కొని రాధ కేదయినా చేయిస్తే బావుంటుందేమోనని!"

"చేయించచ్చు. కాని, పిల్ల పెట్టుకొని బయటకు వెళ్ళే వయస్సూ లేదు. రోజులంత మంచివీ కావు! ఇక అలాంటప్పుడు నగలు చేయించి పెట్టెలో పెట్టుకొని ముచ్చట పడటామా?"

"అయితే, ఏం చేద్దామంటారు?"

"ఈ డబ్బుని మూడు వాటాలు వేస్తాను. వెయ్యి రాధ పేర్న, వెయ్యి ప్రసాద్ పేర్న ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేస్తాను. ఇలా జాగ్రత్త చేస్తే వాళ్ళ కాలేజీ చదువుల నాటికో - పెళ్ళిళ్ళనాటికో చేతికంది వస్తుంది! ఇలాంటివి ఎన్నెన్ని చేస్తే అప్పటి ఖర్చులు దాటగలం మనం!" అని నవ్వాడు సుధాకర్.

"పోనీ, తక్కిన వెయ్యి కూడ ఫిక్సెడ్‌లో వేసెయ్యండి" అంది సుశీల ఏదో ఆలోచిస్తూ.

"డబ్బంతా బ్యాంకులో వేసుకొని ఇప్పుడున్న కోరికలన్నీ చంపేసుకుంటామా ఏమిటి?"

"అంటే, ఏం చేద్దామంటారు?" అని అడిగింది సుశీల కుతూహలంగా.

"ఎన్నాళ్ళనుంచో నీకో పట్టు చీర కొనాలని...."

సుశీల ముఖం ఎర్రనయింది.

"అదిగో అచ్చంగా నీ ముఖం ఎంత ఎర్రబడిందో అంత చక్కటి రంగులో ఒక చీర కొంటాను."

"ఎందుకండీ ఇప్పుడు?" అంది బిడియంగా.

"పట్టుచీర కొంటానంటే ఎగిరి గంతేసే ఆడదాన్ని చూసానుకాని నీలాంటిదాన్ని నేనెప్పుడూ చూళ్ళేదు!"

సుశీల చిన్నగా నవ్వింది. "లేనంతవరకే కావాలి కాలనిపిస్తుంది. తీరా కొనుక్కుంటే కట్టేదెన్ని సార్లు! పెళ్ళికో, పేరంటానికో తప్ప మామూలుగా పెట్టి పూజకేకదా!"

"మై గాడ్! మొగుళ్ళనవల్సిన మాటలు ఇలా పెళ్ళాలనటం మొదలు పెడితే కంచి పట్టు, కాశీపట్టు, పెద్దాపురం పట్టు.... ఈ పట్టు చీరలన్నీ ఏమయిపోతాయి?"

"వేళాకోళం కాదు. నిజం చెపుతున్నా. నా కింకో పట్టు చీర వుంటే బావుంటుందని ఇదివరకెప్పుడో అనుకున్నాను. కాని, ఇప్పుడు నిజంగా అలాంటి కోరిక నా కేదీ లేదు!"

సుధాకర్ చిత్రంగా చూశాడు.


"సమయం వచ్చింది కనుక చెపుతాను. నా కో కోరిక వుంది. మీరు తీరుస్తానంటే...."

"....ఏమిటో చెప్పు" అన్నాడు కుతూహలంగా.

సుశీల ముఖం ఎందుకో ఎర్రనయింది. "చెపితే నవ్వకూడదు."

"నవ్వనుగా!" అంటూ నవ్వేసాడు.

"అదిగో, అలా నవ్వుతారనే నేనింతవరకూ ఎప్పుడూ మీతో ఆ మాట సరదాగా కూడా అనలేదు. కాని, ఇప్పుడు డబ్బు చేతిలో వుంది. మీరవునంటే ఆ



కోరిక తీరటం క్షణాలమీదవని."

"పిచ్చిదానా! ఈ వెయ్యి రూపాయలు నీకు పట్టుచీర కొనాలనే కేటాయించాను. ఈ డబ్బు నీది. నువ్వెలా నీ కోరిక తర్చుకున్నా నా కిష్టమే! ఏం కావాలో చెప్పు నీకేం కావాలంటే అది కొంటాను."

అల్మారాలోంచి ఒక ఫోటో తీసి భర్తకి చూపించింది సుశీల. "ఈ ఫోటోలో వాళ్ళిద్దరూ ఎలా వున్నారు?"

"ఎలా వున్నారు? చూడ ముచ్చటగా వున్నారు!"

"ఆ అందమంతా మా చెల్లెలి మొగుడిది కాదు. అతను వేసుకున్న సూటుది!"

సుధాకర్ చకితుడయ్యాడు. "బలేదానివే!...."

"కాదంటారా? పెళ్ళికి మీరు చూసారుగా! ఫోటోలో అంత అందంగా ఉంటాడా అతను! రూపురేక లొక్కటేకాదు. వేసుకున్న బట్టలు కూడ మనిషికి అందాన్నిస్తాయి."

"ఇంతకీ ఏమంటావు? మీ మరిదిగారిలాగే నన్ను కూడ సూటు బూటు వేసుకొని నీ పక్కన నిలబడి ఫోటో తీయించుకోమంటావా?" అన్నాడు సుధాకర్.

అతని కళ్ళల్లోకి ప్రేమగా చూస్తూ అంది సుశీల. "అవునండీ! అదే నా కోరిక!"

కొన్ని క్షణాలపాటు నోరు తెరిచి చూస్తూండిపోయాడు సుధాకర్. ఆ తర్వాత అతనికి అంచెలంచెలమీద నవ్వు ముంచుకొచ్చింది.

"అదిగో! అలా నవ్వుతారనే నేనింతకాలం చెప్పలేదు" అంది సుశీల ముఖం తిప్పుకుంటూ.


భార్య భుజంమీద చెయ్యి వేసి "పిచ్చిదానా! పట్టుచీరనే పెట్టి పూజ చేయాలన్నదానివి ఒక్కసారి ఫోటోలో దిగటానికి నన్ను సూటు కుట్టించుకోమంటావా? ఇదెక్కడి కోరిక!"

"ఫోటో కోస మేమిటి? మీరు సూటు వేసుకొని ఆఫీసుకి వెడతారని."

"అంతా టాటాకులు కట్టటానికా?"

"అదేమిటి? మీ డబ్బెట్టి మీరు సూటు కుట్టించుకొని వేసుకుంటే ఎవరో ఎందుకంటారు?"

"చూడు సుశీ! మనం సంఘంలో వున్నప్పుడు 'మనకు మన యిష్టం వచ్చిన పనులు చేసుకుంటూ పోవటవేకాదు - ఎవరిచేతా వేలెత్తి చూపించుకోని విధంగా చేయాలి. నాతోటి వాళ్ళెవరూ వేసుకోరు. మా సూపరింటిండెంటుగారు కూడ సూటు ఎప్పుడూ వేసుకోవటం నేను చూళ్ళేదు. ఇప్పుడు నేను చేసే చిన్న చిన్న తప్పులు కూడ క్షమించి వదిలేసే ఆఫీసరుగారికి రేపు నేను చెయ్యని తప్పులు కూడ భూతద్దంలో కనిపిస్తాయి. సూటు, బూటు చూసుకొని మురిసిపోవటంకాదయ్యా - కాస్త ఆఫీసు



మంచిని పెంచి చూడు

పనిమీద దృష్టి పెట్టుకొని చెయ్యాలి - అని చివాట్లు వేసినా ఆశ్చర్యం లేదు. ఏమిటి - లాటరీ తగిలిందా ఇంత దుబారా చేస్తున్నావు అని తోటివాళ్ళు హేళన చేయగలరు!"

"అంటే, మన బ్రతుకు మన యిష్టం వచ్చినట్టు బ్రతకటానికి లేదంటారా?" అంది సుశీల నిరుత్సాహంగా.

"మనిద్దరం అలా రోడ్డుమీద షికారు వెడుతున్నామనుకో! నువ్వు వయ్యారంగా అడుగులు వేస్తూ నడుస్తున్నావనుకో! హఠాత్తుగా నాకు మనసయిందని ఇలా నిన్నమాంతంగా కావలించుకుంటే అప్పుడు ఏమవుతుంది?..."

"...ఊఁ! ఏమిటీ పని, వీధి తలుపులు తీసి వున్నాయి.

సుధాకర్ పకపక నవ్వాడు. "మరి, ఇంట్లోనే నీకిలా అనిపిస్తే వీధిలో ఆ పని చేయలేనుకదా! అంటే, సమయం సందర్భం చూసి ఏ పనయినా చేయాలని అర్థం. దీనిబట్టి నల్గురికీ నచ్చని పనిని మనం చేయలేమని ఒప్పుకుంటావుకదా!"

"దానికీ దీనికీ ముడి పెడతా రేమిటి? అదీ యిదీ ఒకటెలా అవుతుంది?" అంది సుశీల చిరుకోపంతో.

"చాలామందికి నచ్చనిది ఏదయినా ఒక్కటే సుశీ! వాస్తవం చెప్పాలంటే నేను సూటు వేసుకోవటం నీకూ నాకూ ఇష్టం కావచ్చుకాని ఇంకెవరికీ ఇష్టముండదు. చివరికి మా అమ్మ మీ అమ్మగారు కూడ ఇష్టపడరు. పిల్లల చదువులు - పెళ్ళిళ్ళు ముందు ముందు పెట్టుకొని ఏమిట్రా ఈ దుబారా ఖర్చులు అని అంటారు. నాతో కాదు - నీతోనే అంటారు. అలాకాక నీకు పట్టుచీరే కొన్నాననుకో -ఇన్నాళ్ళకో మంచి పని చేసావురా అని మా అమ్మ అంటుంది. మా అల్లుడు ప్రయోజకుడయ్యాడని మీ వాళ్ళూ సంతోషిస్తారు. పైపెచ్చు మన పక్కింటి పిన్నిగారు కూడ నీ పట్టుచీర చూసి, సుధాకర్‌కి వాళ్ళావిడంటే ఎంత ప్రేమో అని మురిసిపోతుంది. కావాలంటె కట్టుకు వెళ్ళి చూపించు!..."

"సర్లెండి. నా మొగుడికి నామీద ఎంత ప్రేముందో అందరూ సర్టిఫికెట్ యిస్తే కాని నాకు తెలియదా యేమిటి?"

"ఈ రోజుల్లో సర్టిఫికెట్లు లేందే ఏ పనీ జరగటంలేదు మరి! అందులో ఆపెద్ద గెజిటెడ్ ఆఫీసరుగారి భార్య కూడాను" అని గలగల నవ్వాడు సుధాకర్.

చివర కెలాగయితేనేం భార్యని ఒప్పించాడు సుధాకర్. ఆవేళ సాయంత్రం తను పెందరాళే ఇంటికి వస్తానని, ఆమెను తీసుకొని బజారుకి వెళ్ళి పట్టుచీర కొంటానని చెప్పి వెళ్ళాడు.

సుశీల కందుకనే ఆవేళ చాల ఆనందంగా వుంది!

ఆమె కందుకనే కళ్ళకు కనిపించేదల్లా ఆనందంగా వుంది!

ఇంకా భర్త ఇంటికి రావటానికి రెండు గంటలుండనగానే ముస్తాబయి కూర్చుంది!

ఆమె ఎదురు చూసిన క్షణం కాస్త ముందే వచ్చింది. వీధి తలుపులు భళ్ళున తెరచుకున్నాయి. చెప్పిన దానికన్న ముందే వచ్చాడు సుధాకర్. కాని, వచ్చినవాడు ఆశించిన ఉత్సాహంతో రాలేదు. కొంత నిరుత్సాహంతో పాటు తన కొలీగ్ శంకరాన్ని కూడ వెంటబెట్టుకొని వచ్చాడు!

"ఏమిటండీ? ఏమిటలా వున్నారు?" అంది సుశీల కంగారుపడుతూ.

"శంకరంగారి శేషుకి ఆక్సిడెంటయిందిట."

అప్పుడుకాని శంకరం వైపు పరీక్షగా చూడలేదు సుశీల. అతను దాదాపు స్పృహ తప్పి క్రింద పడిపోయేలా వున్నాడు. "అయ్యో పాపం! ఎలా జరిగిందండీ?" అంది మంచినీళ్ళు తెచ్చిస్తూ.

సుధాకర్ జరిగింది చెప్పాడు... పిల్లాడు ప్రొద్దున్న స్కూలుకి వెడుతున్నాడుట. కారేదో స్పీడుగా వస్తోంది. అది చూసుకోకుండా రోడ్డు దాటాడు. పెద్ద ప్రమాదం జరిగిపోయింది. దగ్గర్లోవున్న అప్పారావుగారి హాస్పిటల్లో చేర్చారు:

"పిల్లాడిప్పుడెల్లా వున్నాడు?" అని ఆత్రుతగా అడిగింది సుశీల.

"ఎడంకాలికి, ఎడం చేతికి ఆపరేషను చేసి ప్లాస్టర్లు వేసారు. ఇందాకనే స్పృహ వచ్చింది. చెప్పాలంటే పిల్లాడు చచ్చి బ్రతికినట్టు లెక్క" అన్నాడు సుధాకర్.

"బాధపడకండి అన్నయ్యగారూ! జీవితంలో ఇలాంటి ఒడిదుడుకు లెపోటి వస్తూ వుంటాయి. ఇలాంటప్పుడే మనం కాస్త ధైర్యంగా వుండాలి" అంది సుశీల.

శంకరం తలదించుకొని కూర్చుండిపోయాడు.

"నడవండి. మనం ఒకసారి హాస్పిటలుకి వెళ్ళివద్దాం" అంది సుశీల.

భార్య వైపు చిత్రంగా చూసాడు సుధాకర్. పట్టుచీర కొనుక్కోటానికి బజారుకి వెళ్ళాల్సిన ప్రోగ్రాము తమది! తనా సంగతి ఇట్టే మర్చిపోయిందా? ఆ మాట అనాలనే పైకి అన్నాడు సుధాకర్.

కష్టంలో శంకరం ఎదురుగా వుండగా భర్త ఇలాంటి ప్రశ్న వేస్తాడేమిట? సుశీల ఇబ్బందిగా ముఖం పెట్టింది. "దాని కిప్పుడు తొందరే మొచ్చింది? మరోరోజున వెళ్ళచ్చులెండి" అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

పది నిమిషాల్లో కాఫీ పెట్టి తెచ్చింది. అంతసేపూ వాళ్ళిద్దరిమధ్యా మాటలు లేవు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండిపోయారు.

"కాఫీ తీసుకోండి. చల్లారిపోతోంది" అంది సుశీల.

శంకరం కాఫీ కప్పు అందుకున్నాడు.

"ప్రవేటు హాస్పిటలు. అంతా డబ్బుతో పని. ముందు ఆపరేషను చేసినందుకు వెయ్యి రూపాయలు పట్టుకురమ్మన్నాడు డాక్టరు. ఇంకా అక్కడ ఒక వారం ఉంచాలిట. ఎలా లేదన్నా ఇంకా ఐదారు వందలవుతుంది!" అన్నాడు సుధాకర్.

"మన అవసరం. ఏం చేస్తాం! ఏది ఏమయినా, పిల్లవాడు మనకు దక్కాడు. అదే ముఖ్యం" అంది సుశీల.


కొన్ని క్షణాలు ఆ గదిలో మౌనం నృత్యం చేసింది.

"కూర్చున్నారేమిటి? నడవండి హాస్పటలుకి వెడదాం!" అంది సుశీల.

"ముందు మనం వాళ్ళకి చేయవల్సిన సాయం మరొకటుంది."

"ఏమిటి?"

"శంకరం దగ్గర బొత్తిగా డబ్బేమీ లేదుట!"



మంచిని పెంచి చూడు

"అదేమిటి?..." అని అర్థోక్తిలో ఆగిపోయింది సుశీల. సుధాకర్‌కి అర్రియర్స్ డబ్బు వచ్చినట్టే శంకరానికీ వచ్చింది. ఇంకా నిజం చెప్పాలంటే అతనికి మరో రెండు వందలు ఎక్కువే వచ్చాయి. ఆ డబ్బు వచ్చి రెండు రోజులు కాలేదు. అప్పుడే అంతా అయిపోయిందా? సుశీల మనస్సులోని ప్రశ్న అలా బయటకు వచ్చింది.

శంకరం సిగ్గుతో చిన్న చచ్చిపోయాడు. "సరోజ ఎన్నాళ్ళనుంచో అంటోందని నిన్ననే వెళ్ళి కుకింగ్ రేంజ్ కొన్నాను. ఏ బంగారమో అయితే తిరిగి అమ్మేసి డబ్బు తెచ్చుకోవచ్చు. ఇప్పుడేం చెయను? ఎవర్నడిగినా డబ్బు లేదంటున్నారు. అస్తమానం నా దగ్గర అప్పు తీసుకొనేవాడు గుర్నాథం. ఇవేళ నా అవసరం వచ్చినప్పుడు ఏమీ లేదని మొండి చెయ్యి చూపించాడు..."

"రెండు వందలో మూడు వందలో అంటే ఎవరో ఒకరు సర్దుతారు. మరి వేలమీద కావాలంటే ఎవరుమాత్రం తెచ్చివ్వగలరు?" అన్నాడు సుధాకర్.

శంకరం ముఖం కందగడ్డలా వుంది. "నువ్వన్నది నేను కాదనటం లేదు. నాకు వచ్చినట్టుగానే అందర్కీ డబ్బు వచ్చింది. ఎవరు ఖర్చులు వాళ్ళవి."

కొంతసేపాగి "మనం ఎంత డబ్బు యివ్వగలం!" అన్నాడు సుధాకర్ భార్యతో.

సుశీల ముఖం ఇబ్బందిగా పెట్టింది. అతనడిగితే భర్త తను చేయగల్గిందేదో చేయాలి కాని, అతని యెదురుగా తన నడగటమేమిటి అని బిడియపడింది.

"నేను ప్రతీదీ ఒక ప్లాను ప్రకారం చేస్తాను. అలా చేస్తే కాని నాకు సంతోషంగా, సంతృప్తిగా ఉండదు. మా రాధ పేర్న, ప్రసాద్ పేర్న వెయ్యేసి రూపాయిలు ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేద్దామనుకున్నాను. బ్యాంకులో ఈవేళ వేదామనే కూడా డబ్బు తెచ్చాను. కాని మీ పిల్లాడికి అక్సిడెంట్ అయిందని తెల్సి ఆగిపోయాను. నువ్వడక్కముందే నీ కవసరం రావచ్చేమోనని రేపటిదాకా నా పనిని వాయిదా వేశాను. ఈవేళ మా ఆవిడకి చీర కొనాలనుకున్న సంగతి నువ్వు విన్నావు. ఆవిడ దానికి వాయిదా వేయటానికి సిద్ధపడుతోంది..."

"నా కంత డబ్బు అక్కర్లేదు. పదహారు వందలు చాలు. మీ ఆవిడ ఇవేళే చీర కొనుక్కోవచ్చు" అన్నాడు శంకరం తడబడుతూ.

"ఇందులో ఏది ముఖ్యం అన్నది ఎవ్వరూ చెప్పలేరు. నాకు ముఖ్యమైనది నీకు ముఖ్యం కాకపోవచ్చు. నీకు ముఖ్యమయినది నాకు కాకపోవచ్చు. ఎవడి ఆలోచన వాడిది. ఎవడి అవసరాలు వాడివి."

శంకరం మాట్లాడలేదు.

"బహుశ నా మాటలు నిష్కర్షగా వుండచ్చు నీకు."

శంకరం బలవంతంగా నవ్వాడు. "అబ్బే. నువ్వన్నదానిలో తప్పేముంది!"

"నీకు పదహారు వందలూ ఇవ్వటానికి నా కభ్యంతరం లేదు. కాని, ఏ ప్రయోజనం లేకుండా ఇలా డబ్బివ్వడం నా కిష్టం లేదు."

"నేను కాదనను సుధాకర్! నెలకి నాల్గు వందలు చొప్పున నాల్గు ఇన్‌స్టాల్‌మెంట్సులో తిరిగి ఇచ్చేస్తాను. బ్యాంకు యింట్రస్టు కూడా యిస్తాను."

"అది నాకు చాలదు. నెలకి ఐదు వందల చొప్పున నాల్గు నెలలపాటు యివ్వాలి!" సుధాకర్ గొంతులోని గాంభీర్యానికి సుశీల చకితురాలైంది.

భర్త యిలా అంటాడేమిటని ఆమె వెలతెల బోయింది.

శంకరం తెరిచిన నోరు తెరిచినట్టే ఉండిపోయింది.

"నీ అవసరం చూసి అలా అడుగుతున్నానని నీకనిపిస్తే అనిపించివుండచ్చు. కాని, నా నిర్ణయం మాత్రం యిది. మనసులోని మాట చెప్పాను. అంత్యనిష్ఠూరంకన్న ఆది నిష్ఠూరం మేలు!"

ఇంక సుశీల భరించలేకపోయింది. "వేళాకోళాని కదండీ సమయం" అంది కాస్త వాతావరణాన్ని తేలిక పరుద్దామని.

"ఇది వేళాకోళం కాదు సుశీ! నిజం!"

"సరే సుధాకర్! ఏ ప్రయోజనం లేకుండా నిన్నిబ్బంది పడమనటం నాకూ భావ్యం కాదు. నువ్వన్నట్టే కానీ! అత్యవసర పరిస్థితిలో ఆదుకుంటున్నావు. నాకదే చాలు! నీ మేలు ఎప్పటికీ మర్చిపోను" అన్నాడు శంకరం.

* * * * * * *

నాలుగు నెలలు గడిచిపోయాయి.

"ఇదిగో ఆఖరి యిన్‌స్టాల్‌మెంటు..." అంటూ ఐదొందలు సుధాకర్ చేతిలో పెట్టాడు శంకరం.

"అన్నమాట నిలబెట్టుకున్నావు" అన్నాడు సుధాకర్ చిరునవ్వుతో.

శంకరం ముఖం గంటు పెట్టుకున్నాడు. "నా దగ్గర మాటంటే మాటే!"

"సరే, సాయంత్రం నేనూ, మా ఆవిడా మీ యింటికోసారి వద్దామనుకుంటున్నాం!"

"అంతా యిచ్చేసానుగా!" అన్నాడు శంకరం నొసలు చిట్లించుకొని.

"డబ్బు బాకీ తీరిపోయిందికదా - ఇంకా నువ్వు మా యింటికి రావటం ఎందుకు" అన్నట్టుంది అతని స్వరం!

అదేం పట్టనట్టు "నీతో మరో ముఖ్యమయిన సంగతి మాట్లాడాలి" అని చెప్పి యింటికి వచ్చేసాడు సుధాకర్.

గుమ్మంలోనే వాడిన ముఖంతో ఎదురయింది సుశీల. "మీరు అందర్కీ మేలు జరగాలని ఆలోచిస్తారు. కాని, అవసరం వచ్చినప్పుడు దేవుళ్ళలా కనిపించిన వాళ్ళమే-ఇప్పుడు వాళ్ళ పాలిట డబ్బు లాక్కునే పిశాచాల్లా కనిపిస్తున్నాము...."

"ఏమయింది? ఎవరి సంగతి?"

"సరోజ వచ్చింది. ఇన్నాళ్ళు మొగుడు తనకు చెప్పలేదట! నాల్గు నెలలకి నాల్గు వందలు వడ్డీ పడికాముట! నీ జరీ పట్టు చీరకి అది సరిపోతుందా -ఇంకా ఏమయినా పైనపడితే చెప్పు తెచ్చిస్తా -అంటూ నా నా మాటలూ అని వెళ్ళింది" సుశీల కళ్ళు నీళ్ళు నింపుకున్నాయి.

"బాధపడకు. పద్దవాళ్ళు ఎప్పుడూ చెడ్డవాళ్ళు కారు. నిజానిజాలు తెలియక ఆవిడేదో అంది. ఇప్పుడు చెపుదాము పద! నిన్ను తీసుకొని వస్తానని శంకరంతో చెప్పే వచ్చాను" అన్నాడు భార్య భుజంమీద వాత్సల్యంగా చేయి వేసి నొక్కుతూ.

మరో పావు గంటలో తయారయి వచ్చింది సుశీల. ఎల్లుల్ని కూడ హడావిడిగా ముస్తాబు చేసింది. ఒక

వ్యక్తిగతం

ఆదర్శమా? అధికార స్థానమా?

పార్టీ రహిత ప్రజాస్వామ్యాన్ని ప్రబోధించిన ఎం. ఎన్. రాయ్ ఆలోచనలను అనుసరించే వాళ్ళు



ఏదయినా ఒక రాజకీయ పార్టీలో, అందులోనూ బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉండవచ్చునా? స్వయంగా రాయిస్టు అయిన కర్నాటక జనతా పార్టీ నాయకుడు ఎస్ ఆర్ బొమ్మై బహిరంగంగా ఈ ప్రశ్న వేశారు ఎం ఎన్. రాయ్ శత జయంతి ఉత్సవ సభలో ప్రసంగిస్తూ అయన తనకుతానే ఈ ప్రశ్న వేసుకున్నారు కానీ కర్ణాటకలో జనతాపార్టీ సాధించిన విజయాల్ని ప్రస్తావించి అయన తనను తాను ఊరడించుకున్నారు అదే క్రమంలో అయన జనతాపార్టీని కొందరు రాజకీయ అదివతులు నడుపుతున్నారని కూడా అన్నారట

అర్ధ శతాబ్దానికి పండిన పాపం!

అర్ధశతాబ్దం పాటు అనేక మందిని మోసగించి తిరుగు లేకుండా రాజ్యం



నడిపిన మేటి మోసగాడు నట్వర్ లాల్ చిట్ట చివరికి పోలీసుల చేజిక్కాడు నట్వర్‌లాల్ అసలు పేరు మిథిలేష్ కుమార్ శ్రీవాస్తవ బీహార్‌లో 1914 లో జన్మించిన శ్రీవాస్తవ అప్పటికి ఎందరిని మోసగించాడో లెక్కేలేదు కనీసం 20 మారు పేర్లతో సంచరించాడని ఒక అంచనా మొత్తం మీద 13 సార్లు బెయిల్ తీసుకుని పోలీసులకు దొరక కుండా తప్పించుకు తిరిగాడు తన వృత్తిలో శారీరక శ్రమ ఎన్నడూ చేయలేదని, తనది అంతా మేధో శ్రమ అని ఆయన అన్నాడు ధనికుల దగ్గర కొన్ని వేలో, లక్షలో వదిలించి వాటిని పేదలకు అందజేయడమే తాను చేసిన పని అని అన్నాడు. వారణాసిలో 78 చేతి గడియారాలను ఒక దుకాణంలో, 80 చేతి గడియారాలను మరో దుకాణంలో తప్పుడు డ్రాఫ్టు లిచ్చి కొనడానికి ప్రయత్నించినప్పుడు నట్వర్ లాల్ దొరికి పోయాడు

పేరు తనది, నష్టం స్టాక్‌బ్రోకర్లది!

అమెరికా ఆర్థిక వ్యవస్థలో ఈ మధ్య చెలరేగిన సంక్షోభం ఇంగ్లండ్‌లో ఒక



విచిత్రమైన సమస్యను ముందుకు తెచ్చింది. 16 సంవత్సరాల పాఠశాల విద్యార్థి క్రిస్టఫర్ పీచ్ ఈ సంక్షోభం ఫలితంగా ఇరవై వేల పౌండ్లు నష్టపోయాడు. వాణిజ్య శాస్త్రం పాఠాలను జాగ్రత్తగా విన్న క్రిస్టఫర్ పీచ్ స్టాక్ మార్కెట్లో వ్యవహారాలు నడపడం ప్రారంభించాడు ఇప్పుడీ నష్టానికి గాను క్రిస్టఫర్ పీచ్ పైన విచారణ జరిపించడానికి స్టాక్‌బ్రోకర్లు ప్రయత్నించగా 18 ఏళ్ళ లోపు పిల్లలు అసలు షేర్ల వ్యాపారం చేయగూడదనే చట్టం వారికడ్డు తగిలింది తన పేరు మీద 20 వేల పౌండ్లు నష్టం వచ్చినా విచారణ కూడా లేకుండా తప్పించుకో గలిగాడు క్రిస్టఫర్ పీచ్!

వి. పి. సింగ్‌కు పన్నెండు ప్రశ్నలు!



మాజీ బి.జె.పి. నాయకుడు రామ్ జత్మలానీ ప్రధాని రాజీవ్ గాంధీని ప్రశ్నల వరదలో ముంచెత్తగా, ప్రస్తుత బి జె పి నాయకుడు కల్యాణ్‌సింగ్ మాజీ ఆర్థికమంత్రి వి పి సింగ్ పైన ప్రశ్నలు కురిపిస్తున్నారు కల్యాణ్‌సింగ్ మొదటి విడతగా వి పి సింగ్‌ను 12 ప్రశ్నలు అడిగారు వాటిలో కొన్ని – ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రిగా తన కాలంలో బూటకపు ఎన్‌కౌంటర్లలో వేలాది మంది అమాయకులను అర్థరహితంగా హత్య చేయడం గురించి వి పి సింగ్ ఏమంటారు? ఆర్థిక మంత్రి హోదాలో తాను పెట్టుబడిదార్లకు అనుకూలమైన, పేదలకు వ్యతిరేకమయిన విధానాలు చేపట్టానని వి పి సింగ్ ఒప్పుకుంటారా? అవినీతికి జీవధార అయిన కాంగ్రెస్ పార్టీని పల్లెత్తు మాట అనకుండా కేవలం రాజీవ్‌గాంధీ మీదనే ఎందుకు విరుచుకు పడుతున్నారు? వగైరాలు

సునీల్‌దత్‌కు ద్వంద్వ ప్రమాణాలు లేవా?


సునీల్‌దత్ కొడుకు పెళ్ళికి ఎంత ఖర్చవుతుంది? ఎంతయితే మనకేమిటి అని ఎవరైనా అనుకోవచ్చుగాని ఆ పెళ్ళి న్యూయార్క్‌లో జరిగింది గనుక మన విదేశీ మారక ద్రవ్య నిలువల నుంచి పెద్ద మొత్తంలో తరలించవలసి వచ్చింది గనుక ఇది ముఖ్యమైన వార్త అయింది సాధారణంగా ద్వంద్వ ప్రమాణాలు లేని వాడుగా నిరాడంబరతని కీర్తించే వాడుగా అందరికీ తెలిసిన సినీ నటుడు, పార్లమెంటు సభ్యుడు అయిన సునీల్‌దత్ ఈ పెళ్ళికి 40 వేల డాలర్లు విదేశీ మారక ద్రవ్యం ఇమ్మని అడిగారు ఇంత మొత్తం అనుమతించడం సాధ్యం కాదని సంబంధిత శాఖలు చెప్పగా, ఆయన రాజీవ్ గాంధీనే



స్వయంగా ఈ వ్యవహారంలోకి దించి తానడిగిన దానిలో సగం సాధించు కున్నారు. □

ధర్మపథం

గోమాత విలువ



భగవంతుడు సర్వ వ్యాపి. స్థావర జంగమాలలో కూడ దైవ శక్తి ఉన్నదని విజ్ఞుల అభిప్రాయం. అందువల్ల మన వారు దేవాలయాలను కట్టి విగ్రహ ప్రతిష్ఠ చేసి దైవారాధన జరుపుతున్నట్లే స్థావరాలనూ, మానవేతర జీవాలనూ పూజించడం సంప్రదాయం. శ్రీ కృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని పూజించినట్లు మనకు తెలుసును. వృక్షాలలో అశ్వత్థ వృక్షాన్ని పూజించడం, పశువులలో గోవును పూజించడం ప్రసిద్ధం.

వాస్తవానికి గోమాత దైవ స్వరూపం. భూమి వలెనే ఎంతో శాంతమైనది. కొట్టి బాధించినా పాలు ఇవ్వడం మానదు. ఉదయాన్నే గోదర్శనం మిక్కిలి శుభప్రదమైనది. అందువల్ల పెద్దలు గోసంరక్షణ చేస్తూ, ఉదయాన్నే గోవును చూచి తృప్తి పడుతూ ఉంటాయి. భగవత్ స్వరూపులైన కంచి కామకోటి పీఠాధిపతులైన పరమాచార్యాది స్వాములు తమ దేవతారాధనా నంతరం విధిగా గోపూజను చేస్తూ ఉంటారు. పశువులలో గోవంత అమాయక మైనదీ పూజ్యమైనదీ మరి యొకటి లేదు. గోవు సార రహితమైన గడ్డిని తిని సారవంతమూ, ఆరోగ్య కరమూ అయిన క్షీరాన్ని మనకు ఇస్తున్నది. ఆవు పాలు మాత్రమే కాదు. గోమయం కూడా మన కెంతో ఉపయోగ మైనది. దాని మూలంగా తయారైన భస్మం పరమ పవిత్రమై, ఆస్తికుల లలాటానికి అలంకారమై ఉన్నది. గోమాత విలువను గ్రహించిన వారెవ్వరూ దానిని హింసించరు.

కొందరు గోవధను చెయ్యడం కాన వస్తున్నది. దానికి తీవ్రమైన మతాభినివేశమే కారణమని ఊహించ వచ్చును. ఒక మతం వారు గోవును దేవతగా పూజించడం వల్ల ఆ మతాన్ని విరోధించిన వారు గోవును చంపుట జరుగుతూ ఉండ వచ్చును. మత విద్వేషం చాలా చెడ్డది. పూర్వం కళింగ దేశం బౌద్ధుల పవిత్ర స్థలం. అనేక విహారాలూ, స్తూపాలూ అక్కడ ఉండినవి. ఆ కారణం వల్ల బౌద్ధ మతాన్ని ద్వేషించిన వైదిక మతస్థులు, కళింగ దేశం అపవిత్ర మైనదనీ, ఆ దేశంలో నివసించ కూడదనీ, ఆ దేశానికి వెళ్ళినా కూడా పాపం సంభవిస్తుందనీ భావించేవారు. దీనిని గోహత్యకు దృష్టాంతంగా తీసుకో వచ్చును.

పవిత్రమైన గోమాత విలువను గ్రహించి, దానిని బాధించక అభిమానంతో చూడడం అందరికీ ధర్మం.

– బులుసు వేంకట రమణయ్య

మంచిని పెంచి చూడు

చెప్పి మీ ఆవిడచేత కాగితాలమీద సంతకాలు పెట్టించి తీసుకువెళ్ళాను. నీకు చెప్పటం మర్చిపోయిందేమో!" అన్నాడు సుధాకర్ సరోజ వైపు చూసి నవ్వుతూ.

"అవును. అప్పుడు పిల్లాడికలా వుంటే నాకు మతి మతిలో లేదు. మీరేదో అడిగారు. నేను సంతకం పెట్టాను. ఆ తర్వాత నా కా సంగతి గుర్తే లేదు. నిజంగా మీరు మాకింత ఉపకారం చేస్తూ కూడ నా నోటమ్మట యింత పాడు మాటలు వచ్చేవరకూ వూరుకున్నా రెందుకని! ఈ సంగతి ఆనాడే ఎందుకు చెప్పలేదు?" అంది సరోజ ఎంతో నొచ్చుకుంటూ.

"కొంత పొదుపుచేస్తేకాని అది మీ కిచ్చే బలం మీకు తెలియదు. ఆవేళ మీ పిల్లలపేర్న వేసిన వెంటనే చెప్పాననుకో - ఒక నెల ఎలాగో జరిగింది. ప్రతి నెలా జరిపించగలమా అని మీరు మానేసే ప్రమాదం వుంది. మాట కోసమనో - అప్పు తీర్చాలన్న బాధతోనో మొత్తానికి ఈ నాల్గు నెలలనుంచీ మీకది ఒక అలవాటయింది. కష్టపడి యిలా చేయగలిగిన వాళ్ళు - సంతోషంగా ఎందుకు చెయలేరు? ఏన్నొక మంచి అలవాటుగా ఎందుకు మార్చుకోలేరు? మార్చుకోగలరని నమ్మకం కల్గిన తర్వాతనే మీ కీ సంగతి చెప్పాను" అన్నాడు సుధాకర్ నిండుగా నవ్వుతూ.

"అంటే, ఆ నమ్మకం కలక్కపోతే మరికొన్నాళ్ళు మాచేత తిట్లు తినటానికి సిద్ధపడేవాడివన్నమాట!" అన్నాడు శంకరం నవ్వుతూ.

"అవును. ఒక మంచిని సాధించగలనన్న నమ్మకం కలిగినప్పుడు ఈ తిట్లు లెక్కలోకి రావు. అసలు పొదుపు చేసుకొనే వాళ్ళంతా పిసినిగొట్టువాళ్ళని కొందరనుకుంటుంటారు. కాని, కొందరలా జాగ్రత్త పడేవాళ్ళు ఉండబట్టేకదా మరికొందర్కి అప్పు దొరుకుతోంది. అంతా ఖర్చు పెట్టేవాళ్ళే వుంటే బ్యాంకుల్లో డబ్బంటూ ఎక్కడుంటుంది? ఇవేళ చేతిలో పది వుంటే పదీ అయిపోతుంది. వంద వుంటే వందా అయిపోతుంది. ఎంతో కొంత ఆదా చేస్తే అత్యవసరంలో అదే మనల్ని ఆదుకుంటుంది. ఇదిగో నేను మొదలు పెట్టిన పనిని మీరు కంటిన్యూ చేస్తే మీ పిల్లల భవిష్యత్తు గురించి మీరు వర్రీ కావల్సిన అవసరం వుండదు. పసరానికి తిన్నది పుష్టి. మనిషికి ఉన్నది పుష్టి - అని పెద్దవాళ్ళు వూరకనే అనలేదు. ఇందుకనే!" అన్నాడు సుధాకర్.

"నువ్వేన్ని చెప్పు. నీ క్రెడిట్ నీది కాదు. మీ ఆవిడది! భార్య సహకారం లేకుండా భర్త యేమీ చేయలేడు!" అన్నాడు శంకరం సరోజ వైపు కొంటిగా చూసి నవ్వుతూ.

"మీరలా అన్నందుకు నేనేం ఉడుక్కోనులెండి..." అంటూ సుశీల దగ్గరికి వచ్చి ఆమె చేతులు పట్టుకుంది సరోజ. "అన్నయ్యగారు మాకు మంచి చేస్తున్నారని తెల్సుకోకుండా నిన్ననరాని మాటలన్నాను. నన్ను క్షమించు సుశీలా!"

"అయ్యో! అంత మాటెందుకు సరోజా! మీకు మంచి జరిగితే మాకు మంచి జరిగినట్టుకాదూ!" అంది సుశీల నిండు మనస్సుతో. □

సినిమా!



''కాళరాత్రి''లో జయరేఖ

కృష్ణ, కె. ఎస్. ఆర్. దాస్‌లతో "ఖైదీ కృష్ణయ్య"

"త్వరలో నే షూటింగ్," అన్నారు కె. ఎస్. ఆర్. దాస్. ఈయన దర్శకత్వంలో ఆర్. వి. గురుపాదం నిర్మించే జి. ఆర్. పి. ఆర్ట్స్ వారి పై చిత్రానికి పరుచూరి



"పెళ్ళి కొడుకు లొస్తున్నారు"లో కల్యాణచక్రవర్తి

సోదరులు రచయితలు. చక్రవర్తి సంగీత దర్శకుడు.

శోభన్, మురళీమోహనరావులతో రాశీ మూవీ క్రియేషన్స్ చిత్రం

"డిసెంబర్ 5న పాటల రికార్డింగ్‌తో ప్రారంభ

సినీ షాలు

_జి.వి.జి.

భోత్సవం జరిపాం. డిసెంబర్ 27 నుంచి షూటింగ్," అన్నారు రాశీ మూవీ క్రియేషన్స్ అధినేత ఎం. నరసింహారావు. ఈయన "మహారాజా, పున్నమి చంద్రుడు" అనంతరం నిర్మిస్తున్న తాజా చిత్రంలో శోభన్‌బాబు, సుహాసిని, గౌతమి, సత్యనారాయణ,




"ఆణిముత్యం"లో రాధిక

నూతన్‌ప్రసాద్, వీరభద్రరావు ప్రభృత నటవర్గం. బాలమురుగన్ కథకు సత్యానంద్ సంభాషణలకర్త. చక్రవర్తి సంగీతం, కె. ఎస్. హరి ఛాయ, తార నృత్యాలు, నరసింహారావు కూర్పుతో కె. మురళీ మోహనరావు స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్నారు. (71 వ పేజీ చూడండి).





"బజారు రౌడీ"లో రమేష్‌బాబు

RICH,TRU



STATUTORY WARNING:
CIGARETTE SMOKING IS INJURIOUS TO HEALTH





E & BLUE
It's rich: the blend of choice Virginia tobaccos.
It's true: the taste, the smoke, the satisfaction.
It's blue: unmistakably so.
It's Berkeley Filter: rich, true and blue.
BERKELEY
FILTER
STATUTORY WARNING
CIGARETTE SMOKING IS INJURIOUS TO HEALTH
BERKELEY
FILTER
Rich tobacco, true taste.
LINTAS (CAL)/BFT/2740/1

షేర్ మార్కెట్‌లలో పెట్టుబడులు

–యన్. రామ్‌జీ, న్యూఢిల్లీ



షేర్ అంటే ఏమిటో తెలుసుకుందాము పార్ట్ ఓనర్ షిప్ ఆఫ్ ది కంపెనీ అంటే ఒక కంపెనీ భాగస్వామ్యంలో ఒక భాగానికి మీరు [illegible] అన్న మాట 53 కోట్ల రూపా[illegible] కలిగిన టిల్‌కో (బెంజ్ లారీలు తయారు చేసే సంస్థ) షేరును 100 రూపాయల ఖరీదు చేసిన మీరు స్టాక్ మార్కెట్‌లో రు 350 చొ న కనీసం షేర్‌లు కొని టాటాలతో భాగస్వామి కావచ్చు తెలిసి.

ఆస్తులు రెండు రకాలు స్థిర ఆస్తులు (ఇల్లు పొలాలు) చరాస్తులు (బంగారం, [illegible]టర్ మొ.)



శ్రీచంద్ హిందూజా

ఈ షేర్లు చరాస్తులుగా ప్రకటించబడినాయి. అంతేగాక ఇవి అన్నీ మార్పుకోటానికి వీలైనవి కూడా. [illegible] మాత్రం ప్రతిపాదిత కోటా షేర్[illegible] అమ్ముకూడదు [illegible] అంక్ష విధించబడినది [illegible] ప్రమోటర్స్ [illegible] ముంచా[illegible]


ఒక కంపెనీ [illegible] లు కల్గిన వ్యక్తి [illegible] లాభాలతో [illegible] సంబంధం కాని ఆ కంపెనీ యొక్క నష్టాలు అప్పులతో సంబంధం గాని [illegible] దీని మూలంగా పెట్టుబడి దార్లకి రక్షణ మాత్రమే కాక అవకతవక యాజమాన్యాల మోసాలకు గురి కాకుండా ప్రభుత్వ చట్టం కాపాడింది

షేర్‌లు కొన్న తరువాత ఆ సర్టిఫికేట్‌ను మనం అమ్మినవారు ఇచ్చిన ట్రాన్స్‌పర్ డీడ్‌ని పూర్తి చేసి మనం కొన్న ధర మీద ప్రతి వంద రూ లకు 50 పై చొ న లెక్క కట్టి వాటిని ట్రాన్స్‌ఫర్ డీడ్ వెనుక వైపున అంటించి కంపెనీ రిజిస్టర్ ఆఫీస్‌కు గాని లేక వారి చేత నియమించబడిన సంస్థకు రిజిస్టర్డ్ పోస్టు. తిరుగు రసీదుతో పంపితే నెల రోజులు నుంచి– 3 నెలల లోపు మన పేరున బదిలీ అయి వస్తుంది. ఈ ట్రాన్స్‌పర్ డీడ్‌లు అన్ని స్టాక్ ఎక్స్‌ఛేంజ్‌లలో [illegible] వారు ఫ్రీగా క్లయింట్‌లకు పంపుతూ వుంటాము అంతేకాక షేర్ స్టాంపులు కూడా ఈ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో అమ్ముతారు లేదా పోస్టాఫీసులు, ఇన్‌కంటాక్స్ ఆఫీసులలో కూడా [illegible] తారు. ఇవి మామూలు స్టాంపులు కావు

అబ్బా [illegible] ఫోన్ నన్ను ఏ పని చెయ్యనివ్వటం లేదండి చాలా చలిలో కూర్చొని మీ కోసం నేను వ్రాస్తూ వుంటే ఒకటే గోల 5 ని ల నుంచి. [illegible] బాబుగారు చెప్పండి. కొద్దిగా గట్టిగా చెప్పండి. ఆ... వినిపిస్తోంది ఈ



మనూ ఛబ్రియా



మార్కెట్ నుంచి లక్ష రూపాయలు తీసు కెళ్ళాలా ఎలాగా అని అడుగుతున్నారా? ఆ చెప్తాను వినండి అని నేను చెప్తుంటే నా ప్రక్కనున్న మా బి ఎస్ ఎన్ రెడ్డి గారు ఫోన్ తీసుకొని ఆ దానిదేముంది చాలా తేలిక మీరు మీ ఇష్టం వచ్చిన కంపెనీ షేర్లు రెండు లక్షలు పెట్టి కొనండి ఒక 6 నెలల్లో అవి తప్పకుండా 50% పడిపోతాయి వెంటనే అమ్మేసి లక్ష రూపాయలు తీసుకెళ్ళండి అని ఫోన్ పెట్టేశారు నేను వాస్తవంలోకి వచ్చేసరికి లైన్ కట్ అయ్యిపోయింది ట్రాన్స్‌ఫర్ డీడ్ ఎలా నింపాలి దాని తిరకాసులు ఏమిటో వచ్చే వారం తెలుసు కుందాము. □



"మా పిల్లలు స్కూలులో చాలా బాగున్నారు - షార్ప్ సహాయంతో!"

నాకు విసుగు పుట్టింది. బాలీబాలని నీళ్లతో కడిగే వంట పాత్రలు, ఇతర గిన్నెలు, నీళ్ల త్రాగే గ్లాసులు వగైరా అన్నిటిమీదా విసుగు పుట్టింది. అంతేకాదు, నా కార్యక్రమం సర్దుకోవడానికి పట్టే సమయానిక్కూడా.

అందువల్ల, నా పిల్లలతో గడిపే వ్యవధే నాకు లేకుండా పోయింది....


షార్ప్ 0.5 మినీ మోనోబ్లాక్ పంపు అంతా మార్చివేసింది. ఇప్పుడు రోజల్లా ధారాళంగా లభించే పంపు నీళ్లు, శుభ్రంగావున్న వంటయిల్లు నా పిల్లల చదువుకు సహాయపడే వ్యవధి నాకు దొరుకుతున్నాయి!

అన్నిటికంటే ముఖ్యం, నా షార్ప్ పంపులో శబ్దంరాదు. పొదుపైనది, తేలికైనదికూడా.

షార్ప్! నీకు ధన్యవాదాలు!

షార్ప్-మినీ మోనోబ్లాక్ పంపులలో అగ్రగాములు.

Sharp మోనోబ్లాక్ పంపులు



షార్ప్ ఇన్‌డస్ట్రీస్
కాలపట్టి, కోయంబత్తూర్-641 035
ఫోన్లు: 872796/33854
టెలిగ్రాములు: SHARPTOOLS

IS:996
ISI
MOTOR ONLY

షార్ప్-సర్వదా నవీన కల్పన-మీ సౌకర్యంకోసం.

JAISONS SI 1786

అమ్మకం బ్రాంచి: ఆర్.పి.రోడ్, సికింద్రాబాద్ — 500 003. ఫోన్: 75960.



రమేష్‌బాబు, కె. ఎస్. ఆర్. దాస్‌లతో 'సాహసయాత్ర'

"నవంబర్, డిసెంబర్, జనవరిలలో ప్రతి నెలా 1-15 తేదీల మధ్య కన్యాకుమారి, రాజస్థాన్‌లోని థార్ ఎడారిలో, అండమాన్ - నికోబార్ దీవుల్లో ఔట్‌డోర్ షూటింగ్" అన్నారు కె.ఎస్.ఆర్. దాస్. ఆయన దర్శకత్వంలో పి. వి. ఎస్. [illegible] సూర్యనారాయణరెడ్డి నిర్మించే కల్యాణి మూవీ ఆర్ట్స్ వారి పై సాహసయాత్ర చిత్రంలో రమేష్, రాధిక, రమ్యకృష్ణ, గౌతమి, కుయిలీ, కన్నడ ప్రభాకర్ ఆదిగా గల వారు నటిస్తున్నారు. సత్యమూర్తి కథ, సంభాషణలు రాశారు. వేటూరి పాటలు, వేటూరి, రాజ్-కోటి, లక్ష్మణ్‌గౌడ్, కె. మోహన్, కె. రంగారావు, కృష్ణ, బాల యోగానంద్ ప్రభృతుల సాంకేతిక వర్గంతో ముబ్బు చంద్రశేఖరరెడ్డి సమర్పణ.

పద్మావతి ఫిలిమ్స్ చిత్రంలో కోదండరామిరెడ్డి, రమేష్, నదియా

"మా రమేష్‌బాబు సరసన మలయాళ, తమిళ చిత్రాలలో ప్రముఖ నాయిక అయిన నదియాను తెలుగు తెరకు పరిచయం చేస్తున్నాం. నవంబర్ 11 నుంచి 20 వరకు మొదటి షెడ్యూల్ జరిగింది. డిసెంబర్ 11-30, జనవరి 11-20 షెడ్యూల్స్‌తో షూటింగ్ పూర్తయిపోతుంది. నదియా ద్విపాత్రలు నిర్వహిస్తుంది. సాహసిక్ నాయిక సోనియా ప్రత్యేక పాత్రలో కనిపిస్తుంది. అంతా గౌతమి, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, రంగనాథ్, కోట శ్రీనివాసరావు, వేలు, వీరభద్రరావు, అంతోని, [illegible] సుధాకర్, కృష్ణ తేజ, వినయ్, నిర్మల, మనిక ఇతర నటవర్గం" అన్నారు పద్మావతి ఫిలిమ్స్ అధినేత యు. సూర్యనారాయణబాబు. సత్యమూర్తి కథ, సంభాషణలు సమకూర్చారు. రాజ్-కోటి సంగీతం, ఎస్. సుధాకరరెడ్డి ఛాయ, కె. చలం శిల్పం, సాహుల్ పోరాటాలు, రాధారెడ్డి సంయుక్త దర్శకత్వం, మధు నవీనాల దర్శకత్వం, పూర్ణబాబు నిర్వహణలో ఎ. కోదండరామిరెడ్డి దర్శకుడు.

(60వ పేజీ చూడండి)

1వ వారం




2వ వారం



3వ వారం



4వ వారం




5వ వారం



చూడండి! కేవలం 6 వారాల్లో త్వరగా మీ ఛాయ మెరుగవుతుంది

6వ వారం



క్లియర్•టోన్

ద్వారా ఛాయ మెరుగయ్యే పథకం

మీ ముఖంపైన ఛాయ మరింత మెరుగ్గా మిలమిల మెరిసేలా, ప్రకృతి మీకిచ్చిన వరంలా.

క్లియర్•టోన్• ఛాయను మెరుగు పరిచే క్రీమ్. చేస్తుందిది నిజం.

క్లియర్•టోన్‌ని రోజుకి రెండుసార్లు మృదువుగా రాయండి. దానిలోని మృదుత్వాన్ని మీ చర్మంలో లోపలికి యింకుతూన్న అనుభవాన్ని పొందండి —మిగిలేదిక కేవలం అద్భుతమైన ఆ ఫ్రెంచి సుగంధం. క్లియర్•టోన్ యొక్క 4 విధాల చర్య యిక మొదలు.

అద్వితీయమైన తీరులో చర్మపు ఛాయని మెరుగు పరిచే పదార్థం (మరే క్రీములోనూ లేదు యిది), మీ చర్మం లోపలనుంచి ప్రకృతి సహజమైన ఆ మెరుగు మెరుపును పునరుజ్జీవితం చేస్తుంది.

సూర్యకిరణాలను వడగట్టగల ప్రత్యేకమైన పొర మీకు రోజంతా రక్షనిస్తుంది, సూర్యకిరణాల నుంచి నల్లబడకుండా.

సమృద్ధవంతమైన మాయిశ్చరైజర్ మీ చర్మాన్ని అలా కోమలంగా యవ్వనంలోని నేవళంగా వుండే ఆ లక్షణాన్ని తీసుకొస్తుంది.

వారాలు తిరిగే సరికల్లా చర్మంపైన మచ్చలలా మాసిపోతాయి. అలా చూస్తూచూస్తూ ఆరు వారాలు తిరిగేసరికల్లా క్లియర్•టోన్ తెచ్చే ఆ తేడాని మీరే చూస్తారిక-దేశమంతట్లోని వేలకి వేల స్త్రీలూ యిప్పటికే వాడి అనుభవంలోకి తెచ్చుకున్న ఆ అనుభవాన్ని.

క్లియర్•టోన్ తెచ్చే మెరుగైన ఛాయను మీరూ చేజిక్కించుకోవాలిక కదూ?



లండన్• ప్యారిస్•న్యూయార్క్

నచ్చిన సన్నివేశం

"ఆకాశంలో విహారానికొచ్చిన తారల్లారా ఇది తెలుసా మీకు? మురళి నన్ను పెళ్ళి చేసుకుంటున్నాడు

పువ్వు పువ్వునూ అల్లరిగా తాకే చిరుగాలి ఇది తెలుసా నీకు? మురళి నన్ను

అలా కళ్ళు మూసుకొని కలలు కంటూ ఎక్కితే జారిపడతారు మురళి హెచ్చరింపుతో కళ్ళు తెరిచి విచ్చిన జాజులు రాలిపడ్డట్టు నవ్వింది సౌందర్య ఇది సహజంగా చదివేవారి మనసులోకి జొరబడి అల్లరిచేసి, ఆనందం నింపే సన్నివేశం ఇంత వరకూ తమ కలంతో సీరియల్ మామూలుగా రాసుకుంటూ వస్తున్న రచయిత్రి సావిత్రిగారు కావాలని తమ కలానికి పంచదార అద్ది మరీ ఈ సన్నివేశం రాసుంటారన్న అనుభూతి కలిగి తీరుతుంది దగాపడ్డ ఓ చెల్లికి ఈ సన్నివేశంలో తగిన న్యాయం చేసిన రచయిత్రి అభినందనీయులు



– కె. అంజనేయకుమార్,
విజయవాడ

★ ★ ★

సౌందర్య, మురళీధరరావు లిద్దరూ కోవెలకు వెడతారు అక్కడ మురళీ సౌందర్యతో వివాహ ప్రసక్తి తీసుకురాగా సౌందర్య చెప్పలేక పోతున్నప్పుడు– "సౌందర్యా ఆ బ్లూ ఫిలిం వ్యవహారం గురించి బాధపడుతున్నారా?? నాకంతా



తెలుసు. నీ నిర్దోషిత్వం గురించి కూడ తెలుసని చెపుతూ మనం నిద్దర్లో ఎన్నో పీడ కలలు కంటూ ఉంటాం మెలకువ వచ్చాక ఆ పీడను మర్చిపోవటానికే ప్రయత్నిస్తాం అని ఈ సంఘటనను కూడ ఆ విధంగా గుర్తు చేయనక్కరలేదు మర్చిపోవచ్చునని చెబుతాడు ఆమె భయాన్ని అందోళనను పోగొడతాడు

ఈ సన్నివేశంలో రచయిత్రి మంచి ఆదర్శవంతుడైన పురుషుడిని చూపించారు అసలు అటువంటి నిర్ణయం తీసుకోవటానికి ఎస్ ఐ మురళీధరరావు ఒక ఆదర్శంగా యువకులకు కన్పింపచేశారు

– కొల్లేపల్లి రత్న, రాజమండ్రి

★ ★ ★

చాపిన అతని చేతి వేపు సంకోచంగా చూసిందామె

జాగ్రత్త! చెయ్యి అందుకునే ముందు సరిగ్గా ఆలోచించుకోండి



డి.ఎస్.పి. విజయ్


అతనిలో స్పందన నశించి తిరిగి తన సెట్‌లోకి ప్రవేసించటానికి చాలా సమయం పట్టింది విజయ్‌కి

అన్నాళ్ళూ నీడలా అతన్ని అంటిపెట్టుకునే ఉన్నాడు జగదీష్.

విజయ్ పోలీసాఫీసర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించి నప్పుడు జగదీష్ చేసిన హడావుడి ఇంతా అంతాకాదు

అతని గురించి ఎప్పుడు ఆలోచించినా విజయ్ మనసు కృతజ్ఞతతో ఒక అనిర్వచనీయమైన భావనతో నిండి పోతుంది

ఇన్ని సంవత్సరాల తరవాత తిరిగి ఈ పసివాడు నానీ తనలో అస్పందనా ఆర్ద్రతా రగిలిస్తున్నాడు?



వీడు వైజయంతి చేతులలో పెరిగిన వాడవటం ఇందుకు కారణం కావచ్చు

"ఒక వ్యక్తి మీద మనకు ఏర్పడ్డ నిలకడైన అభిప్రాయమే ఆ వ్యక్తికి సంబంధించిన సన్నిహితుల మీద కూడా తన ప్రభావాన్ని చూపిస్తుంది

తన నెచ్చెలి ప్రియ బాంధవి అయిన వైజయంతి సజీవంగా ఉండటం ఎంతటి సంభ్రమాన్ని కలిగిస్తోందో ఆమె చుట్టూ బిగుసుకుని ఉన్న దుర్భరమైన పరిస్థితులంత కన్నా ఎక్కువ వ్యధను కలిగిస్తున్నాయి

ఇన్నేళ్ళుగా ఆమె ఎలాగడిపిందో ఏ అనివార్య సంఘటనలామె జీవితంలోకి బలవంతంగా ప్రవేసించాయో ఇవన్నీ తన కవసరంలేదు నానీతో సహా తిరిగి ఆమె తన ఇంటికే వచ్చేస్తుంది

తన నిరీక్షణంతా రాబోయే ఆ శుభ గడియల కోసమే ఆమెను వాళ్ళ మధ్య వదిలేసి ఆమె బ్రతికుందనే సంతోషాన్ని అర్తిగా ఆమెతో పంచుకోటానికయినా లేకుండా చేతకాని వాడిలా ఇలా చేతులు ముడుచుకు కూర్చోటం ఎంత దుర్భరంగా నరక సదృశంగా ఉందో దీన్ని భరించటానికెంత శక్తిని కూడదీసుకోవలిసొస్తోందో తన కొక్కడికే తెలుసు

కొన్నాళ్ళ పాటు ఇదంతా తనకు తప్పదు

పరిస్థితులు తన వెంటపడకుండా తనే వాటిని తరుముతూ అవకాశం కోసం పొంచి ఉన్నాడు తను

తను తప్పక విజయం సాధించి తీరతాడు

నానీ నిద్దట్లో కదిలి విజయ్ పొట్ట మీద చెయ్యేశాడు

అంతలో కళ్ళు తెరిచి అంకుల్? నిద్రపోలేదూ?' అన్నాడాశ్చర్యంగా

"లేదమ్మా నిద్రరావటం లేదు అన్నాడు విజయ్

తలతిప్పి వాల్ క్లాక్ వేపు చూసి మైగాడ్! త్రీ థర్టీ! పడుకోండంకుల్ నిద్రలేక పోతే హెల్త్ పాడవుతుంది కళ్ళు మూసుకుని ప్రశాంతంగా పడుకుంటే చాలు .

వస్తుందేమో? మీరు వెంటనే మనం సేకరించిన మెటీరియల్ ప్రెస్ కిచ్చే ఏర్పాట్లు చూడండి. వీలు చూసుకుని నేను మిమ్మల్ని కలుస్తాను."

ఫోన్ పెట్టేసింది.

"భాగవతార్, అంటున్నావేమిటి? ఎవరు మాట్లాడింది?" కుతూహలంగా అడిగాడు సోమనాథ్.

"మృదుల. భాగవతార్ జయా నర్సింగ్ హోమ్‌లో ఉన్నాడట వంటి నిండా దెబ్బలతో."

మహావీర్ మాటలు వినగానే జయా నర్సింగ్ హోమ్‌కి బయల్దేరాడు సోమనాథ్.

* * * *

లాయర్ యశోధరాదేవి కోపంతో దహించుకు పోసాగింది. డాక్టర్ సౌగంధి అక్కడి విశేషాలన్నీ వివరంగా చెప్పింది.


"భార్య మిత్రురాలు, కుమార్తె దుఃఖ కారకురాలు, పుత్రుడు మాత్రమే పరలోకంలోని పరంజ్యోతి" అని ఐతరేయ బ్రాహ్మణంలోనూ అధర్వణ వేదంలోనూ పేర్కొన్నారని తెలుసుకున్నప్పుడు వేదకాలంలో సహితం స్త్రీ సంతానం పట్ల ఆ చిన్నచూపు భరించలేక బాధపడింది. చదువు సంస్కారం పెంపొందిన ఆధునిక సమాజంలో నైనా స్త్రీకి తగిన గౌరవం లభిస్తుందని ఆశ పడింది. చివరికి ఈ నాటికీ స్త్రీని గౌరవించడం నేర్చుకోకపోగా గర్భంలో వుండగానే స్త్రీ సంతానాన్ని మట్టు బెట్టడానికి పూనుకుంటున్నారా! ఏనాటికి మారుతుంద్ది సమాజం.

జరుగుతున్న దానికి ప్రతి క్రియగా యేం చెయ్యాలా? అని యశోధరాదేవి మధనపడుతూండగా, మహావీర్ దగ్గిర్నుంచి ఫోనొచ్చింది. మొదట అనుకున్నట్లుగా మృదుల సోమనాథ్ ప్రైవేట్ డిటెక్టివ్ ఏజన్సీస్ ఆఫీసుకి రాలేదని తెలిసినప్పుడు కలవరపడింది. దీనిలో రాజభూషణం జోక్యం వుండి వుంటుందని అనుమానించింది. వెంటనే హైదరాబాద్ "కరదీపిక" కార్యాలయానికి ఫోన్ చేసి అక్కడి సెక్రటరీతో జరిగింది క్లుప్తంగా చెప్పి, "మీ తక్షణ కర్తవ్యం మృదులని విడిపించడం మీరంతా రాజభూషణం ఇంటికి పెద్ద గుంపుగా వెళ్లండి. అప్పుడు మిమ్మల్నెవరూ ఏం చెయ్యలేరు. అంతేకాదు ప్రజలను ప్రభోదించే కొన్ని స్లోగన్స్ తయారు చేసి నినాదాలిచ్చుకుంటూ ప్రొసెషన్‌లో వెళ్లి జంటనగరాల్లో రాజభూషణం మందుల దుకాణాల్లో ఏ మందూ అమ్మనీయకుండా మూసే యించండి. ఇవాళ రాత్రి ఫ్లైట్‌లో బయల్దేరి నేను హైదరాబాద్ వొస్తున్నాను" అని చెప్పింది. కరదీపిక కార్యవర్గ సభ్యుల్లో టీచర్లు, డాక్టర్లు, లాయర్లు కంపెనీ సెక్రటరీలు, స్టెనోలు - ఇలా అన్నిరకాల వాళ్లూ వున్నారు. ఏక్టివ్ వర్కర్స్‌గా ఔత్సాహికులైన విద్యార్థినిలూ వున్నారు. క్షణాల్లో చాలా పెద్దసంఖ్యలో వాలంటీర్లను సమావేశపరిచారు. రెండు గుంపులుగా



చలిపోయారు. ఒక గుంపు వేన్‌లో రాజభూషణం యింటికి బయల్దేరింది మృదులని విడిపించడానికి, మరో గుంపు "అమానుష ప్రయోగాలు నశించాలి" "స్వంత లాభాల కోసం ప్రాణాలు తీయడానికి కూడా సిద్ధపడే వాళ్ళని శిక్షించాలి" అనే నినాదాలు చేసుకుంటూ వెళ్ళి రాజభూషణం మందుల షాపులు మూసేయాలని పట్టుబట్టాయి. షాపు యజమానులు అందుకొప్పుకో లేదు. రెచ్చిపోయిన విద్యార్థినిలు షాపు పైన పెట్రోలు గుమ్మరించి అగ్గిపుల్ల గీసేసారు.

వేన్‌లో రాజభూషణం యింటి ముందుకు చేరుకున్న గుంపుని ఘూర్ఖా అడ్డగించబోయాడు. విద్యార్థినిలు అతనినొక తోపు తోసి లోపలికి నెట్టుకు పోయారు. అంత మంది ఆడవాళ్ళని గుంపుగా చూసే సరికి రాజభూషణం గుండాలకు కూడా భయం వేసింది. అదే సంఘ బలం. రాజభూషణం ఇంట్లో వున్న సామానులన్నీ ఇష్టం వచ్చినట్లు చిందరవందర చేస్తూ మృదుల కోసం గాలించసాగేరు కరదీపిక సభ్యులు, వాలంటీర్లు. బయట గొళ్ళెం పెట్టి వున్న గది తలుపు చూసి గొళ్ళెం తీయబోతూండగా లోపల్నించి, "వొద్దు, వొద్దు, తెరవొద్దు" అని అరిచాడు నగ్నంగా మంచానికి కట్టి పడేసి వున్న రాజభూషణం. పాపం అతనికి లోపల్నించి తలుపు బోల్ట్ పెట్టుకునే అవకాశమేనా లేదు. లాయర్ యశోధరాదేవి మృదుల యే ఆపదలో చిక్కుకుంటుందోనన్న ఆరాటంలో ఫోన్ల



మీద చకచక పన్లు జరిపించ బట్టి ఎవరేనా వచ్చి రాజభూషణాన్ని విడిపించక ముందే స్త్రీ సమూహం విరుచుకు పడటం జరిగిపోయింది. ఆదిశక్తుల్లా విజృంభించిన స్త్రీలు రాజభూషణం అరుపులు లక్ష్యపెట్టకుండా గొళ్ళెం తీసేసారు. అటు రాజభూషణం, ఇటు స్త్రీలు ఒకేసారి కెవ్వనరిచారు. ఆడవాళ్ళు చేతులతో కళ్ళు మూసుకుని గది బయటి కొచ్చేస్తుంటే, రాజభూషణం తలని మంచం కోడుకేసి కొట్టుకున్నాడు. బయటి కొచ్చాక ఆడవాళ్ళంతా ఒకళ్ళ మొఖాలొ కళ్ళూ చూసుకుని పొట్టలు చేత్తో పట్టుకుని విరగబడి నవ్వుకున్నారు.

"మృదులని మనం రక్షించక్కర లేదు. తనని తనే రక్షించుకుంది. రాజభూషణానికి బ్రహ్మాండమైన శిక్ష వేసింది. ఎవరూహించలేని శిక్ష" అని మళ్ళీ నవ్వుకున్నారు. అవమానం భరించలేక వుడికిపోయాడు రాజభూషణం. గట్టిగా పిడికిలి బిగించి, "మృదులా! నిన్నొదుల్తా ననుకోకు. ఇంతకి పది రెట్లు నీకు షాతం చెప్తాను. ఈ సారి లాయర్ యశోధరాదేవి కాదు గదా ఆ దేవుడే దిగి వచ్చినా నిన్ను బయటపడేయ లేడు" అని శపథం చేసుకున్నాడు కసిగా.

ఆ రాత్రి 7.30 గ.లకు బొంబాయి నుంచి సికింద్రాబాద్ వచ్చే ఐ. సి 117 విమానంలో లాయర్ యశోధరాదేవి సికింద్రాబాద్ ఎయిర్ పోర్టులో దిగింది.

★ ★ ★ ★

భాగవతార్ బెడ్ పక్కన స్టూల్ మీద కూర్చుని అతని చేత బత్తాయి రసం తాగిస్తోంది మృదుల. సహజంగానే అతణ్ని అభిమానించే ఆ అమ్మాయిలో తన కోసం అతడన్ని దెబ్బలు తిన్నాడనే భావం ఎంతో సానుభూతిని కలిగిస్తోంది. భాగవతార్ కైతే స్వర్గంలో వున్నట్లుగానే వుంది. మృదుల ఇలా తన పక్కన కూర్చుని సపర్యలు చేస్తుంది అంటే ఇంకో ఇన్ని దెబ్బలు తినడానికైనా అతడు సిద్ధంగానే వున్నాడు. డ్యూటీ నర్స్ రూమ్‌లో కొచ్చి, "మేడమ్! మీకు ఫోనొచ్చింది" అంది మృదులతో మృదుల లేచి వెళ్ళి రిసీవరందుకుంది.

అటు వైపు నుంచి యశోధరాదేవి.

"మృదులా! ఎలా వున్నావు? ఏ అఘాయిత్యం జరగలేదు కదా!" ఆప్యాయత, అనురాగం ఉట్టిపడుతున్నాయి ఆమె గొంతులో

"బాగానే వున్నాను మేడమ్. మీరెప్పుడొచ్చారు? ఎక్కడున్నారు?"

"ఇప్పుడే ఫ్లైట్‌లో వచ్చాను. ఒకప్పటి నా జూనియర్ లాయర్ ఇప్పటి లీడింగ్ లాయర్ వైజయంతి ఇంట్లో వున్నాను. నీ కోసం అనేక చోట్ల ట్రై చేసి చివరికి మహావీర్‌కి ఫోన్ చేస్తే ఈ హాస్పిటల్‌లో వున్నట్లు తెలిసింది. ఎలా వుంది మీ ఆయనకి."

నవ్వింది మృదుల. "నన్ను కాపాడాలని వచ్చి, పాపం! తను దెబ్బలు తిన్నాడు. ఆదర్శపతిదేవుడు."

అటువైపు నుంచి యశోధరాదేవి కూడా నవ్వింది.

"ఈ ఆదర్శ పతిదేవులు ఏ క్షణంలో అర్థంలేని పతి దెయ్యాలుగా మారిపోతారో ఇప్పటికీ నా ఊహ కందడం లేదు. అది సరేగాని మీ పతిదేవుణ్ని ఒక గంట సేపు నర్సు కప్పగించి లాయర్ వైజయంతి ఇంటికి రాగలవా? దేవకి కేసుకి సంబంధించి కొన్ని విషయాలు మాట్లాడాలి" అంది.

"ఓ. కే. మేడెమ్. పది నిముషాల్లో బయలుదేరొస్తాను" ఫోన్ పెట్టేసింది.

"ఎవరి దగ్గిర్నుంచి ఫోను?" మృదుల వచ్చి కూర్చోగానే అడిగాడు భాగవతార్.

"లాయర్ యశోధరాదేవి దగ్గర్నుంచి."

భాగవతార్ ముఖంలో ప్రసన్నత ఎగిరిపోయింది. ఎంతైనా అతడు మగవాడు. స్త్రీ స్వతంత్ర వ్యక్తిత్వం కోసం నడుం కట్టి పోరాడే లాయర్ యశోధరాదేవి అంటే గౌరవమున్నా అభిమానం లేదు. పైగా మృదులని తన నుంచి దూరం చేస్తుందేమోనని భయం కూడా వుంది.

అతడి భయాలు నిజం చేస్తున్నట్టుగా, "లాయర్ యశోధరాదేవి గారు ఒక్కసారి నన్ను రమ్మన్నారు. వెళ్ళి ఇప్పుడే వచ్చేస్తాను. మీ దగ్గర నర్స్ వుంటుంది" అంది.

ఏడుపు మొహం పెట్టాడు భాగవతార్. అతడి గెడ్డం పట్టుకుని అటూ, ఇటూ వూగిస్తూ, "ఇప్పుడే వచ్చేస్తాగా ప్లీజ్!" అంది. ఏమనగలడు? ఏడుపు మొహంతో నే వెళ్ళమన్నట్లు తలూపాడు.

డ్యూటీ నర్స్‌కి, ఆయాకి భాగవతార్‌ని కనిపెట్టి చూస్తూండమని చెప్పి, తమ కారులో నే వైజయంతి ఇంటికి బయల్దేరింది. ఈ వ్యూహంలోంచి ఎలాగైనా దేవకిని బయటపడెయ్యాలని మృదులకీ వుంది. లాయర్ యశోధరాదేవి ప్రయత్నిస్తే ఎలాగైనా సాధించగలదేమో!

మృదుల వెళ్ళిన అరగంటకి సోమనాథ్ వచ్చాడు ఆసుపత్రికి. ఎంక్వయిరీలో భాగవతార్ వున్న రూమ్ నెంబరు అడిగి తెలుసుకుని అక్కడి కొచ్చి, 'హల్లో! భాగవతార్ గారూ! బాగున్నారా! దెబ్బలు బాగా తగిలినట్లున్నాయి. ఐ. యామ్ సారీ!' అన్నాడు.

సోమనాథ్‌ని చూడగానే గతుక్కుమన్నాడు భాగవతార్. తను మర్చి పోవాలనుకుంటున్న పీడకల యేదో తన కళ్ళ ముందు నిల్చినట్లోతోంది. తను అమెరికా వెళ్ళినప్పుడు తన గదిలో మృదుల పైన వీడియో రికార్డింగ్ చేయించిన విషయం మృదులకి తెలియనీయొద్దు – అని చెప్పాలనుకుని, "సోమనాథ్ గారూ! ఆ వీడియో...." అని ప్రారంభించాడు. సోమనాథ్ మధ్యలో నే అందుకుని, "ఆ వీడియోలో ఫిగర్స్ ఇప్పుడు క్లియర్‌గా కనిపించాయి. ఆ విషయం చెప్పడానికే

వచ్చాను" అన్నాడు.

పాలిపోయింది భాగవతార్ ముఖం. నీరసించిన గొంతుతో "ఎవరతను?" అన్నాడు.

"అతడెవరో తెలుసుకున్నాను. మీ అపార్ట్‌మెంట్సు పక్కనే వున్న బృందావన్ అపార్ట్‌మెంట్స్‌లో సి –4 లో వుంటున్న దయానంద చక్రవర్తి."

ఆ మాటలు వినగానే ఏదో షాక్ తగిలినట్టు మూతలు పడిపోయాయి భాగవతార్ కళ్ళు. సోమనాథ్ ఖంగారు పడిపోతూ, "భాగవతార్ గారూ! భాగవతార్ గారూ!" అని కుదిపాడు. కాని భాగవతార్ కళ్ళు తెరవలేదు. సోమనాథ్ వెళ్ళి నర్స్‌కి చెప్తే నర్స్ వెళ్ళి డాక్టర్‌ని పిలుచుకొచ్చింది.

"ముందుగానే ఆ కౌన్సెట్‌లో వున్న స్త్రీ మృదుల కాదని చెప్పవలసింది. మళ్ళీ పొరపాటు జరిగిపోయింది" అని నాలుక్కరుచుకొని భాగవతార్ కోలుకున్నాక మళ్ళీ వద్దామని వెళ్ళిపోయాడు సోమనాథ్.

* * * *

మృదుల తనకి తెలిసినంత వరకు జరిగిన సంగతులన్నీ లాయర్ యశోధరాదేవికి, లాయర్ వైజయంతికి వివరంగా చెప్పింది. ఇద్దరూ మృదుల సాహసాన్ని సమయస్ఫూర్తిని మెచ్చుకున్నారు.

"దేవకి నాకు బాగా తెలుసు. సహజంగా మంచి పిల్లే. కాని మన కుటుంబాల్లో చాలా మంది ఆడపిల్లలకు జరిగిన బ్రైన్ వాష్ లాంటిదే తనకీ జరిగింది. ఆడపిల్లకి పుట్టినప్పటి నుంచి బాగా డబ్బున్న భర్త లభించడమే జీవిత సాఫల్యమన్నట్టు ఇంట్లో వాళ్ళంతా భావిస్తారు. ఆ రకమైన ఆలోచనలే పెంపొందిస్తారు. మగపిల్లవాణ్ని పెంచినట్టు స్వతంత్ర వ్యక్తిత్వం రూపొందేలా సొంత సంపాదన కోసం కృషి చేసేలా – ఈ నాటికి ఆడపిల్లల్ని పెంచడం లేదు. దేవకి ఎంతగా మనతో కలసిమెలసి పని చేసినా డబ్బున్న మొగుణ్ని సంపాదించుకోవాలనే ఆశ మనసులో నాటుకుపోయి వుంటుంది. అయినా ఈ రోజుల్లో డబ్బు మీద ఆశ లేనిదెవరికి? అన్ని విలువలూ డబ్బుతో ముడి వేసుకుపోయాయి. సమాజమంతా డబ్బు వెంట అణకువతో అగ్గగ్గలాడుతూ పరుగులు తీస్తోంది.

వైజయంతి! దేవకిని ఎలాగైనా కాపాడగలమా?

"ప్రయత్నించాలి. హిందూ సమాజంలో అందరి ఆడపిల్ల లాగానే దేవకి కూడా ఫ్లెమింగ్‌ని ఏమాత్రం అర్థం చేసుకోకుండా పెళ్ళి చేసేసుకుంది. అటు ఫ్లెమింగ్, ఇటు రాజభూషణం బెదిరించి నిర్బంధించబట్టి ఏ విధంగానూ ప్రతిఘటించలేక ఈ విషవలయంలో చిక్కుకుందని వాదిస్తే ఏమైనా ప్రయోజనముంటుందేమో చూడాలి."

లాయర్ యశోధరాదేవి మృదుల నుద్దేశించి "మృదులా! రాజభూషణం సామాన్యుడు కాదు. అతడి వివరాలన్నీ తెలుసుకున్నాను. అతడితో శతృత్వం తెంచుకోవలసి వచ్చింది మనకి. నేనేం భయపడను. నువ్వు జాగర్తగా వుండు. చేతి నిండా డబ్బు, ప్రభుత్వంలో పలుకుబడి వున్న వాళ్ళేమైనా చేయగలరు" అంది.

మృదుల లేచి నిలబడి నమస్కారం చేసి, "థేంక్యూ మేడమ్! నా జాగర్తలో నేనుంటాను" అంది.

"అంత మాత్రం సరిపోదు. నీ ఆత్మీయులెవరితోనైనా నీకేదేనా జరిగిన మరుక్షణం నాకు తెలియబర్చమని చెప్పు ప్లీజ్!" మృదుల సుందుదుకు తనం తెలిసిన యశోధరాదేవి ప్రాధేయపడుతూన్నట్టుగా అంది.

నవ్వుతూ తలూపింది మృదుల. "ఇంతటి తల్లి ప్రేమ కార్యవర్గ సభ్యులందరి పైనా గుమ్మరించే ప్రేమ భాండం లాంటి మనసు ఈమెకు ఏ దేవుడిచ్చాడో" అనుకుంది.


మృదుల హాస్పిటల్ కొచ్చేసరికి రూమ్‌లో బెడ్ మీద భాగవతార్ లేడు. మొదట టాయిలెట్‌కి వెళ్ళాడేమో ననుకుంది. గంట గడిచినా రాక పోయేసరికి అనుమానం వేసింది. లేచి నిలబడింది నర్స్‌తో మాట్లాడడానికి. అప్పుడు కనిపించింది స్టీల్ షెల్ఫ్ మీద హార్లిక్స్ సీసా కింద వున్న వుత్తరం. విప్పింది.

"ప్రియాతి ప్రియమైన – నా సర్వస్వమైన – నా జీవిత[illegible]మైన మృదులకి....."

అంత వరకూ చదివి హడలిపోయింది మృదుల. భాగవతార్ ఇంత రొమేంటిక్‌గా ఎప్పుడూ ఉత్తరం రాయలేదు.

మళ్ళీ చదవడం మొదలు పెట్టింది.

"నువ్వు నన్నెందుకు పెళ్ళి చేసుకున్నావో దేవకి చెప్పింది. ప్రేమించే మనసు కలవాణ్నని నువ్వు నన్ను పెళ్ళి చేసుకున్నావు. ఈ విషయం తెలిసినప్పుడు ఎంత గర్వపడ్డానో – అంత సిగ్గు పడ్డాను కూడా. పాపం నీకు ఏ నాడు నా మనస్సులో వున్న ప్రేమను జూ పించ లేకపోయాను. నిజంగా నిజం. నిన్ను చాలా చాలా ప్రేమించాను. కాని లోకంలో అందరి మగవాళ్ళ లాగే నా సంకుచిత భావాలకనుగుణంగా నిన్ను మార్చుకోవాలని చూసాను. నువ్వు చలాన్ని ఎప్పుడూ కోట్ చేస్తూంటావు. ఒకసారి అన్నావు. "మగవాడు ఆడదానిలో ఆధునికతని కోరుకుంటాడట. ఎటొచ్చి ఆ ఆధునికత తన భార్యలో కాక పరాయి స్త్రీలో చూడాలనుకుంటాడట." ఇవి చలం మాటలని నువ్వే చెప్పావు నాకు. ఎంత నిజం ఈ మాటల్లో. మూర్ఖంగా ప్రవర్తించి అనురాగమయమైన నీ



మనస్సుని దారుణంగా నొప్పించాను. అది భరించలేకనే పాపం నువ్వు దయానంద చక్రవర్తిని ప్రేమించుంటావు.


నీకో రహస్యం చెప్పనా! ఒకప్పుడు నువ్వెరినో ప్రేమించావని అనుమానపడి నిన్ను హత్య చేసి ఆ నేరం నీ ప్రియుడి మీద నెట్టాలని ప్లాను వేసాను. ఎంత వెఱివాణ్నో చూడు. నువ్వు నా దగ్గిర్నుంచి వెళ్ళిపోయాక అర్థమైంది. నీకు చీమ కాలంత కష్టం కలిగించడంకంటె నేను వెయ్యి చావులైనా చావగలను.

నేనిది వరకటి భాగవతార్‌ని కాను. మనసారా నీ సుఖం కోరుకుంటున్నాను. అందుకే మనసు రాయి చేసుకుని, నువ్వు ప్రేమించిన దయానంద చక్రవర్తికి నేనే నిన్ను స్వయంగా అప్పగిస్తాను. అతడినెలాగైనా ఒప్పించి పెళ్ళి యేర్పాట్లు చేయడానికే వెళ్తున్నాను. ఒక స్నేహితుడిగా నన్ను గుర్తుంచుకో, ఎప్పుడేనా నేను కనిపిస్తే చిరునవ్వుతో పల్కరిస్తావు కదూ!

నీ

భాగవతార్"

ఉత్తరం చదివి నవ్వాపుకోలేక పోయింది మృదుల. భలే వ్యక్తి. ఇప్పటికైనా తనొక స్వతంత్ర వ్యక్తినని, ఒకవేళ నిజంగా తను ఎవరి దగ్గరికైనా వెళ్ళాలనుకుంటే ఎవరి సహకారమూ అక్కర లేకుండానే వెళ్ళిపోగలదని అర్థం చేసుకోలేక పోతున్నాడు. ఇప్పటికీ భర్త హోదాలో తను అతడికి చెందిన



డాక్టర్ సలహాలు

డా. కె. వెంకటేశ్వరరావు

పి. కె. – కొత్తపేట

నా వయస్సు 25 సంవత్సరములు. రెండు సంవత్సరములుగా వికారంగా వుంటుంది. వాంతి అవటం, ఆకలి లేక పోవటం, త్రేన్పులు రావటం, నిద్రలేక పోవటం, తల నెప్పి మొదలైనవి వస్తున్నాయి. డాక్టర్ల సలహా మీద మందులు వాడాను. ఏమి నయమవలేదు.

మీరు మానసిక ఆందోళనతో బాధపడుతున్నారని తెలుస్తున్నది. జీవితంలో ఏదో పొందలేక పోతున్నా మనే నిరాశ, నిస్పృహ ఇలా డిప్రెషన్‌కి దారి తీసి పై లక్షణాలన్నీ ఏర్పడతాయి. మీరు సైకియా ట్రిస్టుల సలహా గూడా పొందటం మంచిది. తాత్కాలిక ఉపశమనానికి ఏమిడాక్సిన్, డయాజెపాం మొదలైన మందులను వైద్యుల సలహాపై వాడవలసి వుంటుంది.

ఎల్. ఎల్. వి. – బంద్రంపల్లి

నా వయస్సు 50 సంవత్సరములు. నాకు నెల, రెండు నెలల కొకమారు మలములో రక్తము పడుతున్నది. మరల కొన్ని నెలలు వుండదు. దీనికి కారణమేమిటి?

మల పరీక్ష చేయించుకొని అందులో అమీ బాలు లేవని తేలినపుడు శస్త్ర వైద్యుల చేత గుదస్థానాన్ని ప్రాక్టోస్కోపీ, సిగ్మాయిడోస్కోపీ చేయించి ఏమైనా లోపాలున్నాయేమో తెలుసుకోవలసి వుంటుంది.

మలబద్ధకం రాకుండా చూసుకోవటం చాలా అవసరం.

కె. ఎల్. – మార్టేరు

నా వయస్సు 20 సంవత్సరములు. నా బరువు 60 కి. గ్రా. ఈ వయస్సులో ఇంత బరువు వుండకూడదంటున్నారు. నిజమేనా? బరువు తగ్గటానికి ఏమి చెయ్యాలి? వ్యాయామం చేస్తే తగ్గుతుందా? దానికి ఏమి చేయాలి? ఆహారం ఏమి తీసుకోవాలి?

మితమైన ఆహారం క్రమబద్ధంగా తీసుకోవటం, తీసుకున్న ఆహారానికి తగినట్లుగా వ్యాయామం చేయటం, పిండి పదార్థాలు, కొవ్వు పదార్థాలు వాడటం తగ్గించటం చాలా అవసరం. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం 1 కి. మీ. పరుగెత్తటం మంచిది. అలా పరుగెత్తుతున్నాము కదా, కష్టపడుతున్నాము కదాని ఎక్కువ ఆహారం తీసుకుంటే బరువు తగ్గకపోగా పెరిగే అవకాశం వుంటుంది.

జి. యన్. ఎల్. – ఉయ్యూరు

చిన్న పిల్లలకి పోలియో రాకుండా డ్రాప్సు వేసే విధంగా పెద్దలకు పక్షవాతం రాకుండా ఏమైనా మందులు ఉన్నాయా? ఆహార అలవాట్లలో మార్పు అవసరమా?

పక్షవాతం రాకుండా వాడబడే డ్రాప్సు లేవు. పక్షవాతం అనేది మెదడు లోపలి భాగంలోని నరాల కూడలి స్థానం అయిన ఇంటర్నల్ కాప్సుల్ వద్దనున్న రక్తనాళాలు చిట్లటమో లేక వాటిలో అవరోధం ఏర్పడటమో జరిగితే ఏర్పడే రోగం. అధిక రక్తపు పోటు, డయాబెటిస్ మొదలయినవి ఈ రోగానికి దోహదం చేస్తాయి. ఆహారంలో అధికంగా క్రొవ్వు పదార్థాలు వాడే వారికి ఈ రోగం రాగల అవకాశం ఎక్కువ.

కె. పి. – విజయనగరం

నాకు ఇంగువ, కరివేపాకు, బ్లీచింగ్ పౌడర్ వాసనలు పడవు. బూట్‌పాలిష్, క్రొత్త పుస్తకం వాసనలంటే చెప్పలేనంత ఇష్టం, వర్షం పడే ముందు వచ్చే ఇసుక వాసనంటే ఎంతో ఇష్టంగా ఉంటోంది. ఇలా ఉండటానికి ఏదైనా రోగానికి సంబంధం ఉన్నదా!

ఇలా జరగటానికి వ్యక్తిగత ఇష్టాయిష్టాలే తప్ప శారీరక లోపం కాదు. రోగం అంతకన్నా కాదు. □

రేపటి మహిళ

వస్తువైనట్లు మరొకరి కర్పించి త్యాగం చేస్తానంటున్నాడు. సమాజంలో ముఖ్యంగా మగవాళ్లలో ఈ దృక్పథం మారడానికెన్నేళ్లు పడుతుందో

భాగవతార్‌ని తల్చుకుంటే జాలేసింది. తరతరాలుగా వస్తోన్న భావదాస్యం నుంచి బయట పడలేక పోతున్నాడే కాని సహజంగా మంచివాడు. మంచం మీంచి లేవలేని దశలో వుండి తననేదో ఉద్ధరిద్దామని వొంటి నిండా కట్లతో హీరోయిక్‌గా బయల్దేరాడు. ఈ హీరో గారు ఏ అఘాయిత్యము చేయక ముందే వెళ్లి అడ్డు పడాలి. నర్సుకి చెప్పి వెళ్దామని రూమ్ లోంచి బయటి కొచ్చింది. ఆమె కోసమే ఎదురు చూస్తున్నట్లు ఎవరో వ్యక్తి నిలబడి వున్నాడు విజిటర్స్ హాల్లో. మృదులని చూసి–

"శ్రీమతి మృదుల గారు మీరేనా?" అడిగాడు.

"అవును."

తన విజిటింగ్ కార్డు చూపించాడు అతడు. సీక్రెట్ ఇంటలిజెన్స్ పోలీస్ ఇన్‌స్పెక్టరతను.

"యువార్ అండర్ అరెస్ట్" అని అరెస్ట్ వారెంట్ చూపించాడు.

"దేనికీ యీ అరెస్ట్?" ఆశ్చర్యంగా అడిగింది.

సారీ మేడమ్! ఇప్పుడేం చెప్పడానికి వీల్లేదు. పోలీస్ స్టేషన్‌లో అన్నీ తెలుస్తాయి" జాలిగా అన్నాడు.

"ఒక్క క్షణం సిస్టర్‌కి చెప్పి వస్తాను" ప్రాధేయ పూర్వకంగా అడిగింది. ఒప్పుకున్నాడు ఇన్‌స్పెక్టర్. మృదులని చూస్తోంటే అతనికి గౌరవం కలుగుతోంది. అరెస్ట్ చెయ్యవలసి వచ్చినందుకు బాధగా వుంది. ఆమె భవిష్యత్తూహించుకుంటే భయం వేసింది.

మృదుల డ్యూటీ సిస్టర్‌ని కలుసుకుని లాయర్ వైజయంతి నంబరు కాగితం మీద వ్రాసి ఆమె చేతిలో పెట్టి, "ప్లీజ్! ఈ నంబర్‌కి ఫోన్ చేసి లాయర్ యశోధరాదేవితో నన్ను సీక్రెట్ ఇంటలిజెన్స్ పోలీసు ఇన్‌స్పెక్టర్ అరెస్ట్ చేసి తీసుకెళ్లినట్లు చెప్పండి. ప్లీజ్!" అంది.

పోలీస్ పేరు వినగానే సిస్టర్ కళ్లు పెద్దవయ్యాయి. భయంగా చూసింది. రక్షక భటుల పేరు చెపితేనే సమాజంలో అందరికీ భయం –చిరాకు. మృదులకి ఆలోచించడానికి, సిస్టర్‌ని కన్విన్స్ చెయ్యడానికి టైమ్ లేదు. పది రూపాయల నోటు సిస్టర్ చేతిలో పెట్టి "లాయర్ యశోధరాదేవికి ఫోన్ చేసి ఈ విషయం చెప్తే నీకు మంచి బహుమానం వస్తుంది" అని ఆశపెట్టింది.

అలాగే అన్నట్లు తలూపింది సిస్టర్ భయం, ఆశ పోటీలు పడుతూన్న కళ్లతో.

మృదుల బయటికొచ్చేసి ఇన్‌స్పెక్టర్ వెంట వెళ్లి జీప్‌లో కూర్చుంది.

(ఇంకా ఉంది)



ఈ కుటుంబానికి ఇంకా ఆశ వుంది. యునైటెడ్ ఇండియా సహాయం వలన.

పాము కాటు, త్రాగిన కొట్లాట...ఒక దారుణ ప్రమాదం కుటుంబంలోని సంపాదిస్తున్న వ్యక్తిని పొట్టన పెట్టుకున్నప్పుడు భవిష్యత్తు గురించి భయపడకుండా యునైటెడ్ ఇండియా వారికి సహాయం చేయగలదు. అటువంటి కుటుంబాల గురించి మీకు తెలిస్తే, ఈ పథకం గురించి వారికి తెలియచేయండి.

భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖవారి వ్యక్తిగత ప్రమాద సాంఘిక భద్రతా పథకం

- సంవత్సర ఆదాయం రూ. 5000 కన్నా తక్కువ వున్న కుటుంబంలోని సంపాదిస్తున్న వ్యక్తి (18–55 సంవత్సరాల మధ్య వయసు) ప్రమాద వశాత్తు మరణిస్తే రూ. 3000 పరిహారంగా చెల్లించబడుతుంది.
- ప్రమాద మరణాల క్రింద పాము కాటు, మునిగి పోవడం, మెరుపు, విషపూరిత ఆహారం, ఆత్మహత్య ఉద్దేశపూర్వకంగా చేసుకున్న గాయం, యుద్ధం మొదలైన వాటినుంచి సంభవించే మరణాలు వుంటాయి. (రోడ్డు/మోటారు ప్రమాదాలు తప్ప)
- పరిహారం జీవించి వున్న భార్య/భర్త లేక ఆధారపడివున్న పిల్లలు లేక ఆధారపడివున్న తల్లి దండ్రులకి చెల్లించబడుతుంది.
- ప్రస్తుతం అనంతపూర్, చిత్తూరు, తూర్పు గోదావరి, గుంటూరు, కరీం నగర్, మహబూబ్ నగర్, విశాఖపట్నం, కడప, కర్నూలు, నల్గొండ, ప్రకాశం. శ్రీకాకుళం, వరంగల్ మరియు పశ్చిమ గోదావరి జిల్లాలలో మాత్రమే అమలులో వుంది.

ఇంకా వివరాలకు సమీపంలో వున్న యునైటెడ్ ఇండియా కార్యాలయం, విచారణ మరియు పరిష్కరణాధికారి లేక మండల వికాశాధికారిని సంప్రదించండి.

UNITED INDIA

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్
(జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియావారి అనుబంధ సంస్థ)
24, వైట్స్ రోడ్,
మద్రాసు 600 014

ప్రమాద మరణానికి రూ: 3000 పరిహారం

HTA 7051

మన సంస్కారాలు ఓం విశేషాలు

ఖండవిల్లి సూర్యనారాయణ శాస్త్రి

వివాహంలో ధర్మప్రధానమైన ప్రయోజనాలు

వరుడు, తాను వివాహం చేసుకోదలచిన కన్యక యొక్క తండ్రి వద్దకు తన ఆత్మీయ మిత్రులు నల్గురను పంపిస్తూ తన వివాహధ్యేయాన్ని గూర్చి వారి ముఖతః కన్యాదాతకు వరుడు తెలిపే వరవాక్యం లోని భావమిది.

1. "ధర్మ, సత్సంతానముల సంపదకై నేను వివాహం చేసుకొనదలిచినాను.

("ధర్మ ప్రజాసంపత్యర్థం స్త్రీయముద్వహే"



ఇతిపరః

కన్యాదా తృసమీపం చతురో వరాన్ ప్రేషయతి"

అని అతడు తెలుపుతాడు.

ఇక కన్యాదానం చేయబోయే ముందు వరుని విషయంలో కన్యాదాత చేసే శాసన వాక్యం లోని భావమిది.

2. ఓ నూత్నవరా! నీగృహస్థాశ్రమంలో, నీవీమెతో కూడి నీ అర్థకామాలను ధర్మ పూర్వకం గానే సేవించ వలెను. అనగా ధర్మంతో కూడిన అర్థాన్ని, ధర్మంతో కూడిన కామాన్ని మాత్రమే నీవీమెతో కూడి సేవించవలెను. అంతేకాని ధర్మ రహితమైన అర్థకామాలను నీవు ఈమె విషయంలో ప్రయోగింప రాదు.

("దాతా-ధర్మార్థ కామేషుత్వయ్యైషానా తి చరితవ్యా") ఇక నూత్న వరుడు తన వివాహా దిలో చేసే సంకల్ప వాక్యంలోని భావం ఇది. వరుడు నూత్న వధువుతో ఇలా అంటాడు.

3. "ఓకళ్యాణీ! ఇటుపై మన మిద్దరం కలిసి 'గృహస్థాశ్రమ ధర్మ క్రియలను" శ్రద్ధగా ఆచరిస్తూ ఈ ధర్మక్రియా చరణ ఫలరూపంగా సత్సంతాన మును బడయ వలెను.

("ఆవాభ్యాం కర్మాణి (గృహస్థాశ్రమ ధర్మ కర్మాణి) కర్తవ్యాని ప్రజా శ్చోత్పాదయి తవ్యాః")

ఈ మూడవ సూత్రంతో చెప్పబడిన "ధర్మ క్రియలు" దంపతుల గృహస్థాశ్రమ ధర్మాలకు చెందినవే. ఈవిధంగా మీది మూడు సూత్రాలతో ధర్మ" శబ్దానికే మొట్ట మొదటి స్థానం ఇవ్వబడింది.

ఇట్లు హైందవ వివాహానికి చెందిన నిబంధనలు, నియమాలు, కట్టుబాట్లు మొదలైనవన్నీ మొదటి నుంచీ "ధర్మంతో ముడి పెట్టబడి – అవి ధర్మ పూర్వకంగాను తత్కారణం చేతనే అవి లోక శ్రేయస్సంపాదకాలుగాను మలచబడినట్లు స్పష్టమౌతుంది. ఈ సత్యాన్ని సంపూర్ణంగా నిరూపించే నిదర్శనాలెన్నో వివాహ మంత్రాలలోను ఆ సూత్రాలలోను మహిత రీతిలో భద్ర పరుపబడి ఉన్నాయి.

ఇక, ఇంకో ధార్మిక సూత్రం, "వివాహ క్రియలు ధర్మమూలకాలైన" విధాన్ని ఇలా విశదం చేస్తుంది. "గృహస్థాశ్రమ ధర్మనిర్వహణం కోసమే శాస్త్రీ యంగా వివాహం చేసుకోబడి, "ధర్మపత్ని" అనే యోగ్యత (డిగ్రీ) సంపాదించిన భార్య, భర్తతో కూడి అటు యజ్ఞాది ధార్మిక క్రియలలో పాల్గొనుటకూ పనికి వస్తుంది. ఇటు "రతి" క్రియకూ పనికి వస్తుంది.

కాని ప్రత్యేకముగా "రతి" కోసమే ఉద్దేశించబడిన భోగకాంత, ఒక్క "రతి" కోసమే కాని ధర్మక్రియా చరణ మునకు పనికి రాదు. కారణం, శాస్త్రీయ వివాహ సంస్కారం లేని స్త్రీకి "ధర్మపత్ని" అనే యోగ్యత లేదు. "... యా ధర్మార్థా సైవరత్యర్థా" యా రత్యర్థాసాధర్మార్థాన భవతి" అని పార్థసారథి మిశ్రపండితుడు తన "పూర్వ మీమాంసా శాస్త్ర దీపిక"లో తెలిపినట్లు "మీమాంసా శాస్త్ర ప్రవీణ" బ్ర. శ్రీ రేమెళ్ళ సూర్య ప్రకాశ శాస్త్రిగారు "హిందూ వివాహ విశిష్టత" అనే గ్రంథంలో తెలిపినారు.

ఈ ధార్మిక నిబంధన కూడా, వివాహం ధర్మ ప్రధాన మైనదే కాని భౌతిక భోగ ప్రధానమైనది (మాత్రమే) కాదని" నిరూపించి నిశ్చయిస్తుంది.

ఇక కన్యాదాత వరునికి కన్యాదానం చేస్తూ అతడితో

5. "ఓ వరా! ఈ కమనీయ కన్యాదానం నీకు ఎందుకు చేస్తున్నానంటే మొదట్లో నీవీమెతో కలిసి యజ్ఞాది ధర్మ కార్యాలు ఆచరించడానికీ పిమ్మట సత్సంతానమును నీవీమె యందు పొందడానికీ గాను నీకీ కన్యాదానం చేస్తున్నాను" అంటాడు. దీనిని బట్టి శాస్త్రోక్త రీతిలో వివాహ సంస్కారం జరిపిన పిమ్మటే స్త్రీకి "సహధర్మ చారిణి" "ధర్మపత్ని" అనే యోగ్యత కలుగుతుంది. ఈ యోగ్యత ఉన్న స్త్రీయే భర్త పక్కని కూర్చొని భర్త చేసే యజ్ఞాది ధర్మ క్రియలలో పాల్గొనడానికి పనికి వస్తుంది. ఈ విషయాన్ని, వ్యాకరణ శాస్త్రానికి చెందిన ఒక పాణినీయ వ్యాకరణ సూత్రం ఇలా ధృవపరు స్తుంది. ("పత్యుర్నో యజ్ఞసంయోగే" పతిశబ్దస్యన కారాదేశస్స్యాత్. యజ్ఞేన సంబంధే. వసిష్ఠస్య పత్నీ వసిష్ఠ కర్తృక యజ్ఞఫల భోక్త్రీత్యర్థః దంపత్యోస్స హాధి కారాత్") దాని అర్థమిది.

"పతి" శబ్దానికి యజ్ఞంతో సంబంధం ఉన్నప్పుడే "న" కారాదేశం వచ్చి ఆపతి శబ్దం "పత్నీ" శబ్దంగా మారుతుంది. ఉదాహరణకు– "వసిష్ఠుని "పత్నీ" అన్నప్పుడు ఆ పత్ని "వసిష్ఠుడు చేసే యజ్ఞం తాలూకు ఫలాన్ని అనుభవించే అర్హత కలది" అనే అర్థం వస్తుంది. ఎలా వస్తుందంటున్నారా? వినండి. శాస్త్రీయమైన వివాహ సంస్కారంతో "దంపతులు" అనిపించుకున్న వారిద్దరికీ, వారి, అందం యవ్వన జనితమైన ఆనందం మొదలైన వన్నీ ఇద్దరు కలిసి సరిసమానంగా అనుభవించే పూర్తి హక్కు వారిద్దరికీ ఆ సంస్కార ప్రభావం చేతనే వస్తుంది. కనుక "భార్యతో కలిసి ధర్మ క్రియలు ఆచరించడానికే కన్యాదానం" అనే కన్యాదాత మాటలోనే, "హైందవ వివాహ సంస్కారం ధర్మ ప్రాధాన్యం కలది" అనే పరమార్థం, వ్యాకరణ సూత్రం ద్వారా కూడా ఋజువయింది. ఈ పరమార్థాన్ని ఋజువు పరచే మరో నిదర్శనమిది.

6. "ధర్మపత్ని" తన పక్కని లేని పురుషుడు యజ్ఞం చేయరాదు"

"అయజ్ఞోవాఏషః! యో పత్నీకః"

అని తైత్తిరీయ బ్రాహ్మణం అనబడేశ్రుతి – తెలుపు తూంది. ఈ శ్రుతివాక్యం లోని "అపత్నీకుడు" అనే పదానికి శాస్త్రీయ వివాహ సంస్కారం ద్వారా "ధర్మ పత్ని" **అనే యోగ్యతను పొందిన** "పత్ని" లేనివాడు" **అని అర్థం. యజ్ఞం చేసే భర్త పక్కన ఉండి యజ్ఞంలో పాల్గొన** తగిన స్త్రీకి మాత్రమే "పత్ని" అనే పేరు చెల్లుతుందని వ్యాకరణ సూత్రం నొక్కి పక్కాణించిందికదా! ఇక వివాహసంస్కారం కల స్త్రీ పురుషులకు మాత్రమే "పతి పత్నులు" అనే పేర్లు చెల్లుతాయి. అని సప్తపదిలోని మంత్రాలు తెలిపినవి. ఎలా చూసినా స్త్రీకి వివాహ సంస్కారం చేతనే "ధర్మ పత్ని" అనే పేరు వస్తుంది. కనుక భోగ కాంతను పక్కన బెట్టుకొన్న వానికి యజ్ఞాచరణయోగ్యత ఉండదు" అని మీది శ్రుతివాక్యం లోని భావం. ఈ భావం కూడా వివాహ సంస్కారం యొక్క ధర్మ ప్రాధాన్యాన్ని ఋజువు పరుస్తుంది. ఇక "సంస్కార రత్నమాల" అనే ధర్మ శాస్త్ర గ్రంథం లోని ఒక సూత్ర భావం ఇది.

7. "దేవ ఋణాన్ని, పితరుల ఋణాన్ని పూర్తిగా తీర్చి వేయడమనేదే వివాహానికి ఫలం".

"వివాహస్య ఫలం దేవ పిత్రర్ణాపాకరణం" (సంస్కార రత్నమాల 403 పే.) ఈ సూత్రార్థాన్ని పట్టి చూసినా కూడా, "హిందూ వివాహసంస్కారం ధర్మ ప్రాధాన్యం కలది" అనే పరమార్థం ప్రస్ఫుట మవుతూంది.

8. ద్విజునకు పుట్టుకతోనే 3 ఋణములు (బాకీలు) ఏర్పడతాయి. ఇవి ఋషి, దేవ, పితృ ఋణములు అనబడతాయి. సలక్షణంగా "బ్రహ్మచర్యమును" ఆచరించడం చేత ఋషి ఋణం తీరిపోతుంది. యజ్ఞములను యథోక్తంగా ఆచరించడం చేత దేవ ఋణం అనేది, సత్సంతానమును పొందడం చేపితౄణము అనేవి తీరిపోతాయి. ఇట్లు తన 3 బాకీలు మీది విధంగా తీర్చేసిన పురుషుడే, భౌతిక బంధముల నుండి విముక్తుడై పిమ్మట మోక్ష ప్రయత్నమునకు యోగ్యత కలవాడౌతాడు. ఇట్టి యోగ్యత ముఖ్యంగా "వివాహం" చేతనే పురుషునకు ప్రాప్తిస్తుంది గాన, సర్వవిధాలా, "వివాహ ధర్మ ప్రాధాన్యం కలది" అని సిద్ధాంత మయింది.

వివాహం – ఆధ్యాత్మిక ప్రయోజనాలు–

ఇంతకు ముందు చెప్పినట్లు ఋణ విముక్తి పొందిన విప్రుడే మోక్ష ప్రయత్నానికి పాత్రుడౌతాడనీ, అలా ఋణత్రయాన్ని తీర్చకుండా, మోక్షప్రాప్తికి ప్రయత్నించిన ద్విజుడు 'పతితుడు' ఔతాడనీ మనుస్మృతి ఇలా చాటి చెప్పింది.

"ఋణాని త్రీణ్యపాకృత్య, మనో మోక్షేనివేశయేత్!
అన పాకృత్య, మోక్షంతు సేవ మానః పతత్యధః!!"

కనుక, హైందవ విహాహ సంస్కారంతో ద్విజుడు ధర్మార్థ కామ మోక్షరూప చతుర్విధ పురుషార్థ సేవన రూపంలో పూర్తిగా స్వధర్మాన్ని ఆచరించిన వాడై క్రమంగా, మోక్ష ప్రాప్తి రూపంలో ఆధ్యాత్మిక ప్రయోజనమును కూడా అతడు పొందగలుగుచున్నాడు. ఇక సత్సంతానము పెరిగి పెద్దదైన పిమ్మట ఆ సంతానమునకు తన ఆస్తిని పంచి ఇచ్చిన పిమ్మటే తండ్రి హైందవ ధర్మాన్ని అనుసరించి వాన ప్రస్థ సన్యాసాశ్రమాలలో ప్రవేశించి క్రమంగా మోక్షాన్ని పొందవలసి ఉంది. ఈ హైందవ సంప్రదాయ ప్రకారంగా చూసినా మన "వివాహం", మానవుల మోక్ష ప్రాప్తికి కూడా పరం పరా సాధన మౌతూన్న విషయం ఋజువయింది. ఇట్లే పరమాత్మను తెలుసు కొనుటకు వేద ప్రవచనము, యజ్ఞాలు, దానము, నిష్కామమైన తపస్సు అనేవి మోక్షానికి సాధనాలుగా ఉపయోగిస్తాయని బృహదారణ్యకోపనిషత్సూక్తి ఇలా తెలుపుతూంది. ("తమేతం వేదానువచనేన బ్రాహ్మణావి విషంతి యజ్ఞేన దానేన తపసా నాశనేన") ఈ వేదాధ్యయన యజ్ఞాదులు మన ఆత్మయందు క్రమంగా సంస్కారమును, చిత్త శుద్ధిని కలిగించి తద్వారా అవి ఆత్మజ్ఞాన మును మనసులో ఉదయింప జేయుటకు సమర్థాలై ఉన్నాయి. ఈ విధంగా ఆత్మజ్ఞాన ప్రదాలైన యజ్ఞ దానాదుల నిర్వహణకు యోగ్యతను కలిగించే "వివాహం" క్రమ పరిణతితో మానవులకు ఆధ్యాత్మిక ప్రయోజనములను కూడా ప్రసాదింప గలిగి ఉన్నట్లు ప్రస్ఫుట మయింది.

ఇట్లే, గార్హస్థ్య ధర్మాలలో ప్రాముఖ్యం వహించినది "యజ్ఞ నిర్వహణం" కదా! దీని ద్వారా దేవతలు తృప్తి చెంది యోగ కర్తలకు వారు సర్వవిధాభ్యుదయాలను సమకూరుస్తారు. ఇంకా ఈ యజ్ఞ నిర్వహణం వలన, సోమయాజి సోమిదమ్మ దంపతులలో దైవీగుణ సంపద యేర్పడి దాని ద్వారా వారికి క్రమంగా మోక్షం లభిస్తుందని,

"దైవీ సంపద్విమోక్షాయ, నిబంధాయా సురీమతా" అనే గీతాసూక్తి చాటుతూంది. ఇట్లే దేవ పూజ, అతిథి పూజ, పంచమహాయజ్ఞ నిర్వహణం వంటి ధర్మాలను యథోక్తంగా ఆచరించడం చేత అట్టి దంపతుల మనస్సు పరిశుద్ధమై తన్ముఖమున, స్వార్థాహం కార కామక్రోధాది దోష వర్జితమై, సర్వ భూతదయ, "సంతత దైవీ భావన" వంటి ఉదార భావ సంపదతో సమలంకృతమైన కారణం చేత 'వివాహ' మనేది మానవుల "ఆధ్యాత్మిక భావన" కు కూడా మూలమని ఋజువయింది.

(ఇంకా ఉంది)

ముంగిట్లో విమానం టికెట్లు!



అమెరికాలోని బ్యాంకుల్లో అత్యాధునిక స్వయంచోదిత యంత్రాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రజలు తమంత తామే డబ్బు లావాదేవీలు ఏ సమయంలోనైనా జరుపుకునేందుకు వీలు కలిగించాక ఆ యంత్రాలకు విశేషాదరణ లభించింది. ఇప్పుడు అమెరికా విమానయాన పరిశ్రమ కూడా టికెట్లివ్వడానికి కంప్యూటరైజ్‌డ్ యంత్రాలను ప్రవేశ పెట్టబోతున్నది. ఈ యంత్రాలకి విమాన సంస్థ వారి ప్రధాన కంప్యూటర్‌తో సంబంధంలో ఉంటుంది. ప్రయాణికులు చెయ్యవలసిందల్లా తమ క్రెడిట్ కార్డ్‌ను ఆ యంత్రంలో చొప్పించటమే.

అప్పుడు ఆ యంత్రం ఆ ప్రయాణికుడికి ఎంత పరపతి ఉందో, టికెట్ ఇవ్వవచ్చునో లేదో, ఆ వ్యక్తి అడిగిన విమానంలో ఖాళీ ఉందో లేదో పరిశీలించి టికెట్, ప్రయాణ అనుమతి పత్రం అందజేస్తుంది. ఈ పనులన్నిటికీ కలిపి ఆ యంత్రం తీసుకునే సమయం పది సెకన్లు మాత్రమే! కొన్ని యంత్రాలయితే ప్రయాణికులు అడిగిన కిటికీ పక్క సీటుందో లేదో, విమానంలో పొగ తాగకూడని విభాగంలో సీటుందో లేదో కూడా చెపుతాయి.

ఈ టికెట్లిచ్చే యంత్రాలను మొదట ప్రవేశ పెట్టినప్పుడు కేవలం విమానాశ్రయాలలో మాత్రమే నెలకొల్పారు. కాని ఇప్పుడు వాటికి దొరుకుతున్న ఆదరణను గమనించి, బ్యాంకులు, సూపర్ మార్కెట్లు, కార్యాలయ భవనాలు వంటి సౌకర్యంగా ఉండే స్థలాలలో నెలకొల్పుతున్నారు. వీటి వల్ల ప్రయాణికులకు ట్రావెల్ ఏజెన్సీల చుట్టూ తిరగడం, క్యూలల్లో నిలబడడం వంటి శ్రమ తగ్గిపోయిందని; విమానం టికెట్ సులభంగా, హాయిగా కొనుక్కోగలుగుతున్నారని అమెరికా పౌర విమానయాన బోర్డ్ అధ్యక్షుడు డాన్ మెక్ కిన్నాన్ అన్నారు. □

సీరియల్

డి.ఎస్.పి.విజయ్

ఆమూరి సావిత్రి



(గత సంచిక తరువాయి)

అతన్ని అనుకోకుండా ఇంత సమీపంగా చూడటంతో తడబడి పోతోంది వైజయంతి.... ఒక వెచ్చదనం అందంగా ఆహ్లాదంగా ఆమెను తాకినట్లయింది....

అత నెదురుగా ఆడాలంటే సిగ్గేస్తోంది.

"నువ్వు ఆడవా?" నిరుత్సాహంగా అన్నారు స్రవంతీ, వాసు.

"ఊహూఁ! మీరాడు కోండి." అన్నదామె.

"నువ్వాడకపోతే మేమూ ఆడం."

తన మూలాన వాళ్ళంతా అలా చెదిరి పోవటం బాగుండ లేదు విజయ్‌కి. అప్పటికి తేరుకున్నా డతను. చెట్టు చాటు నుంచి ఇవతలి కొచ్చి, "మీరు ఆడుకోండి.... నేను వెడుతున్నాను. ఊరికే.... ఎలా ఆడతారో చూద్దామని.... ఏం తోచక...." అంటూ వెళ్ళి పోబోయాడు విజయ్.

"పర్లేదు. మీరూ ఉండండి." గబుక్కున అన్నది వైజయంతి.

అతనాశ్చర్యంగా.... సంభ్రమంగా చూశాడు.

"నేనుంటే మీ రాడరుగా?" అన్నాడు.

అతనికి ఆమెతో మాట్లాడాలనుంది....

తన పరిధి నుంచి ఇవతలి కొచ్చి వాళ్ళతో కలవాలనుంది. అది ఎలాగో తెలీటం లేదు....

"మీరుండండి. అందరం కలిసి మా ఇంటి దగ్గర క్యారమ్సు ఆడుకుందాం. లేదా..... కబుర్లు చెప్పుకుందాం." అన్నదామె.

"వెడదాం పదండయితే." అన్నాడు విజయ్. అతనికీ ఆహ్వానాన్ని ఒదులుకోవాలని లేదు.

పిల్లలు ముందే పరుగెత్తారు తల్లికి వార్త చేర వెయ్యటానికి.

వెనక ఇద్దరూ కలిసి నెమ్మదిగా నడిచి వెళ్ళారు....

ఆమె సామీప్యం అతనికి ఆహ్లాదాన్ని కలిగిస్తోంది....

విజయ్‌ని సాదరంగా ఆహ్వానించింది అరుంధతి...

నేలమీద కూర్చోటం అతని కిబ్బందిని కలిగిస్తుందని, స్టూలు మీద బోర్డు పెట్టి, చుట్టూ నాలుగు కుర్చీ లేసింది వైజయంతి.

"రూపాయి లాట ఆడదామక్కా." అన్నాడు వాసు.

"ఒద్దురా! ఇద్దరిద్దరముండి పువ్వాట ఆడదాం." అన్నది స్రవంతి.

అతని వేపు ప్రశ్నార్థకంగా చూసింది వైజయంతి.

"నా కేఆటా సరిగ్గా రాదు." అన్నాడు విజయ్.

> జరిగిన కథ – 19 : డి ఎస్ పి విజయ్ ఒక నైట్ క్లబ్‌లో కాబరే డాన్సర్‌గా వింధ్యను చూస్తాడు. వింధ్య కోసం ఒక వైపు రంగారావు, మరో వైపు విజయ్ అన్వేషణ ప్రారంభిస్తారు. హేమలత నడుపుతున్న లతా నాట్యశాలలో వ్యభిచారం నడుస్తున్నదని వచ్చిన సమాచారంతో విజయ్ యుక్తిగా అక్కడ దాడి జరుపుతాడు. విజయ్ చిన్నతనంలో అనుభవించిన ఒంటరితనం, తల్లిదండ్రుల నిరాదరణ, వైజయంతి పరిచయం గుర్తుకొస్తాయి.

"అయితే.... మీరూ, జయంతక్కా ఒక పార్టీ. నేనూ స్రవంతీ ఒక పార్టీ. అక్క బాగా ఆడుతుంది." అన్నాడు వాసు.

"ఓ.కే." అన్నదామె ఉత్సాహంగా.

ఆట సాగుతోంది...

"అలాగే.... అలాగే ఆడండి. ఇదిగో ఈ యాగింల్‌లో కొట్టండి.... మనం ఓడి పోగూడదు.... ఏం పర్లా మనకి చాలా వచ్చాయి..... వాసూ.... రెడ్ పడితే మేమే గెలుస్తాం...."

ఇలా ఆమె తనను కలుపుకుని మాట్లాడుతుంటే తియ్యని అనుభూతి కలుగుతోంది విజయ్‌కి.

అలా వాళ్ళందరితో కలిసి ఆడుకోటం అద్భుతంగా అనిపిస్తోంది.

"అంత పొడుగున "వైజయంతి గారూ" అని పిలవకండీ! వినలేక పోతున్నాను. జయా అని పిలవండి." అన్నదామె స్నేహంగా.

మొదట్లో బిడియంగా అనిపించినా కొంత సమయం గడిచాక ఆమె నలాగే పిలవ గలిగాడు విజయ్.

రెండాటలు వీళ్ళు, రెండాటలు వాళ్ళూ గెలిచాక బోర్డు తీసేశారు.

"ఆయన ఊరెళ్ళారు. మీ రొచ్చారని తెలిస్తే సంతోషించే వారు. మీరేం కొత్తగా ఫీలవకండి. వీలయినప్పుడల్లా వస్తూ ఉండండి." ఆప్యాయంగా అన్నది అరుంధతి.

"ప్రతి ఆదివారం వస్తాను." అన్నాడు విజయ్.

అరుంధతి ఉప్పుడు పిండి పళ్ళెంలో పెట్టి తెచ్చింది. అందరికీ ప్లేట్లలో పెట్టి ఇచ్చింది.

"అలాంటి నాటు టిఫిన్లు ఆయనేం తిన గలరు?" అన్నది వైజయంతి.

"పర్లేదు." అన్నాడు విజయ్.

టిఫిన్ టేస్ట్ ఎలా ఉన్నా అలా అందరితో కలిసి ఆత్మీయంగా తినటం బావుంది విజయ్‌కి.

"ఈ చట్నీవేసుకు తినండి. బావుంటుంది.... ఇంకొంచం పెట్టనా?.... బావుందా?" అంటూ తనను ప్రత్యేకంగా కనుక్కుంటోంది వైజయంతి....

తను ఊహించిన.... తా నెరుగని నూతన ప్రపంచంలోకి అడుగు పెట్టి నట్లుంది విజయ్‌కి....

వైజయంతి మొహంలో తన పట్ల కనపడు తున్న ఆప్యాయత.... దగ్గరతనం.... స్నేహం అతన్నో ఊపు ఊపు తున్నాయి. చీకట్లోకి చూస్తూ ఒంటరిగా పడుకుంటే.... ఆమెను గురించిన ఆలోచనలు తోడుగా వచ్చి అతని ఒంటరి తనాన్ని దూరం చెయ్యసాగాయి....

ఆదివారం కోసం ఎంతో ఎదురు చూసేవాడు విజయ్. ఆ రోజు ఉదయం నుంచే అతని మనసు ఉల్లాసంగా ఉండేది....

ఆ రోజు తాలూకు మధురిమ మిగతా ఆరు రోజులూ అతన్ని అంటి పెట్టుకునే ఉండేది. మాధవరావు కుటుంబ సభ్యుల్లో ఒకడిగా కలిసిపోయి ఆదివారం వాళ్ళ మధ్య గడిపేవాడు విజయ్.

మిగతా రోజుల్లో కూడా అలా గడపాలని ఉన్నా.... మరీ టూ మచ్‌గా

ఉంటుందని నిగ్రహించుకునే వాడు....

విజయ్ వైజయంతిల మధ్య ఎవరూ గమనించని విధంగా అనురాగం అల్లుకోటం ప్రారంభించింది. ఆమె ప్రతి చర్యా అతనికి కొత్తగానే ఉండేది....

అప్పుడప్పు డామెను తన స్కూటర్‌మీద ఎక్కించుకుని, ఆమె కోరిక మీద సందు చివర దింపేసేవాడు. ఆ స్పర్శ నతడు క్షణం క్షణం గుర్తుతెచ్చుకునేవాడు....

ఒక రోజు థర్డ్ అవర్ లేకపోతే బయట కొచ్చేశాడు విజయ్. అతని కోసమే కాచుకుని ఉన్నట్టు చెట్టు కింద నిలబడ్డ వైజయంతి గబగబా నడిచొచ్చి అతన్ని కలుసుకుని–

"అమ్మయ్య! వచ్చేశారు గదా! మీకీ అవర్ లేదని తెలుసుకుని ఇందాకట్నుంచీ కాపలా వేశానిక్కడ." అన్నది.

"నువ్వు చెపితే.... ఇంకా ముందే వచ్చేసేవాడిని." అన్నాడు విజయ్.

కాలేజీ కాంపస్‌లో కొంచం దూరం నడిచాక, "నోరు తెరవండి." అంటూ అతని నోట్లో స్వీట్ కుక్కింది వైజయంతి.

"ఏమిటీ రోజు విశేషం?" అన్నాడతను.

తలంటుకోటం మూలాన తేలికగా ఎగురుతున్న ఆమె జుట్టు చెంపలను.... నుదుటిని అల్లరిగా తాకుతోంది.... విశాలమైన కాటుక కళ్ళు కాంతుల్ని వెదజల్లుతున్నాయి.... లేత ఆకు పచ్చరంగు చీరకు ఎరుపు గళ్ళ జరీ బోర్డరున్న చీరను అందంగా కుచ్చెళ్ళు పోసి కట్టుకుని, నీట్‌గా పిన్ చేసింది.... పచ్చని మొహంలో కొసతేలిన ముక్కుకు మిరియం ముక్కుపుడక కొత్తగా మెరుస్తోంది....


"ఈ రోజు నా పుట్టినరోజు." అన్నదామె.

ఆమెనే తదేకంగా చూస్తున్న విజయ్, "ఇప్పుడా చెప్పేది?" అన్నాడు.

"మరెప్పుడు చెప్పాలి?"

"ఉదయమే చెపితే ఇద్దరం కలిసి కాలేజీ ఎగ్గొట్టి హాయిగా మన తోటలో ఆడుకునే వాళ్ళంగా!"

అతనన్న తీరుకు ఆమె నవ్వేసింది....



తెల్లని బట్టల్లో దేవదూతలా ఉన్న నానీని చూడగానే – విజయ్‌లో స్తబ్దత సగం ఎగిరి పోయింది.

"పొద్దున్నే చాక్లెట్ ఇచ్చావెందుకు నానీ?" నవ్వుతూ అడిగాడతను.



ఈ రోజు నా బర్త్ డే అంకుల్ అన్నాడు నానీ"

"ఈజిట్, హేపీ బర్త్ డే టూ యు" అని పాడుతూ నానిని చేతుల మీద ఎత్తుకుని క్రిందకు దింపాడు విజయ్.

థ్యాంక్యూ అంకుల్" అంటూ విజయ్ చెయ్యి పట్టుకొని బెడ్ రూంలోకి వెళ్ళాడు నానీ.


డి. ఎస్. పి. విజయ్ మరియూ నానీల యొక్క ఈ సన్నివేశం నాకు చాలా నచ్చింది.

నచ్చిన సన్నివేశం

ఎస్. హేమలత; నర్సరావుపేట

* * *

ప్రేమించానని, పెళ్ళి చేసుకుంటానని కల్లబొల్లి కబుర్లు చెప్పి నమ్మించి బ్రతుకు బండలు చేసిన నరరూప రాక్షసుడి లాంటి శ్రీధర్ ఘాతుకానికి గురైన అబలగా 'సౌందర్య' తన జీవితాన్ని అంతం చేసుకోదలుచుకో




లేదు. చీడపురుగు లాంటి ఆ తుచ్ఛుడికి తగిన బుద్ధి చెప్పి తన లాంటి మరో ఆడది బలి కాకుండా చేయటానికి కృత నిశ్చయురాలై అందుకు తనకు సహాయం చేయగల సమర్థుడైన 'విజయ్'ను ఎంచుకుని 'వివేక వర్ధని' పేరుతో అతనిని కలిసిన సన్నివేశం నాకు నచ్చిన సన్నివేశం.

విజయ్ సౌందర్యను 'అమ్మా' అని సంబోధించటం – అతని సంస్కారాన్ని 'ఔన్నత్యాన్ని చాటుతోంది. సౌందర్యలు ఒకరు ఇద్దరై, ఇద్దరు ముగ్గురై ... పుట్టుకొస్తుంటే నయవంచకులు, దగాకోరులు మచ్చుకైనా కానరారు.

పాట్నీడి చక్రరావు, విశాఖపట్నం

* * *

చెయ్యెత్తి కళ్ళు తుడుచుకో బోతున్న ఛమన్‌లాల్ చేతిని అలాగే పట్టుకున్నాడు. ఆ చేతికున్న వాచీ చెయిన్‌కి బూడిద రంగు దారం వేలాడుతుంది. అది విజయ్ దృష్టి నాకర్షించటం చూసి, "వాళ్ళతో పెనుగులాడేటప్పుడు ఇది దీనికి తగులుకొని వుంటుంది. వాళ్ళలో ఒకడు బూడిద రంగు షర్టు వేసుకున్నాడు" అన్నాడు చమన్‌లాల్.



హోటల్ అప్సరాలో ఫామిలీ రూములో కూర్చుని తాగుతున్నాడు విజయ్. ఆ గది ద్వారం వేపున్న అద్దాల్లో నుంచి చూస్తే ఎదురుగానూ, కాస్త పక్కగానూ ఉన్నవాళ్ళు కనుపిస్తారు హాల్లో...

అక్కడొక టేబుల్ ఖాళీ అయింది. కొద్ది క్షణాల్లో మరో ముగ్గురొచ్చి ఆ స్థానాన్ని భర్తీ చేశారు. వాళ్ళను చూడగానే ఎలర్ట్‌గా అయ్యాడు విజయ్.

డి. ఎస్. పి. విజయ్

"పార్టీ ఇవ్వవా మరి?" అన్నాడు [illegible]యి.

"మీకు పార్టీ ఇవ్వగలిగేంత స్థోమతు నాకు లేదమ్మా! నేను బీద అమ్మాయిని...."

"ప్లీజ్ జయా! ఇహ ఆపెయ్యి, ఇంకెప్పుడూ ఇలా మాట్లాడకు.... మీ అభిమానానికి ఎ[illegible] రూపాయిలైనా సరిరావు....

డబ్బుతో అ[illegible]రిపా[illegible] ముఖ్యంగా.... అప్యాయత అనేది డబ్బు పోస్తే దొరికేది కాదు.

నువ్వు నా మీద చూపే స్నేహం విలువ కట్టలేనిది.

నాకది చాలు.

ఇంకెప్పుడూ ఇలా అనవు కదూ? ప్రామిస్?"

తను క్యాజువల్‌గా అన్న మాటకు అతనంతగా చలించి పోవటం ఆశ్చర్యంగా అనిపించిందామెకు.

అతని చేతిని స్పృశిస్తూ, "ఇంకెప్పుడూ అనను." అన్నది....

ఆమె ఎంత వారించినా వినకుండా ఒంటి ముత్యం పొదిగిన ఉంగరం కొని ఆమెకు ప్రజంట్ చేశాడు విజయ్....

ఇద్దరూ పార్కులో గుబురుగా ఉన్న చెట్లు కింద కూర్చున్నారు....

మధ్యాహ్నం కావటంచేత అక్కడ అట్టే జనం లేరు....

"జయా...." అన్నాడు విజయ్.

"చెప్పండి," అన్నది వైజయంతి.

"ఎలా చెప్పాలో తెలీటల్లేదు."


"ఎలా చెప్పినా అర్థం చేసుకో గలను."

"నేను.... నేనంటే నీ కిష్టం గదూ?"

"చాలా?"

"ఎందుకు?"

"తెలీదు. ఇది వయసు వేడిలో, ఉద్రేకం వల్ల కలిగిన భావం కాదు.. ఒకే కాంపౌండులో ఉండడం వల్ల మొదట మిమ్మల్ని క్యాజువల్‌గా చూసి ఉంటాను....



డి. ఎస్. పి. విజయ్

ఆర్ద్రమైన మనసుతో విన్నదామె.

తన ఒంటరితనం గురించి అతను చెప్పేటప్పు డామె చెయ్యి అతన్ని ఓదార్పుగా స్పృసించింది....

ఆ చేతి నలాగే పట్టుకుని ఒళ్ళో పెట్టు కున్నాడు విజయ్.

వచ్చేసే టప్పుడు అతనిచ్చిన ఉంగరంలో ముత్యాన్ని పెదవుల కానించుకుంటూ అతని వేపు కొంటెగా చూసింది వైజయంతి.

"నువ్విలాగే నన్ను రెచ్చగొడుతుండు. ఆ తరవాత ఏదన్నా జరిగితే.... నన్ను బ్లేమ్ చేస్తే ఊరుకోను." బెదిరింపుగా అన్నాడతను.

"ఏం జరుగుతుంది?" టీజింగ్‌గా అన్నదామె.


"ఇక్కడేం చెపుతాను? మన తోటలో పడమటి వేపున్న మామిడి తోపులో కిరా చెపుతాను."

"ఎంతాశ!"

"నిన్ను చూశాకే.... ఆశపడటం అనే దానికి అర్థం తెలుసు కున్నాను."

"ఉహూ!" అంటూ అతని స్కూటర్ వెనక కూర్చుందామె.

"పట్టుకో. పడతావ్ లేకపోతే." అన్నా డతను.



అతని బుజంమీద చెయ్యేసి, గట్టిగా అతని వీపు నొక్కి, ఈ లోగా రోడ్డుమీద కొచ్చెయ్యటంతో బుద్ధిగా కూర్చుంది వైజయంతి.

విజయ్ పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

* * * * * * * * *

విజయ్ వైజయంతిల ప్రణయం గురించి ఆ ఇద్దరి కుటుంబ సభ్యులకూ తెలియదు.....

తరుచుగా సినిమాలు.... షికార్లు అంటూ మామూలు ప్రేమికుల్లా ఒకరి నొకరు టూ మచ్‌గా అతుక్కు పోవటం లాంటి పద్ధతి విజయ్ వైజయంతిల మధ్య లేకపోవటం ఇందుకొక కారణం. ఎక్కువగా కలుసుకోక పోయినా ఆ ఇద్దరికీ ఒకరంటే ఒకరికి చచ్చేంత అభిమానం....

"గబగబా ఏదో ఒక అవకాశం కల్పించుకుని కక్కుర్తిగా ఆమెను అనుభవించి పారెయ్యాలనే ఆలోచన విజయ్‌కి గానీ, అతన్ని రెచ్చ గొట్టాలనే కుతూహలం వైజయంతికి గానీ లేవు."

ఒక ర్నొకరు అంటి పెట్టుకుని స్నేహంగా.... ఆత్మీయంగా మాట్లాడు కోవాలనే ఇద్దరూ కోరుకునే వాళ్ళు.

ఎన్నిసార్లు కలిసి.... ఎన్ని కబుర్లు చెప్పుకున్నా వాటికి అంతం ఉండేది కాదు.

ఆదివారం నాడు వైజయంతి ఇంట్లో అందరి మధ్యా గడుపు తున్నప్పుడు ఫ్రీగా మాట్లాడుకునే అవకాశం వాళ్ళిద్దరికీ లేకపోయినా ఒకరి ఉనికి ఒకరికి అపురూపంగా ఉండేది. కళ్ళతో నే మాట్లాడుకున్నా వాళ్ళకు తృప్తిగా ఉండేది.

ఓసారి అనుకోకుండా జరిగిన ఓ సంఘటన వాళ్ళను చాలా దూరం తీసి కెళ్ళింది....

ఆ రోజు ఆదివారం కాదు.

జ్వరంగా ఉందని కాలేజీకి వెళ్ళలేదు విజయ్....

శమంతకమణి ఇంట్లో లేదు.

చిన్నప్పటి రోజులు గుర్తొస్తున్నాయి విజయ్‌కి....

అప్పుడు ఆయా ఉండేది. ఇప్పుడు తనే టెంపరేచర్ చూసుకుని మందులు వేసుకుంటున్నాడు. నౌకరు కుర్రాడు ఫ్లాస్క్ నిండా కాఫీ తెచ్చి మంచం పక్కనే ఉన్న టీపాయ్ మీద పెట్టాడు....

క్లబ్బు వార్షికోత్సవాలకు హోం మంత్రిని, ఒక సినీ నటిని పిలిచారు. ఆ ఏర్పాట్లతో తలమునకలుగా ఉంది శమంతకమణి....

విజయ్‌కి జ్వరమనే సంగతే ఆమెకు తెలీదు.

చెప్పటం అనవసరమని అతనికి తెలుసు. అలా చెప్పే అలవాటు కూడా అతనికి లేదు.

డాక్టర్‌కి ఫోన్ చేస్తే వచ్చి చూసి, మెడిసన్స్ రాసిచ్చాడు. ...

పది నిమిషాల్లో మందులు.... గ్లూకోజ్.... రొట్టె లాంటి ప్రాథమిక వస్తువులన్నీ విజయ్ మంచం పక్కనున్న టీపాయ్ మీదికి చేరాయి....

బెల్ నొక్కితే నౌకరొస్తాడు.... వినయంగా చేతులు కట్టుకు నిలబడతాడు.... కాఫీ కావాలంటే ఇస్తాడు. పని కాగానే బయట కెళ్ళి పోతాడు యంత్రంలా....

తన దగ్గర తనను అనుకుని కూర్చుని ఎవరైనా కబుర్లు చెపితే బావుండునని పిస్తోంది విజయ్‌కి. మనసు ఆ ఒంటరి తనాన్ని భరించలేక ఎదురు తిరుగుతోంది....

వైజయంతి పదే పదే గుర్తొస్తోంది....

ఆమె నిక్కడికి పిలిస్తే బాగోదు. తను అక్కడికి వెళ్ళలేడు.

ఇంత జ్వరంతో అర్థాంతరంగా తను వాళ్ళింటి కెడితే ఏమైనా అనుకుంటారని భయం.

వెళ్ళాలనే కోర్కెను బలవంతంగా అణుచుకుని పడుకుంటే ఇంకా నరకంగా ఉంది.

చిన్నప్పటి ఒంటరితనం.... దిగులు మళ్ళీ వచ్చి తనను కమ్ముకుంటున్నట్లుంది....

సాయంత్ర మయింది. ఆమె కాలేజీ నుంచి వచ్చి ఉంటుంది.

నెమ్మదిగా లేచి కిటికీ దగ్గర కొచ్చాడు విజయ్.

అరుంధతి వరండాలో కొచ్చి, తీగ మీద చీర లారేస్తోంది....

ఎంత సేపు నిలబడ్డా వైజయంతి కనపడలేదు.

నిరాశగా వెను తిరిగి మళ్ళీ మంచం మీద పడుకున్నా డతను....

ఒంటరితనం మళ్ళీ వచ్చి రాక్షసిలా మీద పడింది....

కాసేపటికి మగతగా నిద్ర పట్టింది....

తెల్లారి జ్వరం కాస్త తగ్గింది. ఆ సాయంత్రానికి కొంచం తేలికగా అనిపించింది.

ఇహ ఉండబట్టలేక లేచి బయట కొచ్చాడు విజయ్. ఔట్ హౌస్ వరండాలో అలికిడి లేదు. నిగ్రహించుకో లేనట్లు గబగబా అటు కేసి నడిచాడు. అతని అలసిన మనసు ఆత్మీయతని కోరుతోంది....

తలుపు తీసిన వైజయంతి, "హాయ్ విజయ్! రండి." అంటూ సంతోషంగా ఆహ్వానించింది.

కోహినూర్



సుతిమెత్తని నీ చిరునవ్వుల వెల్గులు
సుగమం చేస్తాయి నా భవితవ్యాన్ని
జీవిత సోపానాల అధిరోహణలో
నేను ఒంటిగాదు జంటగా నీ బాహుబంధం
అనురాగం చిందే నీ హృదయం నాకు వేయి విధాల విదితం

KOHINOOR®

గులాబీరంగు
సుఖదాయకమైన ల్యూబ్రికేటెడ్
కాండోమ్. ఎలెక్ట్రానిక్
ఉపకరణాలతో పరీక్ష
చేయబడినది.



ఇప్పుడు
ఖర్చు ఆదా చేసే
విధంగా ఒకే
ప్యాక్‌లో పది.

ttk తయారీ

MAA (S) LRC 4A TEL 86

ప్రశ్నావళి — కె. రామలక్ష్మి

జి. వి. సికింద్రాబాదు

★ మనిషి విలువ కట్టలేని రెండు మంచి విషయాలు చెప్పండి, కె. రా.?

● ఆరోగ్యం. తెలివి!

★ నిజం బయట పడడానికి దారి లేదా?

● అబద్ధాల కోర్టు ఎక్కువైన కొద్దీ– నిజం బయట పడడం సులభం అంటారు – పెద్దలు.

ఎం. వి. ఎస్. ఎన్. శ్రీకాకుళం

★ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం స్వేచ్ఛని యివ్వడం లేదనీ, కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు స్వేచ్ఛగా పని సాగనీయకుండా అడ్డు తగులు తున్నాయనీ గోలపెట్టే రాష్ట్ర కేంద్ర మంత్రులకి స్వేచ్ఛ అనే పదానికి అర్థం ఎలా చెప్తారు మీరు?



● స్వేచ్ఛ అనేది ఒక మాట కాదు చరిత్ర. అది ఎప్పుడూ ప్రజల నుండి ప్రభుత్వాలకి లభ్యమైందే గాని– అటు నుంచి యిటు దానం చేయబడినది కాదనీ; ప్రభుత్వానికి స్వేచ్ఛ అంటే– దాని అధికారం మీద హద్దులూ, ఆంక్షలూ కాని అవి హెచ్చించడం తగ్గించడం కాదనీ– చెప్పాలి. కాని చెప్తే మన మంత్రులకి, ఎం. ఎల్. ఏ. లకి అర్థం అవుతుందా అని– అనుమానం. వారికి అధికారం చెలాయించడానికి "అధికారం" రావడం స్వేచ్ఛగా తోస్తుంది.

★ అవసరం తెలుసుకుని దానం చేయడం మంచిదా? లేక పుణ్యం కోసం దానం చేయాలా?

● అందుకే మన వాళ్ళు– అపాత్ర దానం అన్నారు– "నీ దగ్గర అడుక్కుని నీ వెనక జూదం ఆడే వాడికి చేసినది దానం ఎలా అవుతుందే పిచ్చి మొఖమా" అనే వాడు మా పెద మామయ్య. హోరున వర్షం కురుస్తుంటే ఎండు కట్టెలు అరువిచ్చే పెద్ద మనిషిని మనం– ఓ దాన కర్ణుడోయ్! అనేనా అంటాం. ఓట్టి వెధవాయి! అనేనా అంటాం.

ఆర్. ఎస్. వేమూరు

★ మీరింత చురుగ్గా జవాబు లిస్తుంటారు. దీని కేదైనా కోర్సుందా? ఉంటే చెప్పండి. నేర్చుకోవాలి.

● లాభం లేదు. గయ్యాళి పెళ్లాం వుండాలి– లేదా స్థితప్రజ్ఞుడైన భర్తైనా వుండాలి. మీ కేది అనుకూలమో చూసుకోండి!

రాము, గుంటూరు

★ వరకట్న చావులపై మీ అభిప్రాయం ఏమిటి?

● ప్రభుత్వపు, యువ లోకపు చేతకాని తనానికి నిదర్శన– అని పదే పదే నిరూపిస్తున్నాయీ చావులు అనిపిస్తుంది. (అయినా ముద్దుగా "రాము" అని పూర్తి చిరునామా యిస్తే చాలదు. పేరు పూర్తిగా రాయండి. లేకుంటే మీ ప్రశ్నల కిదే ఆఖరు జవాబు!)

ఆర్. ఆర్. ఖర్గపూరు

★ నేరస్తుడు నేరం చేస్తే సాక్ష్యం వుండాలి. భగవంతుడు నేరం చేస్తే తగిన సాక్ష్యాలు వుండవా?

● భగవంతుడంటేనే నేరం చేయని వాడని కదండీ బాబూ హిందువుల నమ్మకం?! ఇక సాక్ష్యం పెట్టుకుని నేరానికి పాలుబడేవాడు– చేతకాని నేరస్తుడు. లాయర్లకి కావలసినది అలాంటి నేరగాడు కాదు. నేరం చేశాక సాక్ష్యాధారాలు సృష్టించడం– సులభం కదా?!

★ ధనికులు పేదవాడిని తక్కువగా చూస్తారు. పేదవాడిని ఎక్కువగా చూసే రోజులు వస్తాయా కె. రా. గారూ!

● ఎందుకు రావు? ప్రతి ఎన్నికల ముందూ– పేదవాడే రాజు!

★ ఖడ్గము ముఖ్యమా? కలము ముఖ్యమా?

● ఎందుకు. ఖడ్గమైతే కూరలు తరగడానికి సదుపాయంగా వుండదు. ఇక కలం అంటారా? రాసే వాళ్ల అలవాటును బట్టి వుంటుంది! కలం అక్కర లేకనే నిప్పులు కురిపించే, కన్నులు వర్షింప చేసే గద్దర్ వున్నాడు! బంగారు కలాలుండీ– "తీపి తీపి జేజేలు" మించి పోని కవులూ వున్నారు. అంచేత ఆయుధాల విలువ– అవి చేపట్టిన వాడిని పట్టి వుంటుంది.

ఆర్. ఎమ్. హిందూపూరు

★ రామలక్ష్మిగారూ మీ అమ్మాయి రౌద్రి రాసిన ఆంగ్ల కవితా సంకలనం వెలువడిందని ఓ ఫ్రెండు చెప్పాడు. వెల ఎంత చెప్ప కలరా?

● సారీ.... అయిపోయింది– నిశీధి సంగీతం. తెలు గాంగ్ల కవితా సంకలనం. ఇప్పుడు నిద్ర పోని పాట వెలువడింది.

డి. ఎస్. ఆర్. విశాఖపట్నం

★ పశుబలం ముందు బుద్ధి బలాదూర్. ఏమంటారు?

● చిత్తం. కాదంటాను. పశు బలాన్నైనా భరించ వచ్చునేమో గాని పశు బుద్ధిని భరించడం చాలా కష్టం అనిపిస్తుంది నాకు. మేథస్సుని అన్యాయంగా దెబ్బ తీయాలని చూసే ఈ పశుబుద్ధి– తెలివిని దెబ్బ తియ్యాలని ప్రయత్నిస్తుందే గాని, గెలవడానికి ప్రయత్నించదు. అదీ బాధ.

ఎం. ఆర్. డి. బళ్ళారి

★ మీ రెందుకు మీ ఆత్మకథ వ్రాయకూడదు? చెపుతారా?

● కథలో రాసుకోతగ్గంత ఘనకార్యాలు చెయ్యలేదు!

★ మీరు ధనవంతులుకదా. మీ అడుగులకు మడుగులు వత్తే పనివాళ్ళు వుంటారనుకుంటాను. మరి మీ దినచర్య ఎలావుంటుంది?


● అనుకుంటాను – అనేమాట నాకు అర్థంకాదు – తెలిసేనా వుండాలి తెలియకేనా వుండాలి. తెలిసీ తెలియకవుంటే – యిలాగే ఏర్పడతాయి అభిప్రాయాలు! పనిమనుషులు లేరు. అడుగులకి మడుగులు ఒత్తనక్కరా లేదు! ఇక దినచర్య అంటారా? అది నా యిష్టప్రకారం ప్లాన్ చేసుకుంటాను – రాత – రాత – రాతగా మటుకుకాదు! ఇక – నాకు సరదాగా కాలక్షేపం చేయడానికి స్నేహితులున్నారు; బాధ్యతగా పనిచూడడానికి వివిధ సంస్థలున్నాయి – గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోను. మీ అనుమానం తీరిందా? □



మహిళా పాఠకుల శీర్షిక

ఈ కాలం పెళ్లిళ్లు

మన భారత దేశ సంస్కృతి ననుసరించి వివాహానికి అత్యంత పవిత్రత, విలువ వున్నాయి. రెండు పవిత్ర జీవితాలని కలిపి ఒకే మార్గంలో నడిపించే బంధమే వివాహం. ఈ వివాహమే రెండు జీవితాల కలయికకి,



మరు సృష్టికి పునాది.

దంపతులు ఒకరి నొకరు అర్థం చేసుకుని సహకరిస్తూ, ఒకరు సహించ లేని విషయాలు మరొకరు త్యాగం చేస్తూ, ఒకరికి అత్యంత ప్రీతి పాత్రమైనవి మరొకరు ఆదరిస్తూ— **ఆత్మీయతతో, అభిమానంతో, అనురాగంతో గడప గలిగిన దంపతులే వివాహ బంధంలోని ప్రేమామృతాన్ని చవి చూడ గలుగుతారు. అటువంటి దాంపత్యమే ఆదర్శ దాంపత్యం.**

కట్నం, లాంఛనాలు ఘనంగా తేలేదని సాధించి పోసే అత్తగార్లు వివాహ బంధానికి విలువ నివ్వకుండా పరాయి స్త్రీతో ప్రేమాయణాలు సాగించే పురుష పుంగవులు— పుట్టింటి నించీ ఆస్థి, కట్నాలు, నగలు తీసుకొచ్చామనే అహంకారంతో భర్తని హీనంగా చూసే భార్యలు వున్న కుటుంబాలలోని వివాహ బంధాలు నేతి బీరకాయలో నెయ్యి లేనట్లే ప్రేమాభిమానాలు లేకుండా మనుగడలు సాగుతూ వుంటాయి.

పూర్వ కాలం నాటి పెళ్ళిళ్ళు ఐదు రోజులు ఘనంగా ఊరేగింపులు, సరదాలు, ముచ్చట్లతో జరిగేవి. రాను రాను ధరల పెరుగుదల, ఆస్థుల తరుగుదలల కారణంగా— మూడు రోజులు, రెండు రోజులు, ఒక రోజు ఒక గంటగా మారాయి.

పాశ్చాత్య నాగరికతని సంతరించు కుంటున్న ఈ అధునాతన యుగపు యువతీ యువకులు కొందరు వివాహాలని నిముషాలలో ముగించు కుంటున్నట్లే— ఒకరి నొకరు అర్థం చేసుకోలేక, ఒకరితో ఒకరు సహకరించలేక గోరంతలు కొండంతలు చేసుకుని ఇల్లు నరక ప్రాయంగా మార్చుకుని చివరికి సహించలేక వివాహ బంధాన్ని త్రెంచేసు కుంటున్నారు. ఇటువంటి వారు మరొక భాగస్వామితో నైనా ప్రశాంతంగా మనుగడ సాగించ గలరా అన్నది సందేహాస్పదమే!

కులాంతర, మతాంతర వివాహాలు చేసుకునే వారు అనేక సమస్యలని ఎదుర్కోవలసి వస్తుంది. ఆహారం దగ్గర్నించి ప్రతీదీ సమస్యే!! అయితే దంపతుల మధ్య అనిర్వచ నీయమైన **అనురాగం, ప్రేమ, అభిమానం చోటు చేసుకున్న తరుణంలో ఆ** సమస్యలు సమస్యలుగా పరిగణింప బడవు. సంఘంలో గొప్పల కోసం, పదవుల కోసం కులాంతర, మతాంతర వివాహాలు చేసుకునే వారు అనేక సమస్యలని ఎదుర్కోలేక సంసారాన్ని నరక ప్రాయంగా మార్చుకుని విడిపోవడమో— లేక రసం లేని చెరుకు గడ నమిలినట్లు సారంలేని సంసారాన్ని గడపడమో జరుగుతుంది.

పూర్వం సమిష్టి కుటుంబాలలో పెద్దలు కొడుకుల్ని, కోడళ్ళని, కూతుళ్ళని ఒకే విధమైన ప్రేమాభిమానాలతో ఆప్యాయతలతో ఆదరించే వారు. అందుకే ఆ నాడు పెద్దలని— పిల్లలు, మనుమలు దైవ సమానులుగా తలచి గౌరవించే వారు. ఈ నాటి పెద్దలలో పక్షపాత వైఖరులు, స్వార్థాలు చోటు చేసుకుంటున్నాయి. అందుకే పిల్లలలో పెద్దల మీద గౌరవం సడలి పోతోంది. ఆ నాటి సమిష్టి కుటుంబాలలోని ఆడపడుచులు.

ఉమ్మడి కుటుంబాలు

వదినెలని తమ సహోదరిగా భావించి ఆదరించే వారు. తోటికోడళ్ళు అక్క చెల్లెళ్ళలాగే మసలుకునే వారు. అందుకే ఆ నాటి సమిష్టి కుటుంబాలు హాస్యాలతో, నవ్వులతో ఆట పాటలతో ఒకరి కొకరు సహకరించుకుంటూ ఎంతో ఆనందంగా సాగి పోయేవి. అది నిజంగా స్వర్గమే!

ఈ నాడు సమిష్టి కుటుంబాలలో ఎవరి డబ్బు వారు రహస్యంగా మూటలు కట్టుకుంటూ, కాస్త అమాయకంగా వున్న వారి దగ్గిర్నించీ గుంజాలని చూసే అత్తలు, ఆడపడుచులు, తోటి కోడళ్ళు ఎక్కువౌతున్నారు. కాస్త అమాయకంగా వుండే తోటి కోడలు చేత కష్టమైన పన్నన్నీ చేయించి తేలిగ్గా ఆషామాషీగా చేసే పన్లేవో గొప్పగా నలుగురికీ కనపడేట్లు చేసేసి తనే ఇంటెడు చాకిరీ చేసేస్తున్నట్లు నలుగురిలో గొప్పలు చెప్పుకుంటూ భోజాలు కొట్టే తోటి కోడళ్ళు వున్న చోట మిగిలిన తోటికోడళ్ళు ఆనందంగా బతకలేరు.

అభిమానాలు, ఆత్మీయతలు, సహకారాలు, పెద్దలలో సమ దృష్టి లోపించిన ఈ రోజుల్లో— అనుక్షణం ఆత్మాభిమానం దెబ్బతింటూ— దంపతులు ఏకాంతంగా గడప డానికి కష్ట సుఖాలు చెప్పుకుందుకి లేకుండా— పిల్లలకి మంచి బుద్ధులు, మంచి అలవాట్లు నేర్పించ డానికి లేకుండా— పిల్లలతో కొంత సమయాన్ని గడపడానికి కూడా లేకుండా— ఇంట్లో ప్రతీక్షణం దెప్పులు, తిట్లూ తింటూ తిన్న అన్నం వంట బట్టక బ్లడ్ ప్రెషర్‌లతో బాధపడుతూ— బైటికి వెళ్తే ఇంటద్దె లిచ్చుకో వలసి వస్తుందని డబ్బు పీనాసి తనంతో ఆత్మాభిమానం చంపుకుని ఉమ్మడి కుటుంబాలలో వుంటున్నారు కొందరు. ఇంతకన్నా వేరే నరకం వుండదు

— ఆర్. ఎస్. హైమవతి,
మదరాసు □

కూపన్
ఆంధ్ర సచిత్ర వారపత్రిక
ఈ కాలం పెళ్లిళ్లు

పంపిన వారి పేరు..

పూర్తి చిరునామా..

....

....

పిన్ కోడ్:..............................



'ఎదురింటి అమ్మాయి'లో భాగ్యరాజా, రాధిక

ఎ. ఎస్. ఆర్. రమేష్‌లతో సిద్ధరామారావు చిత్రం

మా హైదరాబాద్‌లో తీస్తున్న మొదటి చిత్రమిది. అన్నపూర్ణా, పద్మాలయా స్టూడియోలలో డిసెంబర్‌లో షూటింగ్ పూర్తవుతుంది. ఒక శ్రోత్రీయ అధికారికి [illegible] యువకునికి మధ్య జరిగే అనూహ్యమైన సంబంధము గల కథ" అన్నారు శ్రీ రాజలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ సిద్దే రామారావు. ఆయన శరత్ ప్రొడక్షన్స్ దర్శకత్వంలో

సినిమా

(42వ పేజీ తరువాయి)

నిర్మిస్తున్న ఈ సంస్థ 14వ చిత్రానికి సత్యానంద్ సంభాషణలు, చక్రవర్తి సంగీతం, సుధాకరరెడ్డి ఛాయ, సాయికుమార్ శిల్పం, డి. వెంకటరత్నం కూర్పు తెరవెనుక హంగులు.

ఉషాకిరణ్ మూవీస్ 'అమ్మ'

"ఇది మా సంస్థకు 21వ చిత్రం," అన్నారు అట్లూరి రామారావు. ఆయన నిర్మాణంలో

రామారావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి తారలు కర్త చక్రవర్తి, రేఖ, సీత, రాజ్యలక్ష్మి, వై. విజయ, పద్మిని, ఎం. వి. లక్ష్మి, శరత్‌బాబు, వేలు, సోమసుందర్, సుధాకర్, సాయికుమార్ పాత్రధారులు. ఆత్రేయ కుటుంబరావు కథకు గణేష్‌పాత్రో సంభాషణలు కర్త. ఎస్. పి. బాల సుబ్రహ్మణ్యం స్వరకల్పనలో వేటూరి గీతాలు రాశారు. ఆర్. ఎస్. కృష్ణప్రసాద్ ఛాయ, భాస్కరరాజు శిల్పం, గీతంరాజు కూర్పు నిర్వహిస్తున్నారు. "విశాఖపట్నంలో నవంబర్ 5 నుంచి 24 వరకు తొలి షెడ్యూల్, డిసెంబర్ 15 నుంచి జనవరి 10 వరకు మలిషెడ్యూల్" అని అట్లూరి రామారావు తెలిపారు.

హిందీలో 'కలెక్టరుగారి అబ్బాయి'

కలెక్టర్‌గా దిలీప్‌కుమార్, అబ్బాయిగా సంజయ్‌దత్ నటిస్తున్నారు. నాలుగు షెడ్యూళ్ళలో వచ్చే మార్చికి షూటింగ్ పూర్తవుతుంది, అన్నారు టి. గోపాల్. ఆయన దర్శకత్వంలో శ్రీ మాధవ ప్రొడక్షన్స్ అధినేత ఎ. ఎస్. ఆర్. ఆంజనేయులు నిర్మిస్తున్న ఈ చిత్రంలో నూతన్, మాధురీదీక్షిత్, కాదర్‌ఖాన్, అనుపమ్‌ఖేర్, తేజ్‌సప్రూ, గుల్షన్ గ్రోవర్, [illegible] ప్రధాన పాత్రధారులు. [illegible] మాటలు, బప్పిలహరి సంగీతం, ఎస్. గోపాలరెడ్డి ఛాయ, మహేంద్రరాజు శిల్పం, రఘు నృత్యాలు, పాండ్యన్ సంయుక్త దర్శకత్వం, నరసింహారావు- కొటల రవికుమార్ సహకార దర్శకత్వం, కోటగిరి వెంకటేశ్వరరావు కూర్పు నిర్వహిస్తున్నారు.

నా సినిమా తీయటం పూర్తి అయ్యేవరకు నువ్వు మరో నిర్మాతను కన్నెత్తి చూడటానికి వీల్లేదు, తెల్సిందా?



"చట్టంతో చదరంగం"

చట్టానికి ప్రతినిధిగా శోభన్‌బాబు. వాళ్ళ వాళ్ళనికి సన్యం, సీరియస్ కలగలసిన ఒక పాత్ర పాత్రకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. వ్యాయమే తన ఆస్తిగా అర్జున్. తల్లిగారి తల్లిగా ఒక ఆదాత్మమైన కోర్టులో శారద, చట్టాన్నెవరికీ ఆదికి పాత్రలో సుహాసిని. చదరంగంలో పావులా చట్టం ముద్ర నరిగిపోయె. ఓ విలక్షణమైన పాత్రలో శరత్‌బాబు. శోభన్‌బాబు చెల్లెలుగా రజని, తోరేన్ అపేనరిగా కల్పన. ఈ ప్రపంచాన్నే పాదాక్రాంతం చేసుకోవాలనే సంపన్నుడి ఆస్థానంగా నూతన్‌ప్రసాద్, ఆయన మంత్రిగా బాలాజీ- ఇలా ఏ పాత్ర కాపాత్ర విశిష్టంగా ఆయా తారలకు సరికొత్త ఇమేజీని కలిగించిన చేసేవిగా తయారయ్యాయి. నవంబరుకు ముత్తం షూటింగ్ పూర్తవుతుంది. దీనికి పాండిలో కూడా తీస్తున్నారు. అన్నారు వి.వి.ఎస్.ఎన్. ప్రసాద్. ఆయన నిర్మించే శ్రీకృష్ణ ప్రసన్న ఎంటర్‌ప్రైజెస్ వారి పై చిత్రంలో చిత్ర, వంగాయల, సుధా, రమాప్రభ ఇతర పాత్రధారులు. పరుచూరి సోదరుల రచన, వేటూరి గీతాలు, చక్రవర్తి సంగీతం, ఎస్. ఎస్. లాల్ నాధుల తారవృత్యాలు, సాహెబ్ సాహసాలు, జ్యోతికృష్ణప్రసాద్- శివనాగ్ సహకార దర్శకత్వం, గిరిధర్ సహాదర్శకత్వం, రామచంద్రరావు- సత్యనారాయణరాజు- మోహన్ ప్రొతక్షన్. కె. పి. సుబ్బారావు నిర్వహణలో వి. తిమ్మరాజు, టి. రామారావు సమావేశాలు. కె. మురళీమోహనరావు దర్శకుడు.

పరంజీవి, కోదండరామిరెడ్డిలతో "జేబుదొంగ"

దేశంలో అటు కల్లోలం సృష్టించిన ప్రజలను భయభ్రాంతులను చేసి, వ్యవస్థలను సమూలంగా పడగొట్టి మరో దేశానికి ఈ దేశాన్ని దాడోహం



"డాక్టర్ గారి అబ్బాయి"లో అశోక్‌కుమార్, డిస్కో శాంతి



"రాక్షసి"లో జయప్రద

చేయడం పరమ లక్ష్యమైన అతని సాహస్ని సందించడానికి పరకాయ అనే సాహస యువకుని నేయమంచ్చంత ప్రయత్నం. ఆద్యంతముగా ఉత్కంఠం కలిగించే చిత్రం," అన్నారు ఎ. కోదండరామిరెడ్డి. ఆయన దర్శకత్వంలో ఎం. అర్జునరాజు సమర్పించే ఆర్ట్ మూవీస్ వారి చిత్రానికి ఇటీవల తలకోనలో భారీ ఎత్తున పతాక సన్నివేశాలు చిత్రీకరించబడ్డాయి. చిరంజీవి, భానుప్రియ, శారద, సత్యనారాయణ, గొల్లపూడి మారుతిరావు, గిరిబాబు, కోట శ్రీనివాసరావు, కన్నడ ప్రభాకర్, రఘువరన్, అన్నపూర్ణ, సుధాకర్, కాశ్యపల్లి, హరిప్రసాద్, ప్రసాదబాబు, వీరభద్రరావు, అంథోని, ప్రసన్నకుమార్, పొట్టి శ్రీనివాస్, మాడా, గౌరి, శ్రీధర్ పాత్రధారులు. గొల్లపూడి కథకు సత్యానంద్ సంభాషణలకు, చక్రవర్తి స్వరకల్పనలో వేటూరి గీతాలు రాశారు. లోకేసింగ్ ఛాయ, భాస్కరరాజు కళ, తార నృత్యాలు, రాజు సాహసాలు, అజయ్‌కుమార్ సంయుక్త దర్శకత్వం, వెల్పన్నామె కూర్పుతో ఎం. రామలింగరాజు నిర్మాత. ☐

పాఠకుల శీర్షిక

చిన్నారి బాలల దీనగాథలు

ఈసురోమని బాలలుంటె....

పసి పిల్లలు అమాయక ప్రాణులు. కల్మషం మచ్చుకైనా లేని జీవులు. పుట్టుకతోనే పువ్వులలా పరిమళం వెదజల్లేవారు. వారి భవిష్యత్తు బంగారు బాట కావాలన్నా, ముళ్ల బాట కావాలన్నా జవాబు దారీ మాత్రం పెద్ద వాళ్లదే- పసిపిల్లలు తెలియక తప్పులు చేసినప్పుడు సరైన విధంగా దిద్దకుండా నిర్లక్ష్యం చేసినా, ఎక్కువగా వాళ్ల మనసు కష్ట పెట్టినా వాళ్ళు సంఘ విద్రోహ శక్తులుగా మారుతారు.

చిన్న పిల్లల పెరుగుదలకి ఆర్థికసౌకర్యం అవసరమే అయినా ప్రేమ, ఆప్యాయతలు తలిదండ్రులు ప్రదర్శించక పోతే దూరమవుతారు. ప్రేమ, ఆదరణ పిల్లలపై ఎంత వున్నప్పటికీ వాళ్ల అభివృద్ధికి తగిన స్తోమత లేక పోయినపుడు వాళ్ల భవిష్యత్తుకి అడ్డుగోడగా తలిదండ్రులు నిలవక తప్పదు. ఈ రెండు పరిస్థితులు పిల్లల ఎదుగు దలకి అడ్డంకులే- పిల్లలు కొంతమంది స్కూళ్లలో చదువుకుని ఖరీదైన ఆట పోటీల్లో వుల్లాసంగా కాలం గడుపుతుంటే, మరి కొంత మంది బికారులై బాల కార్మికులై, టీ కొట్టుల్లో, సైకిల్ షాపుల్లో పని చేసుకుంటూ నీరసంగా, నిరుత్సాహంగా, బ్రతుకుని నిస్సారంగా వెళ్లార్చు తున్నారు. ఈ వ్యత్యాసం తొలగి పోనంతకాలం పిల్లల్లో ఈ చీకటి వుండక తప్పదు.

"ఈసురోమని మనుషులుంటే దేశమే గతి బాగుపడునోయ్...." అన్నాడు గురజాడ మహాకవి. బాలల మనోవికాసం, సుందరమైన భవిష్యత్తు కోసం పెద్దలే పాటు పడాలి- చిన్నపిల్లల్లో కుల, మత, విభేదాలు నాటకూడదు.

ఆదర్శ వంతమైన బాల భారతాన్ని నిర్మించినప్పుడే "భారత దేశం"లో చిన్నారి బాలల దీనగాథలు విన్పించవు.

—కె. రఘుపతి, సికింద్రాబాదు




* * *

శారీరక లోపాల్ని అవహేళన చేయొద్దు!

అప్పుడే స్కూల్‌బెల్ కొట్టారు. పిల్లలందరూ పరిగెత్తుకుంటూ తమ క్లాసుల వైపు పరుగెత్తారు. స్వర్ణ కూడా తన క్లాసు వైపు పరిగెత్త సాగింది. అందరూ తన వైపు వింతగా చూడటం గమనించింది. "వీళ్ళకేం పని లేదు కాబోలు" మనసులో విసుక్కుంది.

"హాయ్ పొట్టి పాపా బాగున్నావా?" టెన్త్ క్లాస్ అమ్మాయి స్వర్ణను అడిగింది. స్వర్ణ జవాబు చెప్పకుండా ముందుకు నడిచింది. ఆరు నెలల క్రితం స్వర్ణ 6వ క్లాసు ఆ స్కూల్లో చేరింది. ఆ రోజు నుంచి ఆమెకు అవి అలవాటయి పోయాయి. కాని ఏప్పటి కప్పుడు ఆ మాటలు క్రొత్తగా అన్నట్టే అనిపించి, ఆ రోజంతా బాధపడు తూంటుంది. స్వర్ణ అందరి కంటే పొట్టిగానే వుంటుంది. అందుకని స్వర్ణ అంటే అందరికీ చులకనే, "ఏయ్ పొట్టీ, ఒక బిస్కెట్ తెచ్చి పెట్టు" మరో అమ్మాయి ఆజ్ఞాపించింది. స్వర్ణ మౌనంగా డబ్బులు తీసుకు వెళ్ళి బిస్కట్ తెచ్చి ఇచ్చింది. క్లాసులోకి వెళ్ళే సరికి టీచర్ వచ్చి హాజర్ వేస్తుంది. అందరినీ పేరు పేరునా పిలుస్తూంది. పొట్టి స్వర్ణ అని పిలిచింది. ఆ పసి హృదయంలో టీచర్ మీద చెప్పలేనంత అసహ్యం కలిగింది. ఈ టీచర్‌కి, ఎన్నిసార్లు చెప్పినా ఇంతే అనుకుంది. ఏయ్ పొట్టి నిన్నే కదా పిలిచేది అనేసరికి ప్రెజెంట్ చెప్పింది. స్కూల్ నుంచి



వస్తూంటే ప్రియ కనపడింది. ఆమె తోటి వాళ్ళ నాన్నగారు కూడా వున్నారు. ప్రియ స్వర్ణకు ఫ్రెండ్, ఆ రోజు ప్రియ స్కూల్‌కు రాలేదు. నాన్నా మా స్కూల్లో అందరి కంటే పొట్టి అని చెప్పానే ఈ అమ్మాయే అని స్వర్ణను చూపించింది. ఏమ్మా కొంచెం పొడుగు వుండ కూడదూ, ఆయన నవ్వుతూ అడిగినప్పటికి స్వర్ణ మనసులో ఆ మాటలు ముల్లులా గుచ్చు కున్నాయి. బాగుందండీ అది మన చేతుల్లో వుందా, దేవుడిచ్చిన రూపాన్ని మార్చలేం కదా అంది స్వర్ణ ఫ్రెండ్ సుజాత. స్వర్ణ దారి పొడవునా ఏడుస్తూ వచ్చింది. కొందరు పిల్లలు తెలిసో తెలియకో ఇతరులను బాధ పెడు తూంటారు. భగవంతుడా నన్ను ఇలా ఎందుకు పుట్టించావు అని స్వర్ణ అనుకోని రోజు వుండదు. సాటి మనిషిలో వున్న లోపాన్ని ఎత్తి చూపేముందు తమలో వున్న తప్పు సరిదిద్దు కోవాలని ఎందుకు ప్రయత్నించరు. ఒక్క స్వర్ణే కాదు, ఇలా ఎందరో బాలలు ఇలాంటి అవమానాలు ఎదుర్కొంటూ వుంటారు. వీటిని రూపు మాపాలంటే ఎదుటి వారిలోని లోపాలను సహృదయంతో అర్థం చేసుకునే హృదయ వైశాల్యం అందరికీ రావాలని ఆశిద్దాం.

– సి. రాధ, నెల్లూరు ☐

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

చిన్నారి బాలల దీన గాథలు

రచన పంపిన వారి పేరు : ....

పూర్తి చిరునామా : ....

....

....

పిన్‌కోడ్ :

ముస్లిమ్ భార్యకు భరణం


న్యాయపీఠం

టి. బి. రావు, ఎమ్.ఏ. ఎల్ఎల్.బి.



కేరళలో సైరాబానుకు, అబ్దుల్ గఫూర్‌కు 1980 మేనెలలో వివాహం జరిగింది. సైరాబానుకు 1981 మే నెలలో కూతురు పుట్టింది. తనను నిర్లక్ష్యం చేసినందుకు భరణం కోసం భర్త మీద సైరాబాను కసర్‌గోడ్ మెజిస్ట్రేట్ కోర్టులో దావా వేసింది. మెజిస్ట్రేట్ సైరాబాను పిటిషన్‌లో నిర్లక్ష్యం చేసినట్లు కారణాలు చూపించ లేదని పిటిషన్ కొట్టి వేశారు. సైరాబాను తెల్లిచెరి జడ్జి గారికి రివిజన్ పిటిషన్ పెట్టుకుంది. ఈ లోపల గఫూర్ 1984 అక్టోబర్ నెలలో సహీదాబేగమ్‌ని రెండవ పెళ్లి చేసుకున్నాడు. జిల్లా జడ్జి సైరాబానును కూడా గఫూర్ పోషించడానికి ఒప్పుకున్నాడు కనుక పిటిషన్ కొట్టి వేశారు. కేరళ హైకోర్టు వారు కూడా ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించారు. అయితే సైరాబాను అంతటితో ఆగలేదు. **ఈసారి** సైరాబాను సుప్రీమ్ కోర్టుకు అప్పీలు చేసుకుంది. గఫూర్ రెండవ పెళ్ళి చేసుకున్నాడు కనుక తనకు భరణం చెల్లించాలని సైరాబాను వేడుకున్నది. కాని సైరాబాను తనతో కాపురం చేయడానికి రానందువల్లనే తాను రెండవ పెళ్ళి చేసుకోవలసి వచ్చిందని గఫూర్ వాదించాడు. అంతే గాకుండా ముస్లిమ్ లా ప్రకారం తను రెండవ పెళ్ళి చేసుకోవచ్చుని, సైరాబానును కూడా పోషించడానికి సిద్ధంగా ఉన్నానని కనుక సైరాబానుకు ప్రత్యేకంగా భరణం చెల్లించనవసరం లేదని గఫూర్ వాదన.

సుప్రీమ్ కోర్టువారు గఫూర్ వాదనను తిరస్కరించారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 125 (3) సెక్షన్‌లోని వివరణ ప్రకారం భర్త రెండవ వివాహం చేసుకున్నప్పుడు మొదటి భార్యకు ప్రత్యేకంగా నివసించడానికి భరణం కోరడానికి హక్కు ఉన్నదని, ఈ హక్కు ముస్లిమ్ స్త్రీలకు కూడా ఉన్నదని కనుక సైరాబానుకు, ఆమె కుమార్తెకు గఫూర్ భరణం చెల్లించాలని సుప్రీమ్‌కోర్టు వారు 1987లో తీర్పు చెప్పారు. □



కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ



వేయిపడగలు

(గత సంచిక తరువాయి)


రంగారావు శశియు సౌధాగ్రభాగమున శయనించిరి. శశిని తెల్లనిశరీరము జ్యోత్స్నాధి దేవతవలె ఆమెను ప్రకాశింప చేసెను. రంగారావున కామెను చూచినపుడెల్ల మోహమే ఉబుకుచుండెను. రాత్రి పండ్రెండు గంటలదాక విలాసముగా కాలము గడపి దోమ తెరలలో ఇరువురును విడివిడిగా శయనించిరి. శశిని నిదుర పోయెను. రంగారావుగారికి నిదుర పట్టలేదు, పట్టకనుపోలేదు. కన్ను మూతపడును, ఏదో కనిపించి నట్లగును, మరల మెలకువ వచ్చును. రాజు కన్ను మూసెను. సరోజినీదేవి వచ్చి అతని పాదముల వద్ద నిలుచుండెను. ఆమె మెడలో పాములున్నవి. కంకణములుగా పాములున్నవి. చెవులకు కుండలములుగా చుట్టు పాములున్నవి. ఒక పెద్ద పాము శిరోవేష్టనముగా చుట్టుకొన్నది. రాజు కన్ను తెరచెను. ఎవ్వరునులేరు. దగ్గరనే వేరొక మంచము మీద శశిని తెల్ల త్రాచువలె పండుకొని ఉండెను! ఏదో ఊహించుచు మరల కన్ను మూసెను. వేణుగోపాలస్వామి కనబడినాడు. మొగమున తిరుమణి తిరుచూర్ణము ధరించినాడు. కంఠమున హాలాహలమున్నది. మెడలో పాముల హారములుగా వేసికొనెను. హారమైన పాము క్రింద చింతామణి ఉన్నది, పీతాంబరము ధరించినాడు. పీతాంబరము కుచ్చెలల మీద ఉత్తరీయము వలె ఒక సర్పము బిగించినాడు; ఇది వేణుగోపాలస్వామి మూర్తియా! హరి హరనాథమూర్తియా! సగమీయన, సగమాయనగా లేడే? రాజు మరల కనులు తెరచెను. శివజటాభాగమున మందాకినీనది కిల కిలా ధ్వనులతో నవ్విన నురుసులో చంద్ర కళావినిర్గత మధుర చంద్రికా పూరములో ఆకాశమంతయు తెల్లగా ఉండెను. ఆకాశములో మేఘములు తెల్ల తెల్లనై పాములవలె వంకర టింకరులుగా ఉండెను. అవి శివజటాభాగమున అలంకరింపబడిన సర్పములు కాబోలు! రంగారావనుకొనెను. "నాగేశ్వరరావుచేత ప్రబోధింప బడకూడ నా మనస్సు పూర్వవాసన వదలి పెట్టుట లేదు. పదేండ్లుగా ప్రతీప మార్గములనే నడచుచుంటిని. ఈ స్వప్నములు నేనింగ్లాండు పోయినప్పుడును వచ్చెను. చెన్నపురిలో గిండీ పందెములలో పాల్గొనినప్పుడును వచ్చెను. సుబ్బన్న పేట కోటలో మేడమీద పండుకొనినప్పుడును వచ్చెను. నాకీ కలలు వచ్చి ప్రయోజనములేదు. ఇవి ఎందుకు వచ్చును". రంగారావు మరల కనులు మూసెను. మరల మగతగ నిద్రవచ్చెను. కేశవశెట్టి దూరమునందు కూర్చుండి ఉండెను. ఆయన మెడలో, శిరస్సున, హస్తములయందు, నడుమున సర్పములే పెనగొని ఉండెను. కేశవశెట్టి గుణాతీతుడు. అచ్చమైన బ్రహ్మస్వరూపము. ఆయనకు కూడ పాములు చుట్టుకొనునేమో! ఆయన వద్ద నాగేశ్వరరావు నిలిచి ఉండెను. నాగేశ్వరరావును పాములు పీకుచుండెను. అతడు బాధచేత కొంకరలు పోవుచుండెను. రంగారావు కనులు తెరచెను. గాలి ఆడుటలేదు. తాను పండుకొన్న మేడపై భాగము పోక మ్రాకులు మామిడిచెట్లు వీని శిఖలకన్న ఎత్తుగా ఉండెను. రాజు చెట్లవంక చూచెను. చెట్లయాకు లాడుచున్నవి. అంత క్రిందుభాగమున గాలి ఉండి యింత పైభాగమున గాలిలేదా? రాజు మరల కనులు మూసికొనెను. కుమారుడు హరప్ప కనబడెను. అతని శరీరమంతయు నచ్చిన చుట్టముల వలె పాములు ప్రాకుచుండెను. అతడు పాములను ముద్దుపెట్టుకొనుచుండెను. పాములతని చొక్కా జేబులలో తలలుదూర్చి మరల బయటికి వచ్చుచుండెను. మరలా చూచెను. అతడు పాములవాడై సొరకాయ బుర్రతో వాని ఎదుట ఊదుచుండెను. రాజు కనులు తెరచెను. తెల్లవారు వరకును నిదురపట్టలేదు.

పదునైదవ అధ్యాయము

గ్రీష్మము ప్రళయాకారము తాల్చి మహాతపము లోలుకబోయి చుండెను. సర్వ జంతువులు మలమల మాడిపోయెను. అబ్బా! యీ గ్రీష్మమునకు తుది లేదేమో అనుకొను చుండగా ఒకనాడు హఠాత్తుగ మేఘములు పట్టి కుండపోతగా కుమ్మరించెను. మరునాడే చల్లబడెను. కాలము మారుటయే రమ్యముగా ఉన్నది. వెనుకటి దినమున గ్రీష్మర్తువు; మరునాడు వర్షర్తువు. సుఖ దుఃఖములు నట్లే! రెండు నెలలు ఘోరముగా ఎండలు కాసెను. తుపాకితో కొట్టినట్లు రోజు తిరుగు నప్పటికి చల్లని వానలు కురిసెను. కళాశాలలు మరల తెరచిరి. కిరీటి బి. ఏ. రెండవ సంవత్సరము చదువుటకు వచ్చెను. శివరావు వేసంగి సెలవులలో కొన్నాళ్ళు సుబ్బన్న పేటలో ఉన్నను, చివరి రోజులలో దేశ సంచారము చేసి వచ్చెను. ఆయన తన కెవరో మిత్రు లున్నారని, వారిని చూచుటకు పూరీ జగన్నాథము పోయి అచట నుండి రెండు మూడు పనితనము గల వస్తువులు తెచ్చెను. అందులో ఒకటి తాటియాకుల గొడుగు. అది చిన్నది. ఒక్క తాటియాకు విప్పి అంచులు మడచి కుట్టబడెను. చూచుటకు రమ్యముగ ఉన్నది. ద్రాక్షా వృక్షపత్రములతో చిన్ని చిన్ని బుట్టలు, పళ్ళెములు, విసన కఱ్ఱలు అల్లబడెను. అవియు తెచ్చెను. కిరీటిని ధర్మారావు తన యింట ఉండు మనెను. కిరీటి కాలేజి హాస్టలులో నివసించు చుండెను. కాలేజి పేటకు దక్షిణపు చివర, జాతీయ కళాశాల తూర్పు దిక్కు చివర. ధర్మారావు గృహము బ్రాహ్మణ వీధియందు-

జరిగిన కథ – 34 : రంగారావుగారు దొరసానిని వివాహం చేసుకుంటాడు. ధర్మారావు హరప్ప నాయనికి చదువు చెబుతూ ఉంటాడు. గుండేటికి వరద వచ్చి సుబ్బన్నపేటను ముంచెత్తుతుంది. గవర్నరు గారు సుబ్బన్నపేటలో పురపాలక సంఘ భవనాన్ని ప్రారంభిస్తాడు. చంద్రారెడ్డి పురపాలక సంఘ ఎన్నికలలో విజయం సాధిస్తాడు. రామేశ్వరము సినీమా హాలు కట్టిస్తాడు. జోస్యుల భార్య మంగమ్మను రామేశ్వరము లొంగదీసుకుంటాడు. శివరావు తాను కృష్ణావతారము అని అదొక ధోరణితో ఉంటాడు. దేవదాసి గిరిక ప్రతిరోజూ దేవాలయానికి పోయి స్వామిని సేవిస్తూ ఉంటుంది. జోస్యులు రామేశ్వరమును ఏమీ చేయలేక వచ్చిపోదామని అనుకుంటాడు. రామేశ్వరము మంగమ్మల వ్యవహారం ఊరంతా తెలుస్తుంది. హరప్ప దేవదాసిని చూస్తాడు. భగవంతునికి కళ్యాణోత్సవాలు ఎప్పుడెప్పుడు చేయిస్తానా అని హరప్ప అనుకుంటూ ఉంటాడు.

అనగా దేవాలయములకు తక్కిన గ్రామమునకును మధ్య భాగమున. ప్రతి దినమును కిరీటి వచ్చి ధర్మారావు ఇంట నిద్రించును. హాస్టలధికారి రాత్రులందు హాస్టలును వదలి పోరాదని శాసించును. కిరీటి ప్రతి దినమును నిరాకరించును. జాతీయ కళాశాల ప్రొద్దుననే ఏడు గంటల నుండి పదింటి వఱకు. కిరీటి ధర్మారావు లిర్వురును ప్రొద్దుననే లేచి స్నానము చేయుదురు. జాతీయ కళాశాలకు పోదురు. తొమ్మిదిన్నరకు కిరీటి కాలేజి హాస్టలునకు పోయి భోజనము చేసి కళాశాలకు పోవును. అక్కడ మొదటి గంటయే ఉండి హాజరు వేయించుకొని ధర్మారావు ఇంటికి వచ్చును. రెండు గంటల దాకా ఇర్వురు కలిసి ఉందురు. అప్పుడప్పుడు శివరావు గూడ వచ్చును. రెండు గంటలకు కిరీటి కాలేజీకి పోవును. ధర్మారావు కళాశాలకు పోవును. కళాశాల వదలి పెట్టినంతనే ధర్మారావు మరల కాలేజీకి ప్రయాణము. ఇద్దరును కలసి పొలాల మీదికి పోదురు. గుండేటి వద్దకు పోదురు. మరల కళాశాల వెనుక మెట్టచేల మీదికి పోదురు. హాస్టలునకు పోయి కిరీటి భోజనము చేయువరకు ధర్మారావు కూర్చుండును. కలసి ధర్మారావు ఇంటికి వత్తురు. అచ్చట రేనడిజాము వఱకు కబుర్లు, అప్పుడు నిద్ర. ఇది వారి దినచర్య.



ఒకనాడు శివరావు ధర్మారావును చూచి, "నేను జగన్నాథ మెందుకు పోతినో తెలియునా? అక్కడ నా పూర్వకాల మిత్రు డొకడున్నాడు. మే మిద్దఱమును చెన్న నగరములో సహాధ్యాయులము. చిన్నప్పు డిద్దరమును కలసి ఉండెడి వారము. క్లాసులో అందఱకన్న నేను తెలివి గలవాడను. అతనికి చిన్నప్పటి నుండియు చదువు రాదు; ఉపాధ్యాయుడు వాని నెప్పుడును బెంచి మీద నిలుచుండ పెట్టెడి వాడు. తలిదండ్రులు నా దగ్గఱకు పోయి చదువు కొనుమని వానికి చెప్పగా అతడు నా వద్దకు వచ్చెడి వాడు. వచ్చి అల్లరి చేయుటయే కాని తాను చదివెడివాడు కాడు. నన్ను చదువ నిచ్చెడి వాడు కాడు. పరీక్షలలో సరిగా నా వెనుక బెంచీ మీద కూర్చుండును. నేనొక కాగితము వ్రాసినంతనే, "శివా! శివా! ఆ కాగిత మిటుతే" అని వెనుక నుండి పోరును. "ఒరేయి! నేను వ్రాసిన దంతయు నీ వెక్కించినచో పట్టు కొందురు. చివరకు ప్రాణము మీదికి వచ్చును" అని నే నందును. అతడు "మేమును నీ అంత తెలివికల వారమే నోయి. మార్చి వ్రాసికొన గలము. కాగిత మీయరా, అనగా వెధవనిక్కు పోయెద వేమి?" ప్రతి పరీక్షకు ఇదియే గోల. ప్రతి పరీక్షయు వాడును పరీక్షయగు చుండెను. నేను అగుచుంటిని. స్కూలు ఫైనలులో నిక పచ్చువఱకు పబ్లికు పరీక్షలో ఈ ఆట సాగినది కాదు. తక్కడ తిష్ట వేసెను. రెండు మూడేండ్లు నెమరు వేసి చదువుడక మానివేసెను. తండ్రి సంపాదించినాడు కనుక చక్కగా సాగుచున్నది. నే నతనిని పోయి చూచి వచ్చితిని. పాతిక యేండ్ల యీ మధ్య మేము మఱల కలసి కొనలేదు. అతడు నా యందు పూర్వము వలెనే ఉండును. నేను కనపడి నంతనే అతడు "ఒరే శివా! మన మిద్దరము ఒక

ఉపాధ్యాయుని మీద కోపము వచ్చి అతని మీద ఏవో వ్రాసి గోడలకు కాగితము లంటించితిమి, జ్ఞాపక మున్నదా?" అనెను. అతడు మా బాల్య క్రీడలు మఱచిపోలేదు. నే నా ఊరునకు పోయి మహానంద మనుభవించితిని. నాకీ అనుభూతి కలిగినప్పటి నుండియు నేను దుఃఖమును సహించ లేకున్నాను. దుఃఖము పొందువారి వంకైనా చూడలేను. నా కెప్పుడు ఆనందమే కావలయును. అవును! నేను భగవంతుడ నైతినాయెను. భగవంతుడే సచ్చిదానంద స్వరూపుడు.... ధర్మారావు "ఆ ఆనంద మిది కాదు. తైత్తిరీయోపనిషత్తు చదివినచో తెలియును" అనెను. శివరావు, "అవును, నే నీ పదియేండ్లలో పుగా సర్వమత గ్రంథములు చదువ వలయును. ఉపనిషత్తులు, వేదములు, ఖురాను, బైబిలు, ధర్మపదము, జెండ్ అవెష్టా సర్వ మత గ్రంథములు అవలోకించి అన్ని మతములలో ఉన్న మంచియుం దీసి నా మతముగా నిలబెట్టెదన. నేను వరుసగా దశావతారము లెత్తు చున్నాను. ఇప్పుడు వామనావతారము వరకు వచ్చినది. అదిగో నా తాటి యాకుల గొడుగు. చూచితిరా! అది వామనావతార చిహ్నము. నారాయణరావే బలి చక్రవర్తి. జాతీయ విద్య రాక్షసుల వశమై పోయినది. కేశవరావు గారు మహేంద్రుడు. ఆయన వద్ద నుండి యీ బలి యీ స్వర్గమును లాగుకొనెను. నే నీ బలి నణగ్రతొక్కి యీ రాజ్యము మఱల ఇంద్ర హస్తగతము చేసెదను. జాతీయ విద్యా దర్శములు నిలబెట్టుటయే స్వర్గమును మరల కేశవరావు గారి కిచ్చినట్లు" అనెను. ధర్మారావు "లెడ్‌బీటరు మీ రపచారము కాదన్నాడు గదా!" అనెను. శివరావు: లెడ్ బీటరుకు చెన్నపుర ... సరిగా ఉత్తరము వ్రాసి ఉందరు. ఆయన ఆస్ట్రేలియా నుండి యీ సంవత్సరాంతమునకు తిరిగి వచ్చును. అప్పు డాయనతో నేను ముఖతః మాట్లాడికాని ఏ సంగతియు చెప్పలేను. అతనికి వీరు సరిగా తెలియ జేం ఉందరు" అనెను.

ధర్మారావు సాయంకాలము కిరీటిని కలసికొని యిర్వురును గుండేటి వంతెన దగ్గరకు పోయిరి. నేటి సుబ్బన్నపేట వంతెన వరకును వ్యాపించి యున్నది. గుండేటి వఱదలు మూడు నాలు గేండ్లు అయినది వచ్చి. తరువాత అచ్చట గృహ నిర్మాణము చేసిన వారికి గుండేరు వరదలుగా వచ్చుననియే తెలియదు. అచ్చట ఇండ్లు కట్టిన వారందరును సినిమా సేవకులు, మోటారు నడుపు వాండ్రు, బీడీల ధుకాణము పెట్టిన వాండ్రు, పనియు పాటయులేక తిరుగు వాండ్రు. వంతెన దాటి చాల దూరము పోయినగాని పేటలో ఇప్పుడు నిర్జనముగా ఉండదు. పూర్వము వంతెన వద్దనే నిర్జనముగా ఉండెడిది. వంతెన దాటిన తరువాత ఒక మైలు దూరము పోయిరి. అచ్చట ఇరువురును రోడ్డు కుడి ప్రక్క కూర్చుండిరి. కిరీటి కొంచెము సేపు కూర్చుండి, లేచి, అటు నిటు తిరుగు చుండెను. కనపడిన పచ్చి ఆకును త్రుంచి నోటిలో వేసికొని రుచి చూచును. మఱికొన్ని మొక్కలు పరిశీలించును. తా నెఱుగని క్రొత్త మొక్క కన్పించినచో "అన్నా! ఇది యేమి?"టని అడుగును. కొన్ని మొక్కలు చిన్న చిన్న నక్షత్రముల వంటి పూవులు పూచి చూచుటకు నేత్రానంద కరముగ ఉండెను. మఱికొంత సేపటికి లేచి ఇద్దరును కలసి అచ్చట ఒక పెద్ద కంచె ఉండగా ఆ కంచె వెంట నడువ జొచ్చిరి. కిరీటి ఒక చోట వంగి ఒక ఎముక తీసి చేత పుచ్చుకొనెను. "ఇది ఏమి ఎముక? ఏ మృగముదో వెన్నెముక. అంత పెద్ద వెన్నెముక గల మృగ మేదై ఉండును?" అనెను. ధర్మారావు మాట్లాడ లేదు. కిరీటి మఱల "పూర్వ మీ స్థల మంతయు అడవులుగా ఉండెడి దంటివి గదా? ఈ పేట పూర్వము జమీందారులు గొప్ప వేటకాండ్రని చెప్పితివి. ఇది పెద్ద పులిదో, ఏదైన మరొకపెద్ద వన్య మృగముదో!" అనెను.

ధర్మారావు: పెద్దపులి కింత లావు వెన్నెముకవూస ఉండదు.


కిరీటి: "అయినచో ఏనుగు దేమో! ఏనుగులను వేటాడి చంపరు గదా! ఒకవేళ ఏదైన చచ్చిన యేనుగును తెచ్చి యిచ్చట పూడ్చి పెట్టిరేమో! కాల క్రమేణ త్వఙ్మాంసమజ్జాస్థులు నేల తినగా ఈ బొమికలు మిగిలి ఉండును. నక్కలు వానిని త్రవ్వి ఉండును.

ధర్మారావు పరధ్యానముగా ఉండెను.

కిరీటి: ఈ ఏనుగు పట్టపు టేనుగు కావలయును లేకపోయిన ఇంత శ్రద్ధగా తెచ్చి పాతిపెట్టరు.

ధర్మారావు కన్నులలో నీరు తిరిగెను.

కిరీటి: "నీ వేల ఏడ్చుచున్నా"వని అడిగెను.



ధర్మారావు: "ఛీఛీ! నే నేడ్చుట యేమిటి? ఈ తుమ్మ పూవులు చూచితివా? ఈ వృక్ష మన్నిటికన్న నికృష్టమైనది. ఇది కట్టెలకు తప్ప మఱి ఎందులకును పనికి రాదు. నాగటిదుంపలు, తలుపు చెక్కలుగా కూడ చేయుదురు గాని వంట చెఱకునకే ఎక్కువ వినియోగింతురు. అందులో అశుభ కార్యముల కీ వంటచెఱకు శ్రేష్ఠమైనది. దీని నిండ ఉన్న ముండ్లకుతోడు దీని పూవులను చూచినచో డోకు వచ్చును. పసుపుపచ్చని సన్నని దారములు చిన్న ఉండగా చుట్టినట్లుండి ఏదో చెడ్డ వాసన వేయును. ఆ పూలకు తోడు పుప్పొడి. అది వచ్చి నా కన్నులలో కొట్టుకొనెను–

కిరీటి: "పుప్పొడి నీ కన్నులలో పడియున్నందుకు పెద్ద కథ చెప్పితివి" అనెను. ఈ లోపుగా కిరీటి ఆ బొమిక పాఱవేసి దాని ప్రస్తావనయే మఱచిపోయి మఱల నడుచు చుండెను.

ప్రొద్దు క్రుంకినది. కాని నాలుగైదు రోజుల నుండి వర్షములేక నేల కొంచె మెండినది. కాని పచ్చిగానే ఉన్నది. ఇద్దరు ఒక చోట కూర్చుంద మనుకొన్నారు. ఆకాశమున మేఘములు కమ్ముకొని ఉన్నవి. ఉఱుము చున్నవి.

కిరీటి: "వాన వచ్చునేమో! యింటికి పోదమా! వానకు తడిసి పోదు" మనెను.

ధర్మా: "వానలో తడియుట మంచిదే! దానినే దివ్యస్నాన మందురు. కూర్చుండుము. కాసేపు మాట్లాడు కొని పోదము.

కిరీటి: చీకటి పడుచున్నది.

ధర్మారావు కిరీటి చేయి గుంజి కూర్చుండపెట్టెను.

ధర్మా: ఇప్పుడు నీ ప్రణయకథ ఏమాత్రము దూరము వచ్చినది? ప్రణయ కథ అనినతోడనే కిరీటి సాయం కాలము లందు వేసగినాటి శిరీష పత్రము వలె వాడిపోయెను. ధర్మారావు మఱల ప్రశ్నించెను.

కిరీటి: అట్లే ఉన్నది. నేనీ సంవత్సరము పరీక్ష ప్యాసైనచో మా మామ అంగీకరించ వచ్చును. మా



13

కృష్ణమనాయుడు

నూజివీడు జమీందారులకీ, మా కుటుంబానికీ అనాడు ఒక చిత్రమయిన దగ్గరితనముండేది. నూజివీడు జమీందారులలో శ్రీ రాజా రంగయ్యప్పారావు గారొక విశిష్టమైన వ్యక్తి. ఆయన గొప్ప పరాక్రమశాలి.


ఒకసారి ఆయన అడివిలో వేట కెళ్ళినప్పుడు మనిషిని తినడానికి అలవాటుపడిన ఒక పులి, హటాత్తుగా వెనకనించి ఆయన మీద కురికిందట. ఈయన తాళ ప్రమాణ దేహుడు. ఆ పులి ఈయన రెండు బుజాల మీదా ముందరి కాళ్ళు వేసి, నోటితో మెడ పట్టుకోబోయిందట. వెనక నున్న దానిని వెనక ఉన్నట్టుగానే, రెండు చేతుల్తో దాని మెడని కత్తెర పట్టుపట్టి, దాని నోటికి తన మెడ అందనివ్వకుండా, మెరుపు వేగంతో దానిని ముందరికి గుంజి, పిఱ్ఱేరు గంతుతో వెల్లకిలా పడేసి దానిని చాకుతో పొడిచి చంపాడట...

కృష్ణమనాయడి తండ్రి అయిన హరప్పనాయడి గురించి చెపుతూ ఈ కథే రాసాడు మా నాయనగారు, వేయిపడగలులో.

ఈ రాజారంగయ్యప్పారావు గారి పేరు మీదనే ఎస్. ఆర్. ఆర్. కాలేజీ వెలిసింది విజయవాడలో. ఈ రంగయ్యప్పారావు గారి కుమారుడు శ్రీ వేంకటాద్రి అప్పారావుగారు. ఈయన కుమారుడు ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ చేసిన ఎమ్. ఆర్. అప్పారావు.

వేంకటాద్రి అప్పారావుగారు గొప్ప ఉదార పురుషుడు. ప్రజలు భావించే జమీందారీ దుర్లక్షణాలు ఒక్కటి కూడా ఉన్నవాడు కాదట ఆయన. జమీందారీ భూముల్లో పుల్లలు కట్టెలు ఏరుకునే పేదవారి మీద "పుల్లరి" అనే చిన్న పన్ను ఉండేదిట. అది ఆయన జమీలో అమలులో ఉండేది కాదట.

ఒకసారి, ఊళ్ళోని కొందరు అల్లరి పిల్లలు, జమిందారుగారి మామిడి తోటలో పడి కాయలన్నీ కోసేస్తూంటే, కాపలావాళ్ళు పట్టుకుని, వేంకటాద్రి అప్పారావు గారి ముందు వారిని హాజరుపరిచారు. "శిక్ష ఏమి"టంటే "బండకొయ్య వెయ్య"న్నారు.



ఆయన నవ్వి, వంటవాడి చేత జిలేబీలు, లడ్లు చేయించి, పిల్లలు ముందు పెట్టించాడు. "ఎవడు ఇందులో అందరికన్నా తక్కువ తింటాడో వాడికి శిక్ష" అన్నాడట. అందరూ కలిసి ముక్కూ నోటా కుక్కుకున్నా పళ్ళెంలో సగం ఖాళీ కాలేదు. "ఈ మాత్రం తినలేని చవటలు! ఎందుకురా మీ మొహాలికి: అంత అల్లరి? ఫొండి" అని అన్నాడట.

శ్రీ వేంకటాద్రి అప్పారావుగారు పిల్లలు తలొంచుకుని పోతూంటే, "ఆగండి, ఆ మిగిలిన జిలేబీలు కూడా తీసుకుపోయి, మిగిలిన చవటలకి పంచండి" అన్నాడట. ఆ తర్వాత మళ్ళీ ఆ పిల్లలు ఈ మామిడి తోట వైపు చూస్తే ఒట్టు. అంతటి మహా వ్యక్తి ఆ వేంకటాద్రి అప్పారావుగారు. "జమీందారంటే ఆయనే జమీందారు" అనేవాడు మా నాయనగారు.

ఈ కథ వెంకటాద్రి .అప్పారావుగారి గురించి చెప్పినట్టు గుర్తు. కాకపోతే ధర్మప్పారావుగారి గురించైనా కావచ్చు. ఆ ధర్మప్పారావుగారు కాశీ నుంచి రామేశ్వరం వరకు ప్రసిద్ధి చెందిన గొప్పదాత.

ఆయనా, మరికొందరు ఆయన పూర్వులూ కలిస్తే కృష్ణమనాయడు పాత్ర సృష్టింపబడ్డది. పేరైతే తెలీదుగాని నాకు, చల్లపల్లి జమీందార్లలో ఒకాయన నాధారం చేసుకుని రంగారావు పాత్ర మలచబడింది. శ్రీ వేంకటాద్రి అప్పారావుగారు 1974-75 ప్రాంతాల్లో పోయినట్టున్నారు. ఆయన గురించి అప్పట్లో "గోలోకవాసి" అని ఒక చిన్న పద్య కావ్యం వ్రాశారు మా నాయనగారు.

(ఇంకా ఉంది)

- విశ్వనాథ పావనిశాస్త్రి

తల్లి ఉన్నది గదా! ఆమె యిప్పుడు నెల కొకసారి మా మామగా రింటికి పోయి వచ్చు చుండును. శశితో మాట్లాడు చుండును. శశి ప్రతి శుక్రవారమును దేవీపూజ చేయునట! ఏదో దేవీ మంత్ర ముపదేశమై ఆ మంత్రము జపించు చుండునట! ఏకాదశి, అమావాస్యల నాడు ఉపవాస ముండును. శనివారము నాటి రాత్రి భోజనము చేయదట. "ఇన్ని వ్రతములు దేనికే" అని అడిగిన, "మా బావను పెండ్లి అడుట"కని చెప్పునట. అన్నా! నాకు పెండ్లి యైనను కాకపోయినను సరే! అట్టి స్త్రీ రత్నము నా యం దంత ప్రేమ కలిగి ఉన్న దనుటయే నా జీవితమునకు శిఖర మెత్తినట్లు. తరువాత నే నెన్నిసార్లో ఆమెకు జాబులు పంపించ వలెనని చూచితిని, ఆ జాబులు తీసికొని వెళ్ళు వారెవరును లేకపోయిరి."

ధర్మారావు: పూజారి ముసలమ్మ లేదా?

కిరీటి: మా మామ యిప్పుడు గుంటూరు నుండి బాపట్లకు మార్చబడెను.

ధర్మారావు: జాబు లెందుకు ఒక్క ఏడాది ఆగినచో ముందునాటి కీ జాబు లన్నియు ఆమె చెక్కిళ్ళ మీదనే వ్రాయ వచ్చును.

కిరీటి: అన్నా! పెండ్లి అగునందువా? నీవు నన్నాశీర్వ దించుము.

ధర్మా: అమ్మ మామగారి యింటికి ప్రతి నెల రాకపోకలు చేయుచునే ఉండె నాయెను. వారు మాత్రము బంధుత్వము త్రెంచుకొని అడవుల వెంటబడ పోవుదురా యేమి? అందులో నీవు బి. ఏ. ప్యాసవుదువు, మన్మథుని వంటి వాడవు. నీ కిచ్చుకొనక ఆ పిల్ల నెవరి కిచ్చెదరు? ఒకడు జాంబవంతుడు. ఒకడు నీలుడు. మఱియొకడు సుషేణుడు. ఈ కోతిగాండ్రకు, భల్లూకపుగాండ్రకు ఇచ్చి మీ మామ ఏమి బుద్ధిపోయిన వాడా– కూతురు దుఃఖాశ్రువులు చూచి మురియుటకు? ఆ పిల్ల నీదే! కాల వ్యవధి కలదు– కిరీటి ఒక మహర్షి ఆశీర్వదించినట్లు సంతోషించెను. ధర్మారా వంతటి మహాకవి అనిన తరువాత అట్లు కాకపోవునా? కవులమోఘ వచస్కులు. వారి వాక్కులు జరిగి తీరును. అట్లయినచో కిరటియు కవియే. అతడు శశిరేఖా ప్రణయగీతములని తన అనుభవ మంతయు తన ప్రేమ అంతయు కవిత్వ రూపమున వ్రాసెను. అతని కవితా పద్ధతి బహురమ్య తరమై అతడు పోయిన మార్గమున అతడే ప్రభువన్నట్లు తోచును.

ఇరువురును లేచి ఊరిలోనికి బయలు దేఱిరి. దూరముగా ఎడమ వైపున రైలువచ్చు చుండెను.

కిరీటి: అప్పుడే ఎనిమిది గంటలైనదే!"

ధర్మారావు: "నీవు నీ ప్రణయకథ తేలనిత్తువా? చెప్పినదే చెప్పి పునరుక్తి దోషము తెత్తువు. ఈ దోషము నీ రచనయందు లేదు. నీవు మాట్లాడుట యం దున్నది. అదియైనను తక్కిన విషయములు మాటాడు నప్పు డుండదు."

ఇర్వురును కలసి గ్రామములోనికి బయలు వెడలిరి. కొంచెము తుప్పర పడు చుండెను. కాలేజీ పద్దకు వచ్చు వఱకును తుప్పర తుప్పరగానే ఉన్నది. "ఇక వాన కురిసినను ఫరవా లేదు!" అని కిరటి అనెను.

ధర్మా: అసలింక కురియనే కురియదు. మఱల రాత్రి రెప్పుడైన కురియునేమో కాని.

కిరీటి: ఒక వేళ ఇప్పుడు కురిసినను పంకజమ్మ

గారి యింటికి పోవచ్చును.

ధర్మా: కాలేజీయే ఉన్నది గదా!

కిరీటి: పంకజమ్మ గారి కూతురు శ్యామల చదువు చున్నదా?

ధర్మారావు: నీవు వారి నెట్లెఱుగుదువు?

కిరీటి: వీరి దసలు నెల్లూరే కదా!

ధర్మా: ఆఁ! చదువుచునే ఉన్నది. కళాశాలలో కుమారస్వామి అని ఒక పేద బ్రాహ్మణ విద్యార్థి ఉన్నాడు. అతడును శ్యామలయు పరస్పరము ప్రణయ లేఖలు వ్రాసికొనిరి. ఈ లేఖలు వ్రాసికొనుట సంవత్సరము నుండి జరుగు చున్నదట. అది మొన్న బయటికి వచ్చినది. కళాశాలలో ఇట్టిపని జరిగినదని కళాశాల మర్యాదకు భంగమగు నేమోనని శివరావుగారు పంకజమ్మ గారితో మాట్లాడిరి. పంకజమ్మ గారు ప్రథమమున కోపించినను తరువాత శాంతించినట్లే తోచినది. ఆమె కూతును కోపించి కుమారస్వామిని తమ యింటికి రావద్దని శాసించినదట. శ్యామల రెండు మూన్నాళ్ళు తల్లి కెదురు తిరిగి అన్నము తినలేదు. అందుచే పంకజమ్మ గారు మఱల కుమారస్వామిని రానిచ్చు చుండెను. పంకజమ్మ గారికి కుమారస్వామి పేదవాడన్న అభ్యంతరమే కానీ మఱొక అభ్యంతరము లేదు. ఆమెయు కూతునకు బ్రాహ్మణు నెవని నైనను తెచ్చి చేయవలయు ననియే ఉన్నది. ఇప్పుడు కుమారస్వామి వారి యింటికి రాకపోకలు చేయు చుండెను.

కిరీటి: కుమారస్వామి అనగా ఆ ఎఱ్ఱని బక్కపలుచని కుఱ్ఱవాడేనా? ఆ రోజున ఎంకి పాటలు పాడెను!

ధర్మా: అతడే.

కిరీటి: పంకజమ్మ గారిని నీ వెఱుగుదువా?

ధర్మా: కొద్దిగా ఎఱుగుదును. ఒకటి రెండు సార్లు కళాశాలకు వచ్చినది. వారి పొలము లన్నియు ఇందాక మనము కూర్చున్న స్థలమునకు పడమటగా ఉండును. రైలురోడ్డు నానుకొని ఉండును. రెండు వందల ఎకరము లున్నవట. అవి అన్నియు ఆమె భర్త "సముద్వారు"గా ఉన్నప్పుడు లెక్క లడ్డదిడ్డముగా వ్రాసి కృష్ణమనాయని గికురించి నవే. ఆయన అయిదా ఱేండ్ల క్రిందట ఆ కాగిత ములు బయట పెట్టి పొలములు స్వాధీనపఱచు కొనుటకు వచ్చినప్పుడు నాగేశ్వరరావుగా రడ్డు తగిలెను. వ్యవహారము హైకోర్టు దాక పోయి రెడ్డి పక్షమే అయ్యెను. రామిరెడ్డి మంచి తెలివిగలవాడు.

కిరీటి: తెలివి కలవాడు కనుకనే పంకజమ్మను పెండ్లాడెను. రామిరెడ్డికి మాకు దూరపు చుట్టరిక ములు కలవు. రామిరెడ్డి మొదట ఏమియు లేనివాడు. తరువాత తాతగారే రామిరెడ్డికి సముద్వారీ వేయించిరి. నెల్లూరు వైపున జమీందారుకు నాలుగై దూళ్ళున్నవి. వాని మీద రామిరెడ్డికి సముద్వారీ యిచ్చిరి. ఆయన కప్పుడు నెలకు పదునేను రూపాయల జీతమట. ఆయన అప్పుడప్పుడు సుబ్బన్న పేటకు వచ్చు చుండును. ఎప్పుడో కృష్ణమనాయని బోల్తా కొట్టించి, రాజ్యమునకు తానేదో మేలు చేసినట్లు కనపఱచి యీ రెండు వందల ఎకరములును తన పేర వ్రాయించు కొనెను. ఆ పొల మేమైనను మంచిదేనా?

ధర్మా: మునుపు వట్టిబీడు. కాలువ నీరు క్రమముగా చుట్టుపట్ల పొలము పల్లము చేసి సాగుచేయు చుండిరి. రామిరెడ్డి యీ రెండు వందల ఎకరములన్ను మాగాని చేయవలయు ననియే యిచ్చుటికి వచ్చెను. కాని పాప మాయుర్దాయము లేక చనిపోయెను. ఇప్పుడు పంకజమ్మ గారు దాని నంతయు బాగు చేయ వలయు ననియే ప్రయత్నము చేయుచున్నది.

కిరీటి: వారికి చాల అప్పు లున్నవి. నెల్లూరులో మఱి కొంత ఆస్తి ఉన్నది. ఆ ఆస్తి పంకజమ్మ గారిది. అప్పులు తీరినను మఱికొంత ఆస్తి మిగల వచ్చును.

ధర్మా: పంకజమ్మ అస లెవరు?

కిరీటి: ఈమె తల్లి రోహిణమ్మ గారు. తండ్రి కైలాసపతి గారు. కైలాసపతి చిన్నప్పుడే క్రైస్తవులలో కలిసెను. వారు పుదూరు ద్రావిడులు.

ధర్మా: అల్లాడి కృష్ణస్వామయ్యరు గారు, వేదము వేంకటరాయ శాస్త్రిగారు మొదలైన వారు పుదూరు ద్రావిడులేనట! ఆ ద్రావిడు లందఱును చాల బుద్ధి కుశలురట కదా!

కిరీటి: అవునని చెప్పుదురు. కైలాసపతి వెంటనే రోహిణమ్మ గారును మతము పుచ్చుకొన్నెను, వారికి పంకజమ్మ గారొకతియే కూతురు. తరువాత కైలాసపతి ఏదో మంచి ఉద్యోగము చేసెను. అందులో కొంత ధనము సంపాదించి అది కూతురు పేర వ్రాసెను. చివరి దినములలో కైలాసపతికి క్రైస్తవ మతము మీద నిరాదరణ కలిగెను. పైకి వారు తమలో భేదములు లేవనియు, అందఱము ఒకటియే అనియు చెప్పుచురు. క్రొత్తలోన చచ్చినన్ని శాఖలు, యూరోపియనులకు ఒక చర్చి. హిందూ దేశస్థులైన క్రైస్తవుల కొక చర్చి. వీరిని తెల్లవారు దగ్గరకు రానీయరు. వీరు కలసి మెలసి తిరిగినచో తెల్లవారు తమ జాతి గౌరవము భ్రంశము నొందు ననుకొందురట. కైలాసపతి కిది నచ్చలేదు. పైని దివ్యమైన తన బ్రాహ్మణ మతము. పోయినదని దుఃఖించ మొదలు పెట్టెను. మఱల బ్రాహ్మణుల లోనికి రావలయునని ఆయన ఊహ. కాని అట్లు జరుపుటకు వీలులేక పోయెను. అతడు గ్రామములో నున్న తమ బంధువుల వద్దకు పోయి మాటాడు





చుందును. అతడు మాట్లాడుచు "మనము మనము బ్రాహ్మణులము; ఈ క్రైస్తవులను నమ్మరాదోయి" అను చుండెడి వాడు. "వారేఱు దాటి తెప్ప తగుల వేయుదురు. తమ పని అయినంతనే మనుజులను తిరస్కరింతురు. వారి కెంత సేపటికిని తమ మతములోనికి క్రొత్త వారిని చేర్చుకొన వలయుననియే తప్ప వారికి సమాన గౌరవ మీయవలయునని కాని, యితర మతములలో ఉన్న వారు కూడ మనుషులే అని కాని ఉండదు." అనుచుండెడి వాడు. ఆయనకు కందిపచ్చడి చాల యిష్టము. ఆయన బ్రాహ్మణ గృహములకు పోయి, "అమ్మాయీ! కొంచెము కంది పచ్చడి చేసి పెట్టుము. తిని చాల రోజులైనదమ్మా!" అనెడి వాడట. ఆయనకు విద్యార్థులందరు కందిపచ్చడి అని పేరు పెట్టిరి. ఆయన బిళ్ళ గోచీ పెట్టి బట్టలు కట్టెడు వాడు. శిరమున గోష్పాదమంత జుట్టు, అచ్చముగా వైదిక బ్రాహ్మణుని వలె ఉండెడి వాడు. పంకజమ్మ వారికి మతములో కలియక ముందే పుట్టెను. అప్పటి కీమె యేడాది పిల్ల. పాపము! వారు క్రైస్తవ మతములో కలసిన తరువాత, "అయ్యో! బ్రాహ్మణమైన వంశము కర్మ భ్రష్టత లోనికి తెచ్చితిమే" అని దుఃఖించిరి. తమకు కలిగిన శిశువులు క్రైస్తవులై పోదురు. వారికి పెండ్లి ఆడుటకు మతాంతరులైన బ్రాహ్మణులు దొరకరు. తమ వంశములో నాంగిరసాది మహర్షుల రక్తముతో కలసి నీచ రక్తములు ప్రవహించుట కిష్టములేక అతడు నాటి నుండి సంసారము చేయుట మానివేసెను. ఆ జీవి పాపమెంత దుఃఖించెనో? చివరి రోజులలో ఆయన క్రైస్తవ మతమును పరిత్యజించి ఆర్య సమాజములో చేరెను. అదీ ఆర్య సమాజము నందు గౌరవ ముండి కాదు. మఱియు క్రైస్తవము గాకుండ నుండనని, పంకజమ్మ గారికి సంఘ సంస్కార వివాహములు చేసికొనుట కిచ్చగించు బ్రాహ్మణవరుని తెత్తుమని చాల ప్రయత్నించెను. అది కుదర లేదు. రామిరెడ్డి మంచి ధనాశాపరుడు; ఎచ్చటనైనను ధన లాభము కలుగుచున్న దనగా ఏదియైనను చేసెడివాడు. కైలాసపతికి పది పదునైదు వేలు ధనము నిలువ ఉన్నది. పది పదనొకం డెకరముల పొల మున్నది. అది అంతయు పంకజమ్మకు వచ్చునని అతనికి తెలియును. వారిపుడు క్రైస్తవులు కూడ కాదు. బ్రాహ్మణ స్త్రీ. సర్వము బాగున్నదని రెడ్డి పాచిక వేసెను, అది పాఱినది. కైలాసపతి కిష్టము లేదు. కాని పంకజమ్మకు రామిరెడ్డికి కల సంబంధము గ్రామ మంతయు తెలిసి పోయెను. ఆయన అంగీకరించక తప్పక వచ్చెను. వారికి పెండ్లి యైనది, కైలాసపతి మరణించెను. రోహిణమ్మ గారు కూడ ఆ మఱు సంవత్సరమే చనిపోయినది.

ఇ·వేమన·పద్యాలు



పరమ యోగులంచు పరము జేరగలేని
మాయ జనుల కెట్లు మంచిగల్గు
వేషములను విడిచి విహరించుటే ముక్తి
విశ్వదాభిరామ వినురవేమ.

తరువాత వారీ గ్రామము వచ్చిరి.

ధర్మా: ఉద్వేగమంతటి దేదియు కాదు. అందులో పై మెఱుపుకల ప్రతి విషయము నందును అల్ప సంస్కారము గల బుద్ధి భ్రాంతి పొందును. మన మత మెంత కఠిన మతమో కాని, ఒకసారి చేసిన తప్పును ఘర్దుకొన నీయదు.

కిరీటి: అది సృష్టి ధర్మము. కఠినముగా శాసించు రాజేమి చేయును? ఒక ఉద్యోగి ఎడల ఒక దోషము కలిగెనేని, అది కారణముగా వానిని మఱల ఉద్యోగమునకు రానీయకుండ శిక్షించుట లేదా? ఇవియే మత విషయమున జరుగునేని కాఠిన్య మందురు.

ధర్మా: మన మిచ్చట నిలుచుండి ఎంతసేపిట్లు మాటాడుట? ఇద్దఱమును మంచి తెలివి కల వారము. ఇచట నిలుచుండి మాట్లాడు చుంటిమని యింతసేపు నీకు తెలియ లేదు. నాకును తెలియ లేదు. అప్పుడే రాత్రి పది గంటలైనది. నీవు హాస్టలు లోనికి పోయి అన్నము తిని రమ్ము.

కిరీటి: ఇంక ఆ బ్రాహ్మణు డన్నము పెట్టడు. అతడు తలుపు వేసి లేచి పోవును.

ధర్మా: మా యింటికి రా, పోదము; అరుంధతి ఆవకాయ కారము వేసి పెట్టును. తిందువు గాని.

(ఇంకాఉంది)

ఆటలు - అద్భుతాలు



వారఫలం

4-12-1987 శుక్రవారం నుండి 10-12-1987 గురువారం వరకు

★ **మేషం:** మీకు అనుకూలమైన అనేక గ్రహ మార్పులు రానే వచ్చాయి, మంచిదేగా! మీరు రచయిత అయిన మేలు, పత్రికాధిపతులా మరీ మేలు. విద్యావేత్తలా అనుకూలం. వ్యాపారస్తులా చెప్పరాని మేలు. స్త్రీలకు : ఆదాయం, ఆరోగ్య వృద్ధి.

★ **వృషభం:** ఉత్తరాల మూలంగా బహు లాభకరమైన మార్పులు రానున్నవి. వృత్తిరీత్యా మేలున్నది. సుఖానుభూతియున్నది. పత్రికాను కూలమున్నది. స్త్రీలకు : ఆనందం, ఆరోగ్య మందు వృద్ధి.

★ **మిధునం:** ఇటీవల కొంత కాలంగా జరుగని వ్యవహారాలు సానుకూలం. ఇటీవల బాగా జ రుగని వ్యాపారం సాఫీగా సాగిపోతుంది. రాజకీయ వాదులకు మేలు గాదు, గ్రహించాలి. వృత్తియందు అనుకూలం. ఉద్యోగానుకూలత చెప్ప నవసరం లేదు. స్త్రీలకు : సర్వానుకూలం.

★ **కర్కాటకం:** ఆదాయమున్నది. అనుకూల వ్యక్తుల సహాయమున్నది. మాటకు మన్నన చేకూరుతుంది. మీరు రాజకీయ వాదులా, అలాగైతే మేలు గాదు. ఆరోగ్యమా, అదీ అలాగే ఉంటుంది. గ్రహిస్తారుగా! స్త్రీలకు : ప్రయాణానుకూలం వృత్తిరీత్యా అనుకూలం.

★ **సింహం:** ఇంట శుభం జరుగుతుంది ఉత్తరాల మూలంగా పలు విషయాలు గ్రహిస్తారు. ఉత్తముల స్నేహం లభ్యం కాగలదు. 'మఘా' నక్షత్ర జాతకులకు అనుకూలం. రాజకీయంగా మేలు. స్త్రీలకు : ఒకానొక విషయం, సులభ సుందరంగా జరుగుతుంది. వృత్తిరీత్యా అనుకూలం. గ్రహిస్తారుగా?

★ **కన్య:** ఉద్యోగస్థులకు వారాంత విజయం. ఒకవేళ 'ప్రమోషన్' రావచ్చు. లేదా పదిమందిలో ప్రసిద్ధి ఏర్పడవచ్చు. పత్రికానుకూలత, కళారంగాన అనుకూలతకు ఆస్కారమున్నది. గ్రహించాలి. స్త్రీలకు : రాజకీయ వాదులా, మేలే. ఆరోగ్యరీత్యా అనుకూలం. వృత్తియందు వికాసం, గ్రహించండి.

★ **తుల:** చేయాలనుకున్న పనులు సక్రమంగా చేకూరుతుంది. అతిధి అభ్యాగతుల ఆదరణకు ఆస్కారం. కళారంగానుకూలత చేకూరుతుంది. భూ సంబంధమైన యత్నాలు చేసేలాగయితే కొంత కాలం వేచి ఉండాలి. స్త్రీలకు : సర్వానుకూలం.

★ **వృశ్చికం:** అధికారుల వలన జరుగవలసిన పనులు తొందరగా, అంటే ఈ వారం సానుకూల మయ్యే మార్గంలేదు. మీ కష్టం మీకు తప్పదని గ్రహించాలి. వస్తు సేకరణకు అనుకూలం గాదు. స్త్రీలకు : సకల విధ సౌకర్యాలకు అవకాశం గల వారం.

★ **ధనుస్సు:** ఆదాయమున్నది. అభిమానించే వ్యక్తులున్నారు. కుటుంబానందమున్నది. ఇంట పుణ్య కార్యానుకూలత యున్నది. విశేష ఆదరణకు, సభా మరియాదకు, పత్రికారంగ ప్రసిద్ధికి మీకు ఆస్కారం. స్త్రీలకు : ధన వసతి, ఉద్యోగానుకూలం. ప్రసిద్ధుల సంపర్కం.

★ **మకరం:** స్థితి యందు అభివృద్ధి యున్నది. బంధువర్గ సంబంధంగా ఆశించిన ప్రకారం శుభం జరుగనున్నది. అభిమానించే వారున్నారు. మేలైన సమయం, గ్రహించి మెలగండి. స్త్రీలకు : అన్ని విధాలా, అన్ని రంగాలలో యధాతధం. వృత్తి యందు వికాసమున్నది.

★ **కుంభం:** సుఖ సంపదలు, ధన వసతి, ఉద్యోగస్థులకు 'ప్రమోషన్' ఇలాంటివి లభ్యం కాగల వారం. కొందరకు అధికారమందు ఆశించిన అనుకూలత చేకూరగలదు. వారాంతాన చెప్పరాని ఆనంద మున్నది. స్త్రీలకు : శుభయోగ సమయం. 'రాహు' 'గురు' గ్రహానుకూలం.

★ **మీనం:** వృత్తియందు అనుకూలత. విద్యా విధాన పెంపు చేకూరుతుంది. కళా సాహితీ రంగాన ప్రసిద్ధి ఏర్పడుతుంది. అవసరాలకు వస్తువులు కొనగలుగుతారు. వ్యాపారం చేయగలుగుతారు. స్త్రీలకు : సుఖశాంతులు, ఆదాయం, ఒకవేళ కొనుగోలు చేయాలనుకున్న భూమి లభ్యం కావటం జరగవచ్చు. గ్రహించాలి.

-విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి



దూరదర్శనం
లత

హమ్ హిందూస్తానీ

కులమత భేదాల్లేకుండా అందరూ హిందూస్తానీలే అన్నది ఈ నాటిక సారాంశం. చెప్పే పద్ధతి ఏడిచినట్టుంది. సింధు అన్న పదం హిందుగా మారిందని అందరికీ తెలుసు– పాకిస్తాన్‌లాగా హిందూస్తాన్ కాబోలు.

సింధునదీ పరీవాహక ప్రదేశంలో నివసించిన వారు మాత్రం హిందువులు– లేదా సింధీలు కాని భారతీయులంతా ఆనదీ ప్రాంతాల్లో నివసించటం లేదు. అంటే పేరు పెట్టటంలో నే పెద్ద ఫెయిల్యూర్ – అశోక్ కుమార్ పురుడు పోసిన పిల్లలు ఎదిగారు. లవ్‌కాంప్ అనే నవలలో హిట్లరు అందమైన మగవాళ్ళనూ ఆడవాళ్ళనూ కలిపి – కొత్త జాతిని సృష్టించాలని ప్రయత్నం చేశాడు. అది ఘోరంగా ఫెయిలయింది. ఆ సంఘటన ఆధారంగా వ్రాసిన నవలే లవ్‌కాంప్ – ఇదీ అలాగే ఉంది.

తెనాలి రామకృష్ణ – చివరి భాగం అన్నారు – క్రిష్ణా సాని వలలో ఉన్న రాజుని ఈవతలకు లాగాడు రామకృష్ణుడు స్వరయోగం పేరుతో– మళ్ళీ రాజసభ చూపించారు. ఇప్పుడు రాయలు రామకృష్ణుడి సైగ ప్రకారం వచ్చిన వాళ్ళకు దర్శనం ఇవ్వడు– చరిత్ర కాకపోయినా బాగుంది – రామకృష్ణుడు – అశోక్‌కుమార్ బాగా నటించారు.

కెరటాలు – నాటికలో మొదటి భాగం

రచన ఆర్. వి. ఎస్. రామస్వామి–- ఇది స్టేజి నాటకం కన్నా అధ్వాన్నంగాఉంది. అదలాఉంచి కథలో పాత్రలు చెల్లెలుకి పెళ్ళి చేయాలనే నిరుద్యోగి అన్నా– మంచి స్నేహితుడూ – అవిటి తమ్ముడూ– లాటి పాత చెత్త – ఇక డైలాగులు "ఈ పువ్వు జీవితం ఎంతకాలమో తెలుసా?" "తెలియదు" లాటి బోరు డైలాగులు. అసలు నాటకంలో తెర ఎత్తగానే మూడు వాకిళ్ళూ, రాముల వారి పటం ఉన్న నాటకం సెట్టింగు కనిపిస్తుంది. అందులో కుర్చీలో కూర్చున్న అవిటి తమ్ముడు అక్కయ్యా! అని అరుస్తుంటాడు. అయిదు రూపాయలు లేక అప్పికోసను పంపలేని హీరోకి ఒక నాయనమ్మని మోసగించి అయిదు రూపాయలు మిగుల్చుకున్న ఒక రాగం.... (రాగం అన్నది పేరు) ఆ అయిదు రూపాయలూ ఇస్తాడు. అతని చదువుకి ఇల్లు తాకట్టు పెట్టించుకొన్న అప్పులాడు తన కూతుర్ని చేసుకోమంటాడు. హీరో మాత్రం ఆడపిల్ల పెళ్ళి కావాలనీ – నీ కూతుర్ని పెళ్ళి చేసుకోననీ మాట్లాడుతాడు. ఇంతలో అతని స్నేహితుడు సూర్యం వచ్చి తను పెట్ట బోయే వ్యాపారంలో వాటా ఇస్తానంటే వద్దని ఉద్యోగం స్వీకరిస్తాడు. ఆ చెల్లెలు మెలికలు తిరిగి పోతుంది అతన్ని చూసి.... ఛ. ఛ ఇలాటి నాటకాలు మా హనుమంతరాయ గ్రంథాలయంలో రోజూ ప్రదర్శిస్తారు. నాటకం మొదటి భాగం కనక వ్రాశాను. ఏమీ బాగాలేదు.

బహదూర్‌షా జఫర్

వాడిదలీషాకి నానా ఫడ్నవీస్‌కీ ఝాన్సీ లక్ష్మికీ ఉత్తరాలు వ్రాసి పంపిస్తాడు బహదూర్‌షా.

ఆ ముగ్గురూ ఒక రహస్య స్థావరంలో ఉండి పికారొచ్చిన చక్రవర్తిని అతిరహస్యంగానే పట్టి తెప్పించి మంతనాలాడతారు. వాడిదలీషా– ఫడ్నవీస్‌కి పడదు లక్ష్మీబాయి– భారత నరేశుడెదట. మీరు కొట్టుకు చావకండి అని – వాళ్ళని అంటుంది – రక్తతిలకం చక్రవర్తికి పెట్టి స్వాతంత్ర్య సమరం సాగిస్తారు. కాని దర్బారు కుట్రలు జరుగుతూనే ఉంటయి. మెట్కాఫ్ రాజపత్ని మాలికాయా అలంని కలుసుకొని వ్యాపారం సాగటం లేదు కనక సంవత్సరానికి 8 లక్షలు ఇస్తానంటాడు. ఢిల్లీ చక్రవర్తికి వాళ్ళు కట్టిన విలువ అది. చాలా బాగుంది నాటకం.

కిస్సా ఖాట్మండూ మే?

రచన సత్యజిత్‌రాయ్. ఏతావాతా ఏమిటంటే ఖాట్మండులో కట్టెల లారీలగుండా కొన్ని పెట్టెలు కలకత్తా లాటి చోట్లకి పోతున్నాయ్. ఆ రోజు ఉదయాన్నే వెడతాయని క్లూ అందింది డిటెక్టివ్‌కి. కారు అద్దెకు తీసుకుని వెంట బడతారు కాని ఒకటైరు పంక్చరయి పట్టుకోలేక పోతారు. అడివిలో ఉన్న ఇంటికి పోయి డిటెక్టివ్ తలుపు తట్టబోతుండగా ఆయియే దేవేందర్‌సాబ్ అని వినబడుతుంది. లోపల దొంగమందుల డాక్టరూ స్మగ్లరూ ఉంటారు. ఏదో ఉంది ఫరవాలేదు.

లోకకథ

కాశ్మీరులో ముగ్గురు కొడుకులు గల సంసారంలో కలతలొస్తాయి. చిన్న మరిదికి పాలు అనవసరం అనుకుంటుంది. వాళ్ళలో ఐకమత్యానికి బీటలు పట్టినయ్. కొట్టుకుంటున్న కొడుకులకి బుద్ధి చెప్పాలన్నట్టుగా తండ్రి చెట్టు కొడుతూ చెట్టు కిందపడ్డాడు.

ఆ చెట్టు ఎత్తాలంటే ముగ్గురు కొడుకులు ఆరు చేతులూ అవసరం అయినయి.

కలిసి ఉంటే ఉండే బలాన్నీ ఐకమత్యపు విలువనీ కొడుకులకు చెపుతాడు తండ్రి. చక్కని నీతికథ. నయా దిశాయెలాటి సీరియల్సు కన్న ఈ లోకకథలు బాగున్నాయి. బాగుంటాయి కూడా. □

'శక్తి'లో మూన్‌మూన్‌సేన్, చిత్రాశర్మ



హైదరాబాద్ నోట్‌బుక్


తెలుగు వారి కర్తవ్యం

వ్యాధులు మనదేశంలోని ఆదిమవాసులలో ఒకరు. వీరు మహావీరవరులు. వీరి పరాక్రమ సాహసాలను గురించి రెండు వేల యేళ్లనాటి హాలుని గాథా సప్తశతిలో వర్ణనలు కోకొల్లలు. వీరు సాతవాహన గుప్త, చాళుక్య, విజయనగరాది రాజుల సైన్యాలలో ఉండి వారికి అసంఖ్యాక విజయాలు చేకూర్చారు. వీరి ప్రధానావాసం ఆంధ్రప్రదేశ్‌లోని కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలు, కర్నాటకంలోని బళ్లారి, రాయచూరు, గుల్బర్గా జిల్లాలు, తమిళనాడులోని చెంగల్పట్టు, నార్త్ ఆర్కాడు జిల్లాలు. ఈ ప్రాంతాల నుంచి వీరు దేశమంతా విస్తరించారు యోద్ధలుగా. వ్యాధ శబ్దం వాహ – వాయ – బాయ – బోయ అని తెలుగులోను, వాధ – బాధ – బేద – బేడర్ అని కన్నడంలోను, బేడర్ అని తమిళంలోను మారింది. వీరు ప్రతి రాజ్యంలోను సైనికులుగా, సేనా నాయకులుగా ఉన్నారు. ముఖ్యంగా చాళుక్య, విజయ నగర రాజ్యాలలో విజయనగర చక్రవర్తులు ముఖ్యంగా కృష్ణదేవరాయలు వీరిని సేనాపతులుగా, అంగరక్షకులుగా, దుర్గాధిపతులుగా నియమించాడు. కృష్ణ రాయల అంగరక్షకులలో ఇద్దరు డొణ్ణేనాయక, గొడుగుపాల అనేవారు. డొణ్ణే నాయకుడంటే బాణా కర్ర నాయకుడు అని అర్థం. ఇతని పేర బళ్లారి జిల్లాలో డొణ్ణే నాయకనపుర అనే వూరుంది. ఇది నేడు డాణాపుర అయింది. గొడుగుపాలుని పని రాయలు గుర్రంపై వెళ్లుతూంటే, అతనికి ఎండ తగలకుండా గొడుగు పట్టడం. ఇతని సేవలకు మెచ్చి రాయలు ఒకరోజు రాజ్యమిచ్చాడని, ఇతడు ఆ రోజు తనకు ఇష్టమైన దానధర్మాలు చేశాడని చరిత్ర. మహాపరాక్రమవంతులైన ఈ వ్యాధులు రాజ్యాలు స్థాపించారు, అవిక్రమంగా కాలగర్భంలో లీనమయాయి. అలాటి రాజ్యాలలో ఒకటి సురపుర రాజ్యం. ఇది కృష్ణా భీమానదుల మధ్య గల సారవంతమయిన నల్లరేగడి ప్రాంతంలో నెలకొన్నది. విజయనగర సార్వభౌములకు యుద్ధాలలో సైన్యాలను పంపడం వీరి ప్రధాన విధి. ఈ రాజ్యంలో 15 వ శతాబ్దంలో పాలకుడుగా వున్న రాఘవపాము నాయకుడు గొప్ప విద్వాంసుడు. భార్గవ స్మరణగామనే సంస్కృత గ్రంథాన్ని తెలుగు ప్రబంధంగా అనువదించిన వైష్ణవ భక్తాగ్రణి. ముఖ్యమైన సంగతి చెప్పడం మరచాను. ఈ వ్యాధుల మాతృభాష ఎక్కడైనా తెనుగే. ఈతని ఆస్థానంలో మహా విద్వాంసులు ఉండేవారు. వారి పేరు బుక్కపట్టణం వేంకటాచార్యులు, అణ్ణయాచార్యులు, శ్రీనివాసాచార్యులు అని. వీరు ఆంధ్ర సంస్కృత ప్రాకృత కన్నడ మహారాష్ట్ర ఫారసీ భాషలలో విద్వాంసులే కాక విశిష్టాద్వైత సిద్ధాంత రక్షకులు. బహుగ్రంథ కర్తలు. విశిష్టాద్వైత ప్రచారం, హరిసర్వోత్తమత్వ ప్రచారాలకు జీవితం వ్యయించిన వారు. వీరిలో వేంకటాచార్యులు ఆనంద తారతమ్య ఖండనం, జగన్మిధ్యాత్వ ఖండనం, వేదాంత దేశికదండకం, వేదాంత దేశికాష్టోత్తర శతనామస్తోత్రం, సిద్ధాంత రత్నావళీ, సిద్ధాంత వైజయంతీ అనే గ్రంథాలు రచించారు. అణ్ణయాచార్యులు ఆచార్య వింశతి, ఆనంద తారతమ్య ఖండనం, తత్త్వ గుణాదర్శస్స వ్యాఖ్యః, శ్రీనివాస స్తుతి, నృసింహ వింశతి అనే రచనలు చేశారు. శ్రీనివాసాచార్యులు శతాధిక గ్రంథకర్తలు. అభినవ నిగమాంతదేశిక బిరుదాంకితులు అరుణాధికరణ సరణి వివరిణీ, ఆనంద తారతమ్యఖడనం, ఓంకార వాదార్థః (నయమణి కలికా), జిజ్ఞాసాదర్పణః, జ్ఞానరత్న ప్రకాశిక్, ఐత్వ దర్పణః, ప్రధాన ప్రతితంత్ర దర్పణః, నయద్యు మణిః దీపికాచ, పుచ్ఛ బ్రహ్మవాద నిరాసః, భేదదర్పణః, విరోధ నిరోధః (భాష్య పాదుకా), విరోధ విరోధినీ ప్రమాథినీ, షష్ఠ్యర్థ నిర్ణయం, సిద్ధాంత చింతామణిః (ఉపాదానత్వ సమర్థనం), దత్తరత్న ప్రదీపికా, నీతి శతకం, సుభాషితాని, హంగురు దర్పణః, తత్త్వ మార్తాండః, ప్రణవ దర్పణః మొదలయినవి తత్త్వ మార్తాండః అనేది శ్రీభాష్య వ్యాఖ్యాన రూపం, శ్రీభాష్యంపై ద్వైతాద్వైతులు చెప్పే ఆక్షేపణ రూపమైన చంద్రిక అనే గ్రంథానికి ఖండన రూపమూ అయిన ఉద్గ్రంథం. ఈముగ్గురిలో అణ్ణయాచార్యుల కుమారులు శ్రీనివాసాచార్యులు, వేంకటార్యులు, బుచ్చి వేంకటాచార్యులు అనేవారు ముగ్గురు. వీరిలో వేంకటాచార్యులు కిరీటం వేంకటాచార్యులని, అయ్యగారని ప్రసిద్ధులు. ఈయన విశిష్టాద్వైత కిరీటాన్ని ధరించి తిరుగుతున్న ఆజానుభాహువట. ఈయన అచలాత్మజా పరిణయం అనే తెలుగు శ్లేష కావ్యం, అలంకార కౌస్తుభార్థ, కృష్ణ భావ శతకం, గజసూత్ర వాదార్థః, ప్రామాణ్య వాదఖండనం, శృంగార తరంగిణీ, గదాధరీయ ఖండనం, హయగ్రీవ దండకం, యతిరాజ దండకం, దశావతారస్తోత్రం, లక్ష్మీ దండకం మొదలయిన రచనలు చేశారు. ఈయన ఆసేతు సీతనగం తిరిగి వివిధ దార్శనికులన ఓడించి, హరి సర్వోత్తమత్వం స్థాపించారు. ఈయన గ్రంథ రచన కంటె వాకార్థాలకు ప్రాధాన్యమిచ్చారు. ఈయన రెండవ బాజీరావు కాలంలో పూనా నగరానికి వెళ్లారు. ఆయన ఆస్థానంలోని పురుషోత్తమ శాస్త్రి మహా విద్వాంసుడు. అతనికి ఒకేకన్ను. వేంకటాచార్యులకు రెండవ బాజీరావు కూడ లేచి స్వాగతమిచ్చేవాడట. ఆ పురుషోత్తమశాస్త్రి లేవలేదట. వేంకటార్యులు అతనిని వెక్కిరిస్తూ,

ఆఖండలః సహస్రాక్షః
 విరూపాక్షః త్రిలోచనః
అన్యే ద్విలోచనా స్సర్వే
 కో భవా నేకలోచనః?

అని ప్రశ్నించాడట. ఈయన పంజాబు అంతటా తిరిగి వాక్యార్థాలు చేశాడు. ఈయన దశావతార

ఢిల్లీ ఎ.పి. భవన్‌లో స్పెషల్ కమీషనర్ వారం రోజుల పాటు కనుల పండువుగా ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రాజ్యోత్సవాలని ప్రారంభిస్తున్న ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ జి. రామిరెడ్డి, కమిషనర్ శ్రీ వైద్యనాథయ్యర్.



కార్టూనిస్టులకు సూచనలు !

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి.

★ ప్రతి కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి !

★ వ్యాఖ్య **చిన్నదిగా, క్లుప్తంగా** వుండాలి. అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి ! కార్టూన్ మీదే పేరూ, వూరూ అన్నీ రాస్తే అవి తిరస్కరించబడే అవకాశాలుంటాయి.


★ సొంత చిరునామాగల తపాలా బిళ్లలు అంటించిన కవరుగల కార్టూన్‌లను తిప్పి పంపడం జరుగుతుంది. దారిలో పోయేవాటికి మా బాధ్యత లేదు.


★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నిగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది. పరిశీలనకు ఐదారు వారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు – బాగా ముందుగా వాటి కవరుమీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగా వచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.





అనకాపల్లి ఆర్ట్స్ అకాడమీ, అనకాపల్లి జేసీస్ వారు సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'బాలి చిత్ర కళా ప్రదర్శన'లో చిత్రకారుడు శ్రీ బాలిని సన్మానిస్తున్న దృశ్యం.

అవీ - ఇవీ - అన్నీ

పద్మశ్రీ ఘంటసాల అకాడెమి తెలుగు సినీ పాటల పోటీలు

అమర గాయకుడు శ్రీ ఘంటసాల 65వ జన్మదినోత్సవము, అకాడమీ తృతీయ వార్షికోత్సవము సందర్భముగా స్థానిక పద్మశ్రీ ఘంటసాల అకాడమీ వారిచే డిసెంబరు 13న రాష్ట్ర స్థాయిలో తెలుగు సినీ పాటల పోటీలు విజయవాడ శ్రీ వెలిదెండ్ల హనుమంతరాయ గ్రంథాలయం హాలులో జరుగును.

పాటల పోటీలలో పురుషుల, స్త్రీల విభాగాలకు వేర్వేరుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా బంగారు పతకములు, వెండి పతకములు, షీల్డులు, సర్టిఫికెట్లు ఇవ్వబడతాయని నిర్వాహకులు తెలియ చేస్తున్నారు.

పోటీలలో పాల్గొనే వారు 10-12-1987 నాటికి పరభాస్తుల కొరకు కార్యదర్శి, పద్మశ్రీ ఘంటసాల అకాడమీ (రిజిష్టరు) చిట్టినగర్, విజయవాడ-9కి సంప్రదించవచ్చు.

శ్రీ వేముగంటి నరసింహాచార్యులుకి గడియారం వేంకట శేషశాస్త్రి అవార్డు

"రచన సాహిత్య వేదిక - కడప" వారు ఏర్పాటు చేసిన - మహాకవి స్వర్గీయ గడియారం వేంకట శేషశాస్త్రి అవార్డు 1987 సంవత్సరానికి శ్రీ వేముగంటి నరసింహాచార్యులు గారి గ్రంథం "కాంతి వైజయంతి"కి లభించింది. బహుమతి మొత్తం ఐదు వందల రూపాయలు, కవి ప్రశంస, పట్టప్రదానం విజేతకు త్వరలో జరుగనున్న ప్రత్యేక సభలో అందజేయబడుతుందని ఆ సంస్థ కార్య వర్గం తరఫున శ్రీ ఏహారి తెలియ చేసారు. □

హైదరాబాద్ నోట్‌బుక్

స్తోత్రం

వరదం వరదంతి హృదాతసహ్ర
చ్ఛరదం శరదంబుజనేత్ర యుగమ్
దర దివ్యరథాంగధరం మధురం
మధురాకృతదామ మహః కలయే
ఇనవంశ నావాంబుధి చంద్ర మసం
సమసంగి జనాత్మని సంతమసమ్

ఇతి నిర్మల తిర్మల తిర్మల బుక్కపురీ
కుల ధర్మలతాగ్ర సుమస్త బకః
న్యనివేదిహ వేంకటకవ్య సదః
అవధారయతా మవతారకథాః

అని మధుర గతితో సాగుతుంది. లక్ష్మీ దండక మయితే, జయతు జయతు శ్రీ శేషశైలాధి సామందతీలా మహానంద వేలాతి గాంభోధి డోలాయమానార్మి జాలామితోల్లాస దాలాపమాలా సుధాలాల నీయోరు బాలా మృతాం శుపమాలాస్య సంసక్తపాలా - ఇత్యాదిగా నడుస్తుంది. ఈయన తమ్ముని పేరు గూడ వేంకటాచార్యులు కావడం వల్ల ఆయనను బుచ్చి వేంకటాచార్యులన్నారు. ఈయన విష్ణుస్తుతి, వేదాంత కారికావళీ, ఇంద్రాష్టోత్తర శతనామస్తోత్రం మున్నగు రచనలు చేశారు. మహావిద్వాంసులయిన అణ్ణయాచార్య శ్రీనివాసాచార్యుల సమాధి బృందావనాలను ఇటీవల నేను దర్శించాను. ఇవి గుల్బర్గా జిల్లా సురపురం పట్టణం సివారులోని సిద్దన అగిసి అనే చోట ఆలనాపాలనా లేక ఉన్నాయి. కిరీటం వేంకటాచార్యుల నివాస స్థలం సురపురం పట్టణంలోని గోపాలస్వామి పుష్కరిణి గట్టున (పెరుమాళ్ళ బావి - దేవరబావి గట్టున) ఉంది, ఎవరి అధీనంలోని ఈ మహావిద్వాంసుల స్మారకంగా వీటిని భద్రపరచుకొనడం, ఆంధ్రుల, ముఖ్యంగా కర్నాటక రాష్ట్రంలోని తెలుగు వారి కర్తవ్యం తెలుగు జాతికి గొప్ప ప్రతిష్ఠ తెచ్చిన వీరి స్మారకాలను పరిరక్షించుకోడమన్నా మన తెలుగు వారి కనీసపు ధర్మం. మతంకులం ప్రధానం కాదు, జాతికి, భాషకు ఎంత సేవ చేశారనేది ముఖ్యం. ఈ విషయంలో సురపురరాజవంశీయులైన, మహాదారులు, తత్వ చింతకులు అయిన శ్రీ పిడ్డె నాయకులు, వారి కుమారులు కూడా శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నాను.

ఉపశ్రుతి :-

మా మిత్రులు ఒకరు ఏదో ఆలోచిస్తూ కూచున్నాడు. ఏమిటిందే! ఏదో దీర్ఘాలోచనలో ఉన్నారే? - అన్నాను. ఏమీ లేదు. నా మిత్రుడొకడు అంతా డబ్బుతోనే సాధించవచ్చునంటాడు. అది సాధ్యమా అని ఆలోచిస్తున్నాను - అన్నారు ఆయన. ఆయనకు మరొకమారు చెప్పండి అంతా డబ్బుతోనే సాధించవచ్చుననుకొనే వాడు డబ్బు కోసం ఏ పనైనా చేయగలడని బెంజిమిన్ ఫ్రాంక్లిన్ (అమెరికా పాత అధ్యక్షులలో ఒకరు) చెప్పాడని తెలుపండి - అన్నారు.

-తిరుమల రామచంద్ర

Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S. Nageswara Rao, at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada - 520 003. Acting Editor : M. Madhava Rao, Chief Editor : S. Radhakrishna.
Phones : Business : 61247, 61248, 75569 Editorial : 75667